మంగళవారం 10.09.2024

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక



సీఎం చంద్రబాబు అనుభవం ఏంటో ఈ విపత్తు సమయంలో చూస్తున్నాం.గతంలో హుద్‌హుద్ తుపాను సమయంలోనూ చంద్రబాబు ముందుచూపు చూశాం. ప్యాలెస్ లో కూర్చొని ప్రభుత్వాన్ని విమర్శించడం చాలా తేలిక... కానీ పని చేసేవాళ్లకే ఎంత కష్టమో తెలుస్తుంది.

- ఆలపాటి రాజేంద్ర ప్రసాద్

సంపుటి - 32 సంచిక -201 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00

## గత ప్రభుత్వ తప్పులను సరి చేస్తా...



- సుద్దగడ్డ వాగు సమస్యకు పరిష్కారం చూపుతా
- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

**పిఠాపురం ( జర్నలిస్ట్ ఫైల్ ):** ఏటా ముంపునకు కారణమవుతున్న ఏలేరు ప్రాజెక్ట్ ఆధునికీకరణ పనులను చేపడతామని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలో ఏలేరు వరద ప్రభావిత ప్రాంతంలో పవన్ కల్యాణ్ పర్యటించారు. ముంపునకు గురైన ప్రాంతాలను పరిశీలించారు. ఏలేరు వరద బాధితులను ఆదుకుంటామని పవన్ కల్యాణ్ భరోసా ఇచ్చారు. వైఎస్సార్సీపీ హయాంలో ముంపు ప్రాంతాల్లో పేదలకు ఇళ్లు కట్టించారని విమర్శించారు. ఏలేరు రిజర్వాయర్ పరిస్థితిపై కలెక్టర్‌తో మాట్లాడుతూనే ఉన్నానని అన్నారు. ముంపు ప్రాంతాల్లోని వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని పవన్ కల్యాణ్ సూచించారు. సుద్దగడ్డ వాగు సమస్యకు పూర్తిస్థాయి పరిష్కారం చూపుతామని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. గత ప్రభుత్వ తప్పులను మేము సరిచేయాల్సిన అవసరం ఉందని అన్నారు. జగనన్న కాలనీ స్థలాన్ని రూ. 30 లక్షల భూమిని రూ. 60 లక్షలకు కొన్నారని విమర్శించారు. ఏలేరు వరద పరిస్థితిపై సమీక్షించి సూచనలు ఇస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వ పాలనలో పంచాయతీలు పూర్తిగా నిర్వీర్యం చేశారు పవన్ మండిపడ్డారు. కష్టాల్లో ఉన్న పంచాయతీలను ఆదుకోవడం బాధ్యతగా తీసుకున్నట్లు

## వరద ప్రాంతాల్లో 95శాతం విద్యుత్ పునరుద్ధరణ



- మంత్రి గొట్టిపాటి రవికుమార్

**విజయవాడ ( జర్నలిస్ట్ ఫైల్ ):** వరద ప్రాంతాల్లో 95 శాతం విద్యుత్ పునరుద్ధరణ చేశామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. లంక గ్రామాల్లో పూర్తిగా విద్యుత్ పునరుద్ధరించినట్లు చెప్పారు. విద్యుత్ పునరుద్ధరణ కాని వరద ప్రాంతాల్లో మంత్రులు గొట్టిపాటి, డోలా బాల వీరాంజనేయస్వామి సోమవారం పర్యటించారు. జక్కంపూడి, కబేళా సెంటర్, సితార్ రోడ్డు తదితర ప్రాంతాల్లో పర్యటించి విద్యుత్ పునరుద్ధరణ సవాళ్లను ప్రజలకు వివరించారు. విజయవాడ పరిసరాల్లో మరో 5 శాతం విద్యుత్ పునరుద్ధరించాల్సి ఉందని, మంగళవారం నాటికి విద్యుత్ సమస్య పరిష్కారం అవుతుందని మంత్రి గొట్టిపాటి చెప్పారు.

# అన్ని రకాలుగా అండగా ఉంటాం

- 9 రోజుల పాటు చేసిన పనులపై సంతృప్తిగా ఉన్నాం
- వరద బాధితులకు మనోధైర్యం ఇవ్వాలనేదే మా లక్ష్యం
- బుడమేరు నుంచి కొల్లేరుకు నీరు వెళ్లకుండా కబ్జాలు చేశారు
- అధిక వర్షాలు, గత పాలకుల పాపాలు ఇప్పుడు శాపాలుగా మారాయి
- జటిలమైన సమస్యను సమన్వయంతో పరిష్కరిస్తాం
- ఆప్కో, ఇతర సంస్థల వద్ద వస్త్రాలు తెచ్చి బాధిత ప్రజలకు పంపిణీ చేస్తాం
- 9 వ రోజు వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తూ సీఎం చంద్రబాబు వెల్లడి







**విజయవాడ ( జర్నలిస్ట్ ఫైల్ ):** 'ప్రజల కోసం తాను జీవితాంతం పని చేస్తానని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. తొమ్మిదో రోజు విజయవాడలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన సీఎం స్వయంగా బాధితులకు అందుతున్న సహాయక చర్యలను అడిగి తెలుసుకున్నారు. వరద బాధితులకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. బాధితుల బాధలను చూసి, కష్టాలు విని ఆవేదన వ్యక్తం చేశారు. అధిక వర్షాలు, గత పాలకుల పాపాలు ఇప్పుడు ప్రజలకు శాపాలుగా మారాయన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లోని స్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని, ఉదయం నిద్ర లేచింది మొదలు అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తున్నామని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ... విజయవాడలో వరదలపై యుద్ధం చివరి దశకు వచ్చిందని తెలిపారు. ఈ యుద్ధం రేపటితో ముగిస్తే.. ఇక రాష్ట్ర పునర్నిర్మాణంపై దృష్టి పెడతామన్నారు. 9 రోజుల్లో విజయవాడ నగరాన్ని సాధారణ స్థితికి తీసుకువచ్చామన్నారు. సింగ్‌నగర్‌లో వరద వచ్చిన తొలి రోజు తాను పర్యటించినప్పటికీ, ఇప్పటి పరిస్థితుల్లో చాలా పురోగతి కన్పించిందన్నారు. తొలి రోజు ప్రజలు చాలా బాధగా ఉండటం చూశానని, 9వ రోజు తమ ప్రభుత్వంపై ప్రజలకు ఉన్న పూర్తి నమ్మకం చూశానని తెలిపారు. ప్రజలు సర్వస్వం కోల్పోయారని, వారిని ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో చాలా గృహాలు దెబ్బతిన్నాయని, ఇళ్లలో చెడిపోయిన వస్తువులను బాగు చేసేందుకు అర్బన్ కంపెనీకి బాధ్యతలు అప్పగిస్తామన్నారు. వస్తువులు రిపేర్ చేసేందుకు అవసరమైన ప్లంబర్, ఎలక్ట్రీషియన్, కార్పెంటర్ తదితరులు కావాలంటే ఆన్ లైన్ ద్వారా బుక్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ సెల్ ఫోన్ వినియోగించడం నేర్చుకోవాలని సూచించారు. అర్బన్ యాప్ వినియోగంపై ప్రజల్లో చైతన్యం పెంచుతామన్నారు. తద్వారా ఇంటివద్దే అన్ని సేవలు అందుతాయన్నారు.


వరదల వల్ల కట్టు బట్టలు తప్ప అన్నీ పోగొట్టుకోవడం శోచనీయమన్నారు. ఆప్కో, ఇతరత్రా సంస్థల దగ్గర ఎన్ని దుస్తులు ఉంటే అన్నీ తెప్పించి ఇస్తామని హామీ ఇచ్చారు. ఇంట్లో ఉండే వారికి తలా ఒక జత దుస్తులు అందజేస్తామని హామీనిచ్చారు. ఎప్పుడూ లేని విధంగా ఇళ్లలో ఫైర్ ఇంజిన్లతో బురద తొలగిస్తున్నామన్నారు. ప్రజలు ధైర్యంగా ఉండాలని, ఎవరూ అధైర్యపడవద్దన్నారు. విజయవాడను పైలట్ ప్రాజెక్టుగా తీసుకుంటామన్నారు.

ముంపు ప్రాంతాల్లో ప్రజలకు హెలికాప్టర్లు, డ్రోన్ల ద్వారా ఆహారం సరఫరా చేసామని తెలిపారు. సకాలంలో నిత్యావసర వస్తువులు, డ్రైఫుడ్ అందించామన్నారు. కూరగాయలు రూ. 2, రూ. 5, రూ. 10కే ఇస్తున్నామన్నారు. ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు శక్తిని, భరోసానిస్తున్నామన్నారు. విపత్తు సమయంలో డబ్బుల గురించి కాదు మానవత్వం గురించి, మనిషి గురించి ఆలోచిస్తున్నామన్నారు. చివరి వ్యక్తికి న్యాయం జరిగేంతవరకు అండగా ఉంటామని పేర్కొన్నారు. ఐవీఆర్ఎస్ కాల్స్‌కు ప్రజలు స్పందించాలని కోరారు. ప్రజలు అభిప్రాయం తెలిపితేనే తమకు వాస్తవాలు తెలుస్తాయని తద్వారా నాణ్యమైన సేవలు

2 లో

## వరద బాధితులకు భరోసా ఇవ్వండి

- అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- సహాయక చర్యలు వేగవంతం చేయండి
- నష్టం పూర్తి స్థాయిలో అంచనా వేయాలి
- రైతులకు అధికారులు అందుబాటులో ఉండాలి
- వ్యవసాయ, ఉద్యాన, మత్స్య శాఖ, పశుసంవర్ధక శాఖల ఉన్నతాధికారులతో మంత్రి అచ్చెన్నాయుడు



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ):** ఏపీలో వ్యవసాయ, ఉద్యాన, మత్స్య శాఖ, పశుసంవర్ధక శాఖల ఉన్నతాధికారులతో మంత్రి అచ్చెన్నాయుడు అత్యవసర సమీక్ష నిర్వహించారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో భారీ వర్షాలు, విజయవాడ వరద సహాయక చర్యలపై ఆయన టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో రైతులకు అధికారులు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. తీర ప్రాంతాల్లో మత్స్యకారుల నివాస ప్రాంతాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వేట పూర్తిగా నిషేధించి మత్స్యకారులను వేటకు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. అదేవిధంగా మత్స్యకారుల బోట్లను సురక్షిత ప్రాంతాల్లో ఉంచాలని అచ్చెన్నాయుడు అధికారులకు ఆదేశాలు జారీ చేసారు.

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రాష్ట్రంలో 1.81 లక్షల హెక్టార్లలో పంట నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనా వేశామని అధికారులు మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు. అత్యధికంగా 1.39 లక్షల హెక్టార్లలో వరి పంట నష్టం జరిగిందన్నారు. 113 మండలాల్లో 197 బృందాలు, 131 పశు వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. 16,044 పశువులకు వైద్య సేవలు అందించామని తెలిపారు. 21,857 పశువులు, గొర్రెలు, మేకలకు వ్యాక్సినేషన్ చేశామని అధికారులు మంత్రికి వివరించారు.

బుడమేరు వరద, వర్ష బీభత్సం ఉన్న ఆరు జిల్లాల్లో 286 పశువుల కళేబరాలు తొలగించి వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకున్నామని అధికారులు మంత్రికి తెలిపారు. 3449 హెక్టార్లలో మత్స్య సాగుపై వరద,

2 లో

## ప్రకాశం బ్యారేజి గేట్లను బోట్లు ఢీకొట్టిన ఘటన.. ఇద్దరు అరెస్టు

- ఆ బోట్లు వైసీపీ నేతలవే.. సీఎంకు అధికారుల నివేదిక
- దర్యాప్తు ముమ్మరం - నిందితులకు 14 రోజుల రిమాండ్



వివరాలు 2 లో

## కుట్ర.. అంతు తేలుస్తాం

- ప్రకాశం బ్యారేజీని పడవలు ఢీకొట్టిన ఘటనపై ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నాం
- విచారణలో ఒక్కో అంశం బయటకు వస్తోంది. - అందరికీ అన్నం పెట్టే అన్నదాతలకు నష్టం కలిగించాలనుకునే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తప్పవు..
- మా ప్రభుత్వం నిర్మాణం పరంగా దృష్టి సారిస్తుంటే ప్రతిపక్షం విధ్వంసం దిశగా ముందుకెళ్తోంది.
- ఘటనపై ముఖ్యమంత్రి చాలా సీరియస్ గా ఉన్నారు.
- కౌంటర్ వెయిట్ల పునరుద్ధరణ పనులను రెండు రోజుల్లో పూర్తిచేస్తాం.
- మీడియాతో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు.



**విజయవాడ ( జర్నలిస్ట్ ఫైల్ ):** ప్రకాశం బ్యారేజీని అయిదు పడవలు ఢీకొన్న ఘటనపై ముమ్మర దర్యాప్తు జరుగుతోందని.. అందరికీ అన్నంపెట్టే అన్నదాతలకు నష్టం చేకూర్చడానికి ప్రయత్నించిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి

2 లో

## ప్రభుత్వ సేవలు భేష్

- ప్రభుత్వం అందిస్తున్న సేవలపై మంత్రి సవిత సమక్షంలో ప్రజల ప్రశంసలు



వివరాలు 2 లో

## వైద్య సిబ్బంది సైనికుల్లా పనిచేయాలి

- వరద ప్రభావిత ప్రాంతాల్లో వైద్య ఆరోగ్య శాఖ పెద్ద యజ్ఞాన్నే చేపట్టింది
- 190 ఉచిత వైద్య శిబిరాల్ని ఏర్పాటు చేశాం
- వెయ్యికి పైగా సిబ్బంది క్షేత్ర స్థాయిలో పనిచేస్తున్నారు
- లక్ష మందికి పైగా మెడికల్ క్యాంపుల్లో వైద్య సేవల్ని పొందారు
- ఇంటింటికీ అత్యవసర మెడికల్ కిట్లు అందజేశాం
- వరద ప్రభావిత ప్రాంతాల్లో వైద్య సేవలందించడంలో వైద్య ఆరోగ్య శాఖ ముందుంది
- ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశంతోనే తాము నిరంతరమూ పనిచేస్తున్నాం
- వైద్య సిబ్బంది శిక్షణా కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్
- వరద ప్రభావిత ప్రాంతాల్లో ఈనెల 11 నుండి దోమల లార్వాల నిర్మూలనా కార్యక్రమం

వివరాలు 2 లో





## నష్టపోయిన ప్రతి ఇంటికీ నష్టపరిహారం

- వరద నష్టం అంచనా వేయటానికి మొత్తం 1,700 ఎన్యుమరేషన్ బృందాల ఏర్పాటు
- నష్టం అంచనా నమోదుకు ప్రత్యేక యాప్
- త్వరితగతిన శానిటేషన్ ప్రక్రియ పూర్తికి చర్యలు
- ప్రజలు, పంట దెబ్బతిన్న రైతులు ఎవరూ అధైర్యపడవద్దు, ప్రభుత్వం అందరికీ అండగా ఉంటుంది
- ప్రజలకు భరోసా కల్పించే లక్ష్యంతో పని చేస్తున్నాం
- విపత్కర పరిస్థితుల్లో సీఎం చంద్రబాబు నాయుడు అవలంభిస్తున్న విధానాలు, వ్యవహరిస్తున్న తీరుపై సర్వత్రా హర్షం
- బురదను తొలగించే పనిలో ప్రభుత్వం ఉంటే కొందరు బురదజల్లేలా విమర్శలు చేయడం సరికాదు
- రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి



**విజయవాడ ( జర్నలిస్ట్ ఫైల్ ):** వరదల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అవలంభిస్తున్న విధానాలు, వ్యవహరిస్తున్న తీరును ప్రశంసిస్తూ జాతీయస్థాయిలో చర్చ జరుగుతోందని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు.

సోమవారం ఎన్టీఆర్ జిల్లా విజయవాడ కలెక్టరేట్ కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ గత 9 రోజులుగా విజయవాడ చరిత్రలో ఎన్నడూ చూడని ఉపద్రవం ముంచుకొచ్చిందన్నారు. ప్రకాశం బ్యారేజీ నిర్మాణం తర్వాత రికార్డు స్థాయిలో వరదలు రావడం జరిగిందని, ఇలాంటి విపత్కర పరిస్థితులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలోని ప్రభుత్వం ధీటుగా ఎదుర్కొంటోందన్నారు. ఈ ఉపద్రవాన్ని ఎదుర్కోవడంలో వయసు, ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా బస్సులోనే ఉంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చూపిస్తున్న చొరవ, కృషి, పనితీరు భవిష్యత్ తరాలకు, నాలాంటి ప్రజాప్రతినిధులకు ఆదర్శమని కొనియాడారు. వరదల నేపథ్యంలో ఐఏఎస్ అధికారులు, ఉన్నతాధికారులు, మంత్రులు, ప్రజా ప్రతినిధులు, అధికార, పార్టీ యంత్రాంగం, సచివాలయ సిబ్బంది ఇలా ప్రతి ఒక్కరూ నిరంతరం పర్యవేక్షిస్తూ సమస్య పరిష్కారం దిశగా పాటుపడుతున్నారన్నారు.

ఒకవైపు గత వారం రోజులుగా లోతట్టు ప్రాంతాల్లో నీరు ఉన్న పరిస్థితి..మరో వైపు అల్పపడీన ప్రభావంతో మళ్లీ వర్షాలు పడుతున్నాయన్న వార్తలు ప్రజల్లో

2 లో

# వైద్య సిబ్బంది సైనికుల్లా పనిచేయాలి




**విజయవాడ ( జర్నలిస్ట్ ఫైల్ ) :** వరద ప్రభావిత ప్రాంతాల్లో సేవలందించేందుకు వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది సైనికుల్లా పనిచేయాలని వైద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. 190 ఉచిత వైద్య శిబిరాల్ని ఏర్పాటు చేశామని, లక్ష మందికి పైగా బాధితులు ఈ శిబిరాల్ని సందర్శించారన్నారు. వెయ్యి మందికి పైగా వైద్య సిబ్బంది క్షేత్ర స్థాయిలో పనిచేస్తున్నారన్నారు.

సోమవారం నాడు తుమ్మలపల్లి కళా క్షేత్రంలో మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్లు, సూపర్‌వైజర్లు, సబ్ యూనిట్ ఆఫీసర్లకు నిర్వహించిన శిక్షణా శిబిరంలో మంత్రి మాట్లాడారు. వారం రోజులకు పైగా నీట మునిగిన ప్రాంతాల్లో దోమల లార్వాలు పెరిగి మలేరియా వంటి వ్యాధులు ప్రబలే అవకాశమున్నందున ఆరోగ్య శాఖ శిబ్బంది లార్వాల నిర్మూలనా కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొనాలన్నారు.

గుంటూరు, కృష్ణా, నెల్లూరు, ఎన్టీఆర్, కాకినాడ, పల్నాడు జిల్లాల నుండి వైద్య సిబ్బంది వరద ప్రభావిత ప్రాంతాల్లో దోమల లార్వాల నిర్మూలనా కార్యక్రమంలో పాల్గొనడం అభినందనీయమన్నారు. వారం రోజుల పాటు అంకిత భావంతో పనిచేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. వరద పీడిత ప్రాంతాల్లో నాలుగు రోజుల పాటు ఇంటింటి సర్వే చేసేందుకు ఇప్పటికే 150 బృందాలు రంగంలోకి దిగాయన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో వైద్య ఆరోగ్య శాఖ పెద్ద యజాన్నే చేపట్టిందన్నారు. వరదలు ప్రారంభమైనాటి నుండి వైద్య ఆరోగ్య శాఖకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం చేస్తూ వస్తున్నారని, ఆ స్ఫూర్తితోనే మంత్రులుగా తాము కూడా నిరంతరమూ పనిచేస్తున్నామన్నారు.

ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన వార్ రూంలో సిఎం చంద్రబాబు రేయింబవళ్లూ అక్కడే ఉంటూ వరద ప్రభావిత ప్రాంతాలపై సమీక్షిస్తున్నారన్నారు. వార్డుకో ఐఎఎస్ ఆఫీసర్‌ను నియమించడంతో పాటు మంత్రులు కూడా నిరంతరమూ పర్యటిస్తూ బాధితులకు అండగా నిలుస్తారన్నారు. వరద బాధితులకు కూటమి ప్రభుత్వం పూర్తి భరోసా ఇచ్చేలా పనిచేస్తోందన్నారు . వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాల్లో దాదాపు 5003 మంది జ్వరాలకు చికిత్స పొందారన్నారు. నీటి నిల్వలుండం వల్ల దోమల లార్వాలు పెరిగే అవకాశముందని, లార్వాల నిర్మూలనకు స్పెషల్ డ్రైవ్ ను చేపట్టామన్నారు.

వరద బాధిత ప్రాంతాల్లో దోమల లార్వాలు వృద్ధి చెందకుండా ఉండేందుకు ముందస్తు చర్యల్ని చేపట్టమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్టీఆర్ కలెక్టరేట్లో ఉంటూ పరిస్థితిని సమీక్షిస్తున్నారని, ఉద్యోగులుగా మనవంతు బాధ్యతను నిర్వర్తిస్తూ బాధితులకు వైద్య సేవలందించాలన్నారు. దోమల లార్వాల నివారణా కార్యక్రమాన్ని సీరియస్ గా తీసుకుని అన్ని ప్రాంతాల్నీ కవర్ చేయాలన్నారు. ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ సి.హరికిరణ్ మాట్లాడుతూ వార్డు సచివాలయాన్ని యూనిట్ గా తీసుకుని యాంటీ లార్వా ఆపరేషన్ చేపట్టామన్నారు.

వరద ప్రభావిత 32 డివిజన్లలో 150 వార్డు సచివాలయాలున్నాయని, వీటిలో నీరు పూర్తిగా లేని 88 వార్డు సచివాలయాల్లో శిక్షణ పొందిన 330 మంది సిబ్బంది దోమల లార్వాల నిర్మూలనా కార్యక్రమంలో ఈనెల 11 నుండి పాల్గొంటారన్నారు. నీరు పూర్తిగా వెళ్లిపోయాక మిగతా వార్డు సచివాలయాల్లో కూడా ఈ కార్యక్రమాన్ని మొదలు పెడతామన్నారు. విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ కమీషనర్ సహకారంతో యాంటీ లార్వా ఆపరేషన్ పకడ్బందీగా నిర్వహించేందుకు వైద్య ఆరోగ్య శాఖ అన్ని ఏర్పాట్లూ చేసిందన్నారు. వార్డు సచివాలయాల్లో స్టాక్ పాయింట్లు పెట్టామనీ, రోజుకు 100 ఇళ్లు చొప్పున తీసుకుని వారం రోజుల్లోగా ఈ కార్యక్రమాన్ని పూర్తి చేస్తామనీ చెప్పారు. వార్డు సచివాలయానికి ముగ్గురు చొప్పున ఎంపిహెచ్ఎలు పనిచేస్తారని, మూడు నాలుగు వార్డు సచివాలయాలకు ఒక మల్టీ పర్పస్ హెల్త్ సూపర్ వైజర్ బాధ్యత వహిస్తారన్నారు. వీరందరినీ సబ్ యూనిట్ ఆఫీసర్ పర్యవేక్షిస్తారని, మరో నలుగురు అడిషన్ డైరెక్టర్లను కూడా పర్యవేక్షణ కోసం నియమించామని కమీషనర్ తెలిపారు. ఇప్పటికే ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాలు ఈ నెల 15 వరకు పనిచేస్తాయన్నారు. విజయవాడ మునిసిపల్ కమీషనర్ ధ్యానచంద్ర, సెకండరీ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ ఎ.సిరి, ప్రజారోగ్య కుటుంబ సంక్షేమ డైరెక్టర్ డాక్టర్ పద్మావతి, డిసీజ్ కంట్రోల్ ప్రోగ్రాం అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ సుబ్రహ్మణ్యేశ్వరి, సెకండరీ హెల్త్ జాయింట్ కమీషనర్ టి.రమేష్ కిషోర్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# గత ప్రభుత్వ తప్పులను సరి చేస్తా...

(మొదటి పేజీ తరువాయి)

వివరించారు. బుడమేరు విషయంలో ఆక్రమణలు చేసిన వారితో మాట్లాడాలని ఆ ఆక్రమణలు తెలిసో తెలియకో చేసిన వారు ఉన్నారని పవన్ అన్నారు.

ఆక్రమణ స్థలం అని తెలియక కొన్నవారు కూడా ఉన్నారని పవన్ కల్యాణ్ అన్నారు. ముందుగా ఆక్రమణలు గుర్తించాలని అందరితో కలిసి మాట్లాడి చర్యలు తీసుకుంటే మంచిది అన్నది నా అభిప్రాయమని తెలిపారు. నదీ, వాగు పరివాహక ప్రాంతాల్లో కట్టడాలపై ప్రజల్లో చైతన్యం రావాలని సూచించారు. వరద విపత్తు నుంచి కోలుకోవడానికి విజయవాడకు సమయం పట్టొచ్చని వరద బాధితులను ఆదుకోవడంలో చంద్రబాబు నిత్యం పనిచేస్తున్నారని పవన్ కల్యాణ్ తెలిపారు.

ఏలేరు రిజర్వాయర్ పరిస్థితిపై కలెక్టర్‌తో మాట్లాడాను. ముంపు ప్రాంతాల వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలి. సుద్దగడ్డ వాగు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తాం. ఏలేరు వరద పరిస్థితిపై సమీక్షించి సూచనలు ఇస్తున్నాను. బుడమేరులో ఆక్రమణలకు పాల్పడిన వారితో మాట్లాడాలి. అది ఆక్రమణ స్థలం అని తెలియక కొన్నవారు కూడా ఉన్నారు. అందరితో కలిసి మాట్లాడి చర్యలు తీసుకుంటే మంచిది. నదులు, వాగుల ప్రాంతాల్లోని కట్టడాలపై ప్రజల్లో చైతన్యం రావాలి. – పవన్ కల్యాణ్, డిప్యూటీ సీఎం

# ప్రభుత్వ సేవలు భేష్



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** వరద బాధితులను అన్ని విధాలా ఆదుకోడానికి సీఎం చంద్రబాబునాయుడు ప్రణాళికలు అమలు చేస్తున్నారని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత భరోసా ఇచ్చారు. సోమవారం విజయవాడ నగరం 54, 55, 56 డివిజన్లలో పర్యటించారు. ముందుగా 54 డివిజన్ లోని పంజా సెంటర్ మహబూబ్ సుభానీ స్ట్రీట్, గుల్లాం అబ్బాస్ స్ట్రీట్, వించిపేటలో నిత్యావసర సరకుల కిట్లను మంత్రి పంపిణీ చేశారు. వరద బాధితులకు చంద్రబాబు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

రేషన్ కార్డు లేకున్నా నిత్యావసర సరకులు అందజేస్తామన్నారు. వించిపేటలో ఉర్దూ పాఠశాలను మంత్రి పరిశీలించారు. ముందుగా అక్కడున్న వైద్య శిబిరాన్ని పరిశీలించి, ఏయే మందులు అందజేస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. తొమ్మిది రోజులుగా అక్కడి వైద్య శిబిరంలో సేవలందిస్తున్న సచివాలయ హెల్త్ సెక్రటరీ వనిత జ్యోతిని మంత్రి అభినందించారు. అనంతరం స్కూల్లో తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులందరూ స్కూల్ కు హాజరైనట్లు ఉపాధ్యాయుడు రఘునాథ్ కృష్ణ వెల్లడించారు. ఫైరింజన్ సాయంతో పాఠశాలను శుభ్రం చేసినట్లు ఉపాధ్యాయుడు వెల్లడించారు. వైద్య శిబిరంలో ఆరోగ్య పరీక్షలకు వచ్చిన వారు... పిల్లల చదువులకు ఆటంకం కలగకుండా, యుద్ధ ప్రాతిపదికన పాఠశాలను పున:ప్రారంభించడంపై ఆనందం వ్యక్తంచేశారు. సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. అక్కడి నుంచి ఇస్లాం పేట సెంటర్ లో వెళ్లిన మంత్రి పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. త్వరితగతిన పారిశుధ్యం మెరుగుపర్చాలని, వీధుల్లో బ్లీచింగ్ చల్లాలని సూచించారు.

**రేషన్ బండ్లు...వైద్య శిబిరాలు...**

54, 55 డివిజన్లో ప్రజలకు అందుబాటులో ఉండేలా స్కూళ్లు, సచివాలయాల వద్ద వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామని మంత్రి సవిత వెల్లడించారు. వీధుల్లో ఒకేసారి మూడు నాలుగు రేషన్ బండ్లుతో నిత్యావసర సరకులు పంపిణీ చేస్తున్నామన్నారు. వరద బాధితులపై ఆర్థిక భారం తగ్గించాలనే ఉద్దేశంతో, రైతు బజార్ల ద్వారా తక్కువ ధరకే కూరగాయలు విక్రయించేలా సీఎం చంద్రబాబు చర్యలు తీసుకున్నారన్నారు.

**లిషాపుల శుభ్రంపై వ్యాపారుల ఆనందం**

బురదతో నిండిపోయిన షాపులను, ఇళ్లను ఫైరింజన్ల సాయంతో శుభ్రం చేయడంపై వ్యాపారులు ఆనందం వ్యక్తంచేశారు. తమను కలవడానికి వచ్చి మంత్రి సవితకు వారు ధన్యవాదాలు తెలిపారు. వరద నీటితో నిండామునిగిపోయిన షాపులను ప్రభుత్వమే శుభ్రం చేయడం అభినందనీయమన్నారు. వీధులను వరద నీరు తొలగించడంతో పాటు రోడ్లలన్నీ శుభ్రం చేయడంపై తోపుడు బండ్ల యజమానులు ఆనందం వ్యక్తంచేశారు. వ్యాపారాలు ఇపుడిపుడే గాడిన పడుతున్నాయన్నారు.

**చంద్రబాబు దయతో తిండికి కొదవ లేదు...**

చంద్రబాబు దయ వల్ల ఇంట్లో ఉండి బయటకు కాకుండా నాలుగు మెతుకులు తినగలుగుతున్నాం.. చంద్రబాబు నీళ్లలో పడవలో వచ్చి... పాలు, ఆహారం పొట్లాలు, బియ్యం, నీరు అన్నీ అందించారు. మాకు పనుల్లేకపోయినా.. తిండికి కొదవలేకుండా చూసుకుంటున్నారు...అని వించిపేటకు చెందిన వృద్ధురాలు...మంత్రి సవితకు ధన్యవాదాలు తెలిపారు. రేషన్ బండి వద్ద నిత్యావసర సరకులు పంపిణీని మంత్రి పరిశీలన వచ్చారు. అదే సమయంలో అక్కడున్న వారు మంత్రి సవితకు కృతజ్ఞతలు తెలియజేశారు.

**56 వ డివిజన్ లో పారిశుధ్య పనుల పర్యవేక్షణ**

56వ డివిజన్ పాత రాజరాజశ్వేరి పేటలో మంత్రి సవిత పర్యటించారు. ఆహార పొట్లాలు, నిత్యావసర సరుకులు, ట్యాంకర్లతో తాగునీటి పంపిణీని పర్యవేక్షించారు. పాత రాజరాజేశ్వరి పేట మెయిన్ రోడ్డులో పారిశుధ్యం పనుల పరిశీలించారు. మంగళవారానికి రోడ్లన్నీ శుభ్రం చేస్తామన్నారు. రోడ్లు, కాలువలు శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికుల సేవలను మంత్రి కొనియాడారు. అనంతం పాత రాజరాజేశ్వరి పేటలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుబ్బారావు, ఫతావుల్లా అహ్మద్, షేక్ ఆషా, తాజుద్దీన్, సయ్యద్ సలీం తదితరులు పాల్గొన్నారు.

# అన్ని రకాలుగా అండగా ఉంటాం

(మొదటి పేజీ తరువాయి)

అందించేందుకు వీలుంటుందని పేర్కొన్నారు.

బుడమేరుపై గత ప్రభుత్వం అనుసరించిన విధానాలతో లక్షలాది మంది ప్రజలు బాధలు పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వాధినేత చేసిన పాపాల ప్రజలకు శాపాలుగా మారాయని ఆరోపించారు. బుడమేరు నుంచి కొల్లేరుకు నీరు వెళ్లకుండా కబ్జాలు చేశారని తెలిపారు. మంత్రులు నిమ్మల రామానాయుడు, నారా లోకేష్ లు బుడమేరు గండ్లు పూడ్చే కార్యక్రమం చేపట్టి విజయంవతంగా పూర్తి చేశారన్నారు. ఇతర మంత్రులు, ఐఏఎస్ అధికారులు, పోలీసులంతా అక్కడే ఉండి రేయింబవళ్లు పనిచేశారన్నారు.

బోట్ల ద్వారా ప్రకాశం బ్యారేజీని ఢీ కొట్టించే కుట్రకు కొందరు పన్నాగం పన్నారని విమర్శించారు. భారీ బోట్లకు లంగర్ ఎందుకు వేయలేదని ప్రశ్నించారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో తమ అనుకూల మీడియా ద్వారా ప్రతిరోజు తమపై విషం చిమ్మే ప్రయత్నం చేయడం బాధాకరమన్నారు.

గత ఐదేళ్లలో ఎలాంటి పాలన జరిగిందో ప్రజలు ఆలోచించాలని కోరారు. నేరస్థులను నమ్మితే మాత్రం నాశనమే ఎదురవుతుందన్నారు. గత ప్రభుత్వం 10 లక్షల కోట్ల అప్పులు చేసిందని, అప్పులు ఇచ్చే పరిస్థితి కూడా లేదని తెలిపారు. ప్రభుత్వానికి కూడా ఇబ్బందులు ఉన్నాయని అయినప్పటికీ ప్రజల కోసం పని చేస్తున్నామన్నారు. సకాలంలో ఎవరికైనా సాయం అందకపోయినా ఆందోళన చెందవద్దని తెలిపారు. ఇంత పెద్ద మహా యజ్ఞంలో ఎన్ని సవాళ్లు ఎదురైనా అధిగమించుకుంటూ ముందుకెళ్తున్నాం. వరదల్లో నష్టపోయిన వారిని అన్ని విధాల ఆదుకోవటంతో పాటు ఆదాయం వచ్చే మార్గాలు కల్పిస్తా. ఉపాధి కోల్పోయిన వారికి ఇంట్లో ఉండే ఆదాయం సమకూర్చుకునేలా చేస్తా' అని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు

ప్రజలంతా తిరిగి కోలుకునేందుకు చర్యలు చేపట్టామన్నారు. ప్రజలు నిలదొక్కుకునేలా పని చేస్తామన్నారు. ఏ ఒక్క వ్యక్తికి అన్యాయం జరగకూడదన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రజలు టెక్నాలజీని వినియోగించాలని కోరారు. టెక్నాలజీతో ప్రజలకు మేలు చేసే కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో మన జీవితంలో టెక్నాలజీ వల్ల సమూల మార్పులు వస్తాయని అందుకే ప్రతి ఒక్కరూ సెల్ ఫోన్ వాడకం ద్వారా తమ పనులన్నీ అయ్యే విధంగా శ్రీకారం చుడతామన్నారు. ఇంట్లో ఉంటూనే ప్రపంచంతో మమేకం అవ్వొచ్చు... తక్కువ సమయం పని చేసి ఎక్కువ ఉపాధి సృష్టించుకోవచ్చన్నారు.. కష్టపడి సంపాదించడం రోజూ చేసేదే కానీ తెలివితేటలతో సంపాదిస్తే మరింత సంపాదించవచ్చని సూచించారు. తక్కువ ఖర్చుతో ప్రజలకు మంచి సేవలు అందించాలన్నదే మా తపన.. భవిష్యత్ లో ఇలాంటి సమస్య పునరావృతం కావకుండా చేయాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

# ప్రకాశం బ్యారేజి గేట్లను బోట్లు ఢీకొట్టిన ఘటన.. ఇద్దరు అరెస్టు

**విజయవాడ ( జర్నలిస్ట్ ఫైల్ ) :** భారీ వరదలు వచ్చిన సమయంలో ప్రకాశం బ్యారేజి గేట్లను పడవలు ఢీకొట్టడం వెనుక కుట్ర కోణం ఉందని పోలీసుల దర్యాప్తులో తెలిసింది. బ్యారేజి గేట్లను ఢీకొట్టిన బోట్లు వైసీపీ నేతలు, కార్యకర్తలవే అని పోలీసులు నిర్ధారించారు. ప్రకాశం బ్యారేజీ గేట్లను బోట్లు ఢీకొన్న ఘటనపై అధికారులు సీఎం చంద్రబాబుకు నివేదిక సమర్పించారు. ఈ ఘటనలో కుట్ర కోణం ఉందని అధికారులు నివేదికలో వెల్లడించారు. ఢీకొన్న బోట్లు వైఎస్సార్సీపీ నేతలు, కార్యకర్తలవని నిర్ధారించారు. దీంతో బ్యారేజ్‌ను పడవలు ఢీకొన్న ఘటనలో దర్యాప్తు ముమ్మరం చేసిన పోలీసులు, ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. గొల్లపూడికి చెందిన పడవల యజమాని ఉషాద్రిని, సూరాయపాలెం వాసి కోమటి రామ్మోహన్‌ను విజయవాడ పోలీసులు అరెస్టు చేశారు. కొట్టుకొచ్చిన 3 పడవలూ కుక్కలగడ్డ ఉషాద్రికి చెందినవిగా గుర్తించారు. నిందితులను అరెస్టు చేసి విజయవాడ కోర్టుకు తరలించారు. నిందితులకు న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారు. నిందితులను విజయవాడ జైలుకు తరలించారు. రిమాండ్ విధించడంతో కుట్ర కోణంపై సమగ్ర దర్యాప్తు చేయనున్నారు.



కాగా ఈ ఘటనలో వైఎస్సార్సీపీ ఎమ్మెల్సీ తలశిల రఘురామ్, మాజీ ఎంపీ నందిగం సురేష్ అనుచరుల బోట్లు ఉన్నట్లు ఇప్పటికే నివేదికలో వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో ఇసుక అక్రమ తవ్వకాలకు నందిగం సురేష్, ఉషాద్రికి చెందిన బోట్లనే వినియోగించుకున్నారని నివేదికలో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో చర్యలు తీసుకుంటున్నారు.

బోట్లు రిజిస్ట్రేషన్ల నంబర్ ఆధారంగా యాజమానులను గుర్తించామని అధికారులు నివేదికలో వెల్లడించారు. బోట్లు ఉషాద్రి, కర్రి నరసింహ స్వామి, గూడూరు నాగమల్లేశ్వరికి చెందినవిగా గుర్తించారు. ఉషాద్రికి చెందిన మూడు బోట్లును కలిపి కట్టడం వెనుక కుట్ర కోణం ఉందని వెల్లడించారు. బోట్లును ఇనుప చైన్ల లంగరు వేయకుండా ప్లాస్టిక్ తాళ్లతో కట్టేసినట్లు అధికారులు గుర్తించారు. తమ బోట్లతో పాటు సమీపంలోని మరో రెండింటిని కూడా కొట్టుకెళ్లేలా కుట్ర చేసి ఉంటారని ఆరోపించారు. సెప్టెంబర్ 2న తెల్లవారు జామున 3 గంటల సమయంలో 5 బోట్లు ప్రకాశం బ్యారేజీ గేట్లను ఢీ కొట్టినట్లు అధికారులు నివేదికలో వెల్లడించారు. బోట్లు గేట్లకు ఉండే కౌంటర్ వెయిట్లకు కాకుండా బ్యారేజీ పిల్లర్లను బలంగా ఢీ కొని ఉంటే ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండేదని తెలిపారు. మరోవైపు పోలీసులు అనుమానితుల కాల్ డేటాను పరిశీలిస్తున్నారు.

ఒక్కోటి 40-50 టన్నుల బరువు ఉన్న బోట్లు ఢీకొడితే బ్యారేజి గేట్లు దెబ్బతిని కొట్టుకుపోతాయని, తద్వారా ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకురావాలనే దురుద్దేశంతోనే వాటిని గట్టిగా కట్టకుండా వదిలేశారని పోలీసులు అనుమానిస్తున్నారు.

# వరద బాధితులకు భరోసా ఇవ్వండి

(మొదటి పేజీ తరువాయి)

అధిక వర్షాల ప్రభావం పడిందని ప్రాథమిక అంచనా వేసినట్లు చెప్పారు. రూ. 141 కోట్ల మేర మత్స్య సంపదకు నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. కృష్ణా, బాపట్ల, ఎన్టీఆర్ జిల్లాల్లో అధిక శాతం నష్టం జరిగిందన్నారు.

320 మత్స్యకారుల బోట్లు పూర్తిగా, 61 బోట్లు పాక్షికంగా, 257 వలలు దెబ్బతిన్నాయని అచ్చెన్నాయుడికి అధికారులు వివరించారు., అదేవిధంగా ఆరు జిల్లాల్లో మత్స్య సాగు చేసే చెరువులు వరదల వల్ల భారీగా ప్రభావానికి గురయ్యాయని తెలిపారు. ఈ క్రమంలోనే వరద సహాయక చర్యలు వేగవంతం చేయడంతో పాటు ఉత్తరాంధ్ర జిల్లాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని అచ్చెన్నాయుడు తెలిపారు. నష్టం పూర్తి స్థాయిలో అంచనా వేయాలని అధికారులను ఆయన ఆదేశించారు

# కుట్ర.. అంతు తేలుస్తాం



(మొదటి పేజీ తరువాయి)

నిమ్మల రామానాయుడు హెచ్చరించారు. సోమవారం మంత్రి ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్లో మీడియాతో మాట్లాడారు. 1854 నుంచి 1952 వరకు దాదాపు 100 సంవత్సరాల పాటు ఉమ్మడి కృష్ణా, గుంటూరు, ప్రకాశం, పశ్చిమగోదావరి జిల్లాలకు బ్యారేజీ సేవలందించిందని.. 1952 లో వచ్చిన వరదలకు బ్యారేజీ దెబ్బతినడంతో ప్రభుత్వం పునర్నిర్మాణం చేసి మాజీ ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు గారి పేరును పెట్టడం జరిగిందన్నారు. ఆపై 1957 నుంచి దాదాపు 13.8 లక్షల ఎకరాలకు సాగునీరు, లక్షలాది ప్రజలకు తాగునీరు ప్రకాశం బ్యారేజీ ద్వారా అందుతున్నాయి. ఈ బ్యారేజీ ఉమ్మడి కృష్ణా, గుంటూరు, ప్రకాశం, పశ్చిమగోదావరి జిల్లాలకు వరప్రదాయనిగా నిర్విరామంగా సేవలందిస్తోంది. ఆ విధంగా పాత ఆనకట్ట వంద సంవత్సరాలు, కొత్త ఆనకట్టకు దాదాపు 70 సంవత్సరాల చరిత్ర ఉంది. అంటే దాదాపు 170 సంవత్సరాల ఘన చరిత్ర ప్రకాశం బ్యారేజీ కి ఉంది. 11,42,000 క్యూసెక్కుల వరద నీరు వచ్చిన కీలక పరిస్థితిలో ఐదు పడవలు ప్రకాశం బ్యారేజీని ఢీకొనడం వెనుక కుట్ర కోణం ఉందనే అభిప్రాయం అందరిలోనూ ఉంది. ఘటనపై వాస్తవాలను వెలికి తీసేందుకు దర్యాప్తు సంస్థలు ముమ్మర విచారణ సాగిస్తున్నాయి. ఒక్కొక్కటి 40-50 టన్నుల బరువున్న ఐదు పడవలు అధిక వరద వస్తున్న సమయంలో ప్రకాశం బ్యారేజీకి చెందిన 67, 69, 70గేట్లను దాటుకొని కౌంటర్ వెయిట్ ని బలంగా ఢీకొట్టడం జరిగింది. అదృష్టవశాత్తు బ్యారేజీకి సంబంధించిన ప్రధాన కట్టడానికి గానీ గేట్లకుగానీ ఎలాంటి నష్టం వాటిల్లకుండా బోట్లు కౌంటర్ వెయిట్ ను ఢీకొన్నాయి. నిజంగా గేట్లను గాని ప్రధాన కట్టడాన్ని గాని ఢీకొని ఉంటే ఐదారు జిల్లాలకు ఎంత నష్టం జరిగేదో ఊహించడానికి కష్టంగా ఉంది. ఈ మొత్తం ఘటనపై దర్యాప్తు చేయాలని ఇరిగేషన్ శాఖ నుంచి పోలీస్ శాఖకు ఫిర్యాదు చేయడం జరిగింది. దర్యాప్తు చాలా వేగంగా జరుగుతోంది.

ఈ మొత్తం ఘటన పలు అనుమానాలకు తావిస్తోందని.. రైతులు, రైతు సంఘాలు అంటున్నాయి. ఇలాంటి అధిక బరువు కలిగిన బోట్లను సాధారణంగా నది ఒడ్డున లంగర్ వేసి ఉంచుతారు. ఒక్కో బోటు విలువ రూ. 40-50 లక్షలు ఉంటే.. అంతటి విలువైన 3 బోట్లను ఒకే ప్లాస్టిక్ తాడుతో కట్టడం చాలా అనుమానాలకు తావిస్తోంది. ఇంతటి విలువైన పడవలను జాగ్రత్త చేసుకోకుండా ఉద్దేశపూర్వకంగానే ఇలా బ్యారేజీని ఢీకొట్టేలా చేశారా అనే అనుమానాలు పెద్దఎత్తున వస్తున్నాయి. మొత్తం ఐదు పడవల్లో ఒక పడవ గేట్ల మధ్య నుంచి కిందకు వెళ్లిపోగా మూడు పడవలను గుర్తించడం జరిగింది. మరో పడవ ఆచూకీ తెలుసుకుంటున్నాం. గుర్తించిన మూడు పడవలకు యజమాని ఒకరే కావడం అనుమానానికి దారితీస్తోంది. ఈ పడవల యజమాని అయిన ఉషాద్రి.. కోమటి రామ్మోహన్ కు అనుచరుడిగా ఉన్నారు. ఈ రామ్మోహన్ తలశిల రఘురాంతో బంధుత్వం ఉండటం అనుమానాలకు తావిస్తోంది. గత ప్రభుత్వ అండదండలతో నందిగం సురేష్ వీరంతా సిండికేట్ గా ఏర్పడి డ్రెడ్జింగ్ ద్వారా ఇసుకను అక్రమంగా లూటీ చేశారు. పడవలకు వైఎస్ఆర్ సీపీ రంగులు కూడా ఉండడం.. ఈ బోట్లు అధికారిక పార్టీకి సంబంధించినవి అని చెప్పేలా రంగులు వేసుకున్న పరిస్థితి కనిపించింది. ఇలా దర్యాప్తులో ఒక్కో విషయం బయటకు వస్తోంది.

బోట్లను లంగరు వేసుకొని జాగ్రత్తగా పెట్టుకోవాలని స్థానికులు చెప్పినా సరే నిర్లక్ష్యం చేశారంటే వారి మనసులో వేరే తప్పుడు భావన ఉందని దర్యాప్తులో కూడా అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ మూడు బోట్లు అంతకుముందు గుంటూరు జిల్లా ఉద్ధండరాయునిపాలెం వైపు ఉండేవి.. ఈ వరదకు కొన్ని రోజుల ముందే వాటిని ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడి వైపు తీసుకొచ్చి ప్లాస్టిక్ వైరుతో కట్టి ఉంచినట్లు తెలుస్తోంది. అంటే ఉద్దేశపూర్వకంగానే వరద వేగానికి కొట్టుకొచ్చేలా ఉంచారా అనే అనుమానం వస్తోంది. ప్రకాశం బ్యారేజీకి నష్టం కలిగించి ప్రభుత్వానికి చెడ్డపేరు కలిగించాలనే ఆలోచన వారిలో ఉందా అనే అనుమానం వస్తోంది. వైఎస్ఆర్ సీపీకి మొదటి నుంచి కూడా కుర్చీ కోసం, పదవుల కోసం బరితెగించే మనస్తత్వం ఉంది. రైతు ఆరుగాలం శ్రమించి కష్టపడి పంట పండిస్తే ఆ పంటకు సైతం నిప్పు పెట్టిన చరిత్ర వారిది. తప్పులు చేసిన వారు ఎంతటి వారైనా వదిలిపెట్టకుండా కఠిన చర్యలు తప్పవు.

ప్రస్తుతం అనుభవజ్ఞులైన కన్నయ్య నాయుడు గారి నేతృత్వంలో కౌంటర్ వెయిట్లను ఐరన్ దిమ్మలతో ఏర్పాటు చేయడం జరుగుతుంది. రెండు రోజుల్లోగా పనుల పూర్తికి కృషిచేస్తున్నాం. ఏ చిన్న రిస్కు కూడా తీసుకోకుండా ఈ పనులు చేపడుతున్నాం. దేశ చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా వరద ప్రవాహం వెళ్తుండగానే తుంగభద్ర డ్యామ్ గేటును బిగించిన పని కన్నయ్యనాయుడు నేతృత్వంలో జరిగింది. వరద ప్రవాహానికి గేటు కొట్టుకుపోతే రైతుల కళ్ళల్లో నీళ్లు చూశాను.. మళ్లీ తిరిగి గేటు అమర్చిన తర్వాత అదే రైతుల కళ్ళల్లో ఆనందం చూసానని ఆరోజు కన్నయ్య నాయుడు చెప్పారు. అందుకే ఆయన సూచనలు సలహాలతో ప్రకాశం బ్యారేజీ విషయంలో కూడా ముందుకెళ్లాలని ముఖ్యమంత్రి సూచించారు. ఎక్కడా చిన్న పొరపాటుకు తావు లేకుండా ప్రస్తుతం పనులు జరుగుతున్నాయి. చాలా జాగ్రత్తగా హ్యాండిల్ చేస్తూ రెండు రోజుల్లో పనుల పూర్తికి కృషి చేయడం జరుగుతుంది. రాజకీయపరంగా కాకుండా ప్రకాశం బ్యారేజీ భద్రత పరంగా ఘటనపై ముమ్మర దర్యాప్తు చేస్తున్నట్లు మంత్రి రామానాయుడు తెలిపారు

# నష్టపోయిన ప్రతి ఇంటికీ నష్టపరిహారం

(మొదటి పేజీ తరువాయి)

భయాందోళనలు రేకెత్తిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల కోసం అధికార యంత్రాంగం క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారని, ప్రజలెవరూ ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం ప్రతి ఒక్కరికీ అండగా నిలుస్తుందని భరోసానిచ్చారు.

సహాయక కార్యక్రమాల్లో భాగంగా ప్రభుత్వం అందిస్తున్న సాయం అందడంలో ఏవైనా తప్పులు ఉంటే ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించి అందరికీ సహాయం అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆహారం వృథా అయినా ఫర్వాలేదు కానీ బాధిత ప్రజలందరికీ సాయం అందాలన్నదే తమ తాపత్రయం అన్నారు. రోజుకు 6 నుండి 8 లక్షల అల్పాహారం, మధ్యాహ్న, రాత్రి భోజనం ప్యాకెట్లు బాధితులకు అందిస్తున్నామని వివరించారు. బోట్లు, వాహనాలు, యంత్రాంగం వెళ్లలేని ప్రాంతాలకు డ్రోన్ల ద్వారా ఆహారం సరఫరా చేస్తున్నామన్నారు. కొన్ని చోట్ల హెలికాఫ్టర్ల ద్వారా బాధితులకు ఆహారం అందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలకు భరోసా కల్పించే లక్ష్యంతో పని చేస్తున్నామని స్పష్టం చేశారు.

వర్షాల నేపథ్యంలో విష జ్వరాలు ప్రబలే అవకాశముండటంతో ప్రభుత్వం ముందే అప్రమత్తమై 4,5 వేల మంది సిబ్బందితో శానిటేషన్ కార్యక్రమాలు నిరంతరంగా చేపడుతుందన్నారు. దాదాపు 100-120 ఫైర్ ఇంజిన్లు, పంపులతో ఎప్పటికప్పుడు రోడ్లు, బాధితుల గృహాల్లో బురద తొలగించి శుభ్రం చేస్తున్నామన్నారు. బురదను తొలగించే పనిలో ప్రభుత్వం ఉంటే కొందరు ప్రభుత్వంపై బురదజల్లేలా విమర్శలు చేయడం సరికాదన్నారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో నిర్మాణాత్మక సలహాలు, సూచనలు అందివ్వాలని, విషం కక్కే వార్తలతో తమ పత్రికల్లో విష ప్రచారాలు చేయడం తగదన్నారు. ప్రజాప్రతినిధులతో మాట్లాడటానికి ఇబ్బంది ఉంటే చీఫ్ సెక్రటరీ, ఇతర ఉన్నతాధికారులకు సమస్యలు చెప్పవచ్చని సూచించారు.

గత ప్రభుత్వానికి కాలువలో వెలికి తీసిన మట్టిని అమ్ముకోవడంలో ఉన్నంత శ్రద్ధ అదే కాలువల రిపేర్ కు నిధులు కేటాయించడంలో లేదని ఆరోపించారు. గత ప్రభుత్వం కాలువల్లో మట్టి తవ్వకుని అమ్ముకున్నారే తప్ప డ్రైనేజీ కాలువలకు మరమ్మతులు చేద్దామని, గండ్లు పూడుద్దామని ఆలోచించలేదన్నారు. కనీసం కబ్జాకు గురవుతున్నా పట్టించుకోలేదన్నారు. రాష్ట్ర అభివృద్ధి, భవిష్యత్ కోసం ఎలాంటి ఆలోచన చేయలేదన్నారు. గత ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్లే ఈ దుస్థితి ఏర్పడిందని ఆరోపించారు. ఇప్పుడిప్పుడే వరద ఉధృతి తగ్గుతోందని త్వరితగతిన శానిటేషన్ ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు. శానిటేషన్ పనితీరును ఈ సందర్భంగా ప్రజలు మెచ్చుకున్నారు. తాను కృష్ణలంక ప్రాంతంలో పర్యటించినప్పుడు ప్రజలు సహాయక చర్యలపై సంతృప్తి వ్యక్తం చేశారని పేర్కొన్నారు. బాధితులకు ప్రభుత్వంపై నమ్మకముందన్నారు.

వరదలు, భారీ వర్షాల వల్ల నష్టపోయిన వివరాలను వెల్లడిస్తామన్నారు. వరద నష్టం అంచనా వేయటానికి మొత్తం 1700 ఎన్యూమరేషన్ బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. డిప్యూటీ తహసిల్దార్, రెవెన్యూ ఇన్ స్పెక్టర్, వార్డు అసిస్టెంట్, పోలీసుతో కూడిన బృందం ఎన్యూమరేషన్ ప్రక్రియలో పాల్గొంటుందన్నారు. ప్రతి సచివాలయంలో ఒక ఐఏఎస్ అధికారి, జిల్లా స్థాయి అధికారి, స్థానిక ప్రజా ప్రతినిధి పర్యవేక్షిస్తారన్నారు. ప్రాథమికంగా 2,50,000 ఇళ్లు దెబ్బతిన్నాయని, నష్టం వాటిల్లిందని అంచనా వేశామన్నారు. నష్టం అంచనా నమోదుకు అధికారులు ప్రత్యేక యాప్ రూపొందించారని తెలిపారు. ఎన్యుమరేషన్ సమయంలో ఇంట్లో ఎవరూ లేకుంటే తర్వాత అయినా నమోదు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. ఈ విషయంలో ప్రజలెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఎన్యూమరేషన్ తమ గృహం, పేరు రాకపోతే స్థానిక ప్రజాప్రతినిధిని కలవాలని సూచించారు. వివరాలు సేకరించి యాప్ లో నష్టపోయిన ప్రతి ఒక్కరి వివరాలు నమోదు చేస్తామన్నారు. నష్టపోయిన ప్రతి ఒక్కరికీ నష్టపరిహారం అందించేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దిన పత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి
జన్మదిన శుభాకాంక్షలు, పొలిటికల్, స్వదేశాగమనం, లీగల్ ప్రకటనలు, క్లాసిఫైడ్స్
పదవీ విరమణ, ప్రారంభోత్సవం, శ్రద్ధాంజలి, సినిమా, వివాహ మహోత్సవం,
షష్టిపూర్తి మహోత్సవం మరియు అన్ని శుభకార్యాలు
ప్రకటనల విభాగం
76 61 80 59 68

## వరద బాధితులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆర్థిక సహాయం



**గుంటూరు( జర్నలిస్ట్ ఫైల్ ) :** రాష్ట్రంలో ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల నష్టపోయిన బాధితులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం సహాయార్థం ముందుకొచ్చింది. గుంటూరు జిల్లా పక్షాన 80 వేల రూపాయల చెక్కును జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నేతలు అందజేశారు.

ఈ సందర్భంగా ఉద్యోగుల సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు చాంద్ బాషా, కార్యదర్శి కెవిఎస్ శివారెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శి కరీముల్లా షాఖాదరి, కోశాధికారి పోతురాజు, నగర శాఖ కార్యదర్శి సాంబశివరెడ్డి, మహిళా విభాగం నేతలు పద్మజ, లీలాబాయి, రోజా, మరియు సభ్యులు పెద రత్తయ్య, రహిమాన్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఈ ఆర్థిక సహాయం ద్వారా వరద బాధితులకు కొంత ఉపశమనం కలిగించాలని, మరిన్ని సహాయ కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఉందని సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు.

## ఖేలో ఇండియా మహిళా తైక్వాండో జాతీయ స్థాయి పోటీలకు తెనాలి తైక్వాండో విద్యార్థిని ఎంపిక



**తెనాలి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** స్థానిక చెంచుపేట యూనిక్ తైక్వాండో అకాడమీకి చెందిన ఇద్దరు క్రీడాకారులు ఈనెల చిత్తూరు జిల్లా తిరుపతి నేషనల్ సాంస్క్రీట్ యూనివర్సిటీలో జరిగిన రెండవ ఖేలో ఇండియా ఉమెన్ తైక్వాండో రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొన్నారు. వీరిలో ఒకరు ఉత్తమ ప్రతిభ కనబరచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనారు. ఎంపికైన ఈ క్రీడాకారిణి ఏ. వినూత్న 63 కేజీలు జూనియర్ కేటగిరీలో ఈనెల 11 నుండి 14వ తేదీ వం-కు జరిగే తమిళనాడులోని దిండిగల్ ఇండోర్ స్టేడియంలో పాల్గొననున్నట్లు కోచ్ బట్టు నాగరాజు తెలియజేశారు ఈ క్రీడాకారిణిగత తొమ్మిది సంవత్సర కాలం నుండి తైక్వాండో సాధన చేస్తుందని అనేకసార్లు జిల్లా,రాష్ట్ర,జాతీయ స్థాయిలలో తైక్వాండో పోటీలలో పాల్గొని పతకాలు సాధించిందని అకాడమీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బట్టు నాగరాజు తెలియజేశారు. ఈ క్రీడాకారిణిని అకాడమీ గౌరవాధ్యక్షులు అందె బాలచంద్రమౌళి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

## మహానాడు 16 లైన్ లో శ్రీ విఘ్నేశ్వర సేవా సమితి ఆధ్వర్యంలో 3 వేల మందికి అన్నదానం



**మంగళగిరి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకొని మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని మహానాడు 16 వ లైన్ లో సోమవారం శ్రీ విఘ్నేశ్వర సేవా సమితి ఆధ్వర్యంలో 3 వేల మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు. ముందుగా గణేశునికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ విఘ్నేశ్వర సేవా సమితి సభ్యులు సంక్రాంతి అశోక్, చింతం ఆనంద్,గిడ్డా నారాయణ, వెంకటేశ్వర్లు,జోషి,పండు, రవి, వెంకటపతి,ఈశ్వరరావు, వెంకటేశ్వర్లు,మధువెంకట్ లక్ష్మయ్య,బాలకృష్ణ, రామయ్య, శ్రీను, తిరుపతయ్య, గంగయ్య, కిరణ్,టీడీపి నాయకులు ముమ్మిడి సత్యనారాయణ, దానబోయిన సుందరరావు యాదవ్,జంగాల వెంకటేష్,ఇట్టా భాస్కర్, ఒలేటి రాము, జంజు మరియదాసు,అన్నెం కుసుమ, అంకలరావు (పండు),తదితరులు పాల్గొన్నారు.

## మంగళగిరిలో ఘనంగా మహా రుద్రాభిషేకం



**మంగళగిరి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** మంగళగిరిలోని మెయిన్ బజార్ సెంటర్లో సంక బాలాజీ గుప్తా బ్రదర్స్ ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంక .బాలాజీ గుప్తా అండ్ బ్రదర్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంక బాలాజీ గుప్త మాట్లాడుతూ ... గత కొన్ని సంవత్సరాల నుండి సంకా బాలాజీ గుప్తా బ్రదర్స్ ఆధ్వర్యంలో వినాయక చవితి సంబరాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మంత్రులు నాయకులు కార్యకర్తలు వరద లో చిక్కుకున్న ప్రజలు చేస్తున్న సేవలు మరువలేనివని వారు కొనియాడారు రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని వేద వేద పండితుల వినాయకుని రుద్రాభిషేకం నిర్వహిస్తున్నట్లు వారు తెలియజేశారు.

## పంచాయతీలకు విరాళం పై హర్షం వ్యక్తం చేసిన మండల జనసేన నాయకులు



**గుంటూరు, పెదకాకాని (జర్నలిస్ట్ ఫైల్ ):** ఇటీవల గత వారం రోజులుగా అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షాలకు రాష్ట్రంలో దెబ్బతిన్న పంచాయతీలకు జనసేన పార్టీ అధినేత రాష్ట్ర డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కళ్యాణ్ రెండు రాష్ట్రాలకు రూ. రెండు కోట్లు, అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ లో దెబ్బతిన్న గ్రామ పంచాయతీలకు రూ. 4 కోట్లు అందజేశారు. ఈ క్రమంలోనే పెదకాకాని మండలం పరిధిలోని 11 పంచాయతీలకు ఒక్కొక్క పంచాయతీకి రూ. లక్ష చొప్పున చెక్కులు పంపిణీ చేయడానికి మండల జనసేన పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పెదకాకాని మండల జనసేన పార్టీ అధ్యక్షులు వీరెళ్ళ వెంకటేశ్వరరావు, పొన్నూరు నియోజకవర్గ సీనియర్ నాయకులు మారుతి కుమార్, పెదకాకాని గ్రామ పార్టీ అధ్యక్షులు మండలం శ్రీనివాస్,మునగా కోటేశ్వరరావు, సీనియర్ నాయకులు బండారు అప్పారావు, బండారు శ్రీనివాసరావు, కోనా ప్రసాద్, సెక్రటరీ దంతాల ఆంజనేయులు,రవి,మైనార్టీ నాయకులు జాకీర్ హుస్సేన్, బీసీ నాయకులు ధూపాటి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి బ్యాచ్ మధ్య.. బ్లేడ్ వార్..!!

- ఒకరిపై ఒకరు బ్లేడ్లు, బీర్ బాటిల్స్ తో దాడులు..గాయాలు..!
- ప్రజలపై కూడా దాడులకు యత్నం..
- భయం గుప్పెట్లో ప్రజలు..
- పోలీసుల రంగ ప్రవేశం



**మంగళగిరి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** తాడేపల్లి మండల పరిధిలోని ప్రకాష్ నగర్ లో గత కొంతకాలంగా గంజాయి బ్యాచ్ ఆగడాలకు అంతే లేకుండా పోతున్నది. కొంతమంది యువకులు ఒక ముఠాగా ఏర్పడ్డారు. ఈ బ్యాచ్ గంజాయి త్రాగటం ఆ మత్తులో స్థానికులపై బ్లేడ్లు తీసుకొని దాడులు చేయటం, అందినంత దోచుకోవటం పరిపాటిగా మారింది. ఇటీవల కాలంలో ఈ బ్యాచ్ ఫుల్లుగా గంజాయి తాగి ప్రకాష్ నగర్ ప్రాంత మహిళపై బ్లేడు చూపించి బెదిరింపులకు దిగారు. అడ్డుకున్న ఒక మహిళపై కూడా దాడికి తెగబడ్డారు. గాయపరిచారు. వారి వద్దనున్న సొమ్ము దోచుకుని వెళ్లిపోయారని, ఆ ప్రాంత ప్రజలు అంటున్నారు. తాడేపల్లి పోలీసులు కూడా కేసు నమోదు చేసినట్టు సమాచారం. అయితే పోలీసులు కేసు నమోదు చేసుకొని గంజాయి బ్యాచ్ ఆగడాలను అరికట్టటానికి ప్రయత్నం చేసినప్పటికీ బెయిలు మీద బయటకు వచ్చి మరల గంజాయి సేవించడం పరిపాటిగా మారింది. ఈ బ్యాచ్ ని పోలీసులు అదుపు చేయటానికి ప్రయత్నం చేస్తున్నప్పటికీ గంజాయి మత్తులో ఉన్న ఈ బ్యాచ్ కి చెవికి ఎక్కడం లేదు. పోలీసులపై కూడా తిరగబడుతున్నారు. ఈ బ్యాచ్ ని పూర్తిగా అరికట్టటానికి తాడేపల్లి పోలీసులు కూడా సాధ్యపడటం లేదని విమర్శలు లేకపోలేదు.

**గంజాయి బ్యాచ్ హల్చల్.**

గంజాయి బ్యాచ్ ప్రకాష్ నగర్ లో సోమవారం హల్ చల్ చేసింది. గంజాయి సేవించి స్థానికులను భయ భ్రాంతులకు గురి చేశారు. గంజాయి సేవించడం ఆ మత్తులో బ్లేడ్లు చేత పట్టుకొని ఎవరి కనపడితే వారిపై దాడులు చేయటం ప్రజలను భయ భ్రాంతులకు గురి చేయటం షరా మామూలుగా మారింది.

ఈ ముఠా బెజవాడ బ్లేడ్ బ్యాచ్ తరహాలో దాడులకు తెగబడుతున్నది.

**గంజాయి బ్యాచ్ మధ్య బ్లేడ్ వార్..?**

ఈ గంజాయి బ్యాచ్ మధ్య ప్రకాష్ నగర్ లో సోమవారం బ్లేడ్ వార్ జరిగింది. ఈ సంఘటనతో ఆ ప్రాంత ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. ఈ బ్యాచ్ మధ్య 50 వేల రూపాయల నగదు విషయంలో గొడవ మొదలైంది. నగదు పంచుకునే విషయంలో అభిప్రాయ వేదాలు వచ్చాయని అంటున్నారు. బ్లేడు లు బీర్ బాటిల్స్ తో గంజాయి బ్యాచ్ ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. భయంతో వణికి పోయిన ప్రజలు తాడేపల్లి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు హుటాహుటిన ప్రకాష్ నగర్ ప్రాంతానికి చేరుకున్నారు. దాడులు ఆపడానికి ప్రయత్నించారు . అయితే గంజాయి నిషా లో ఉన్న ఈ బ్యాచ్ పోలీసులతో కూడా వాదనలకు దిగింది. గంజాయి బ్యాచ్ మధ్య జరిగిన వార్ లో అందులోని యువకులు గాయాల పాలయ్యారు. దీంతో తాడేపల్లి పోలీసులు గాయాల పాలైన గంజాయి బ్యాచ్ ముఠాలోని యువకులకు ఆసుపత్రికి తరలించారు.

అయితే గంజాయి బ్యాచ్ వద్ద మధ్య జరిగిన బ్లేడ్ వార్ తో ఆ ప్రాంత ప్రజలు భయాందోళనకు గురయ్యారు. భయం గుప్పెట్లో ప్రజలు వణికి పోతున్నారు. జిల్లా పోలీసు ఉన్నతా ధికారులు ఈ విషయంలో జోక్యం చేసుకొని గంజాయి బ్యాచ్ ఆగడాలను పూర్తిగా అరికట్టాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

# వరద బాధితులకు యూబీఐ ఆపన్న హస్తం

- ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు చేతుల మీదుగా 500 కుటుంబాలకు నిత్యవసర సరుకుల కిట్ల పంపిణీ




**విజయవాడ ( జర్నలిస్ట్ ఫైల్ ) :** వరద ప్రభావిత ప్రాంత ప్రజలకు ఆపన్న హస్తం అందించేందుకు లీడ్ బ్యాంక్ యూబీఐ ముందుకు కదిలింది. సోమవారం సింగ్ నగర్, శాంతినగర్ కాలనీలో వరద ప్రభావిత ప్రజలకు బట్టలు, నిత్యవసర సరుకులతో కూడిన కిట్లను అందించింది. యూబీఐ విజయవాడ జోనల్ కార్యాలయం ఆధ్వర్యంలో ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వరరావు, జోనల్ హెడ్ సీవీఎన్ భాస్కర్ రావు చేతుల మీదుగా 500 కుటుంబాలకు ప్రత్యేక కిట్లను అందించడం జరిగింది. 12 కిలోల బరువు, రూ. 3 వేలు విలువైన ఒక్కొ కిట్ లో చీరలు, పంచెలు, బెడ్ షీట్, టవల్, బియ్యం, పప్పు, చక్కెర, ఉల్లిపాయలు, వంటనూనె, పసుపు, చింతపండు, మిర్చి పౌడర్ తదితర వస్తువులు ఉన్నట్లు జోనల్ హెడ్, ఎస్ఎల్బీసీ కన్వీనర్ సీవీఎన్ భాస్కర్ తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు సహాయ సహకారాలు అందించడంలో తమ బ్యాంకు ముందుంటుందని.. ఆహార పంపిణీ, పాఠశాలల నవీకరణ తదితర సహాయ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వివరించారు.

కార్యక్రమంలో డిప్యూటీ జోనల్ హెడ్ ఎ. శారదామూర్తి, రీజనల్ హెడ్ ఎం. శ్రీధర్, డిప్యూటీ రీజనల్ హెడ్స్ హరీష్, ఐ ఎస్ ఎస్ మూర్తి, బ్యాంకు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బంగాళాఖాతంలో వాయుగుండం, మున్నేరుకు భారీగా వరద

**(జర్నలిస్ట్ ఫైల్) :** బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం, వాయుగుండంగా మారినట్లు విశాఖ వాతావరణ కేంద్రం తెలిపింది. ఉత్తర ఒడిశా, పశ్చిమబెంగాల్ వద్ద తీరాన్ని తాకనుంది. వాయుగుండం ప్రభావంతో ఏపీలో కూడా భారీ వర్షం కురవనుంది. దీంతో ఐదు జిల్లాలకు వాతావరణ శాఖ రెడ్ అలర్ట్, మరో ఎనిమిది జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది.

మున్నేరుకు వరద పెరగడంతో ఎన్టీఆర్ జిల్లా అధికారులు అప్రమత్తం అయ్యారు. ఖమ్మం వద్ద మున్నేరు నీటిమట్టం 24 అడుగులకు చేరడంతో అక్కడ రెండో నంబరు ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. నందిగామ వద్ద 65 వేల క్యూసెక్కులు ప్రవహిస్తోంది. ఇది 2 లక్షల క్యూసెక్కులకు చేరితే రహదారిపైకి వరద వచ్చి రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. కంచల, దాములూరు, ఐతవరం వద్ద అధికారులు అప్రమత్తమై స్థానికులకు మార్గనిర్దేశం చేస్తున్నారు. ఉమ్మడి విజయనగరం జిల్లా పరిధిలో 46.8 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. బొబ్బిలి మండలం కొత్తపెంట వద్ద పెంట చానల్‌కు గండి పడగా బొబ్బిలి వద్ద పారధి వంతెన వద్ద కాజ్ వే ధ్వంసమైంది. రేగిడి మండలంలో సాయన్న గడ్డ, ఆకులవ గడ్డ పొంగాయి.

మడ్డువలసయ ప్రాజెక్టుకు భారీగా వరద చేరుతోంది. తాటిపూడి జలాశయం నీటి మట్టం 297 అడుగులు కాగా ప్రస్తుత నీటిమట్టం 294.2 అడుగులకు చేరింది. అనకాపల్లి జిల్లా ఎస్. రాయవరంలో 10 సెంటీమీటర్ల వర్షం కురిసింది.

# గ్యాస్ సిలిండర్‌తో రైలును పేల్చే కుట్ర : కాళింది ఎక్స్‌ప్రెస్‌కు తప్పిన పెను ప్రమాదం




**(జర్నలిస్ట్ ఫైల్):** ఘోర రైలు ప్రమాదం తప్పింది. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ నుంచి హర్యానాలోని భివానీకి వెళుతోన్న కాళింది ఎక్స్‌ప్రెస్‌కు పెను ప్రమాదం తప్పింది. రైలు పట్టాలపై గ్యాస్ సిలిండర్, పెట్రోలు సీసాలు ఉంచి రైలును తగలబెట్టే కుట్ర వెలుగు చూసింది. ప్రయాగ్‌రాజ్ నుంచి భివానీ వెళుతోన్న కాళింది ఎక్స్‌ప్రెస్ లోకో పైలెట్ పట్టాలపై అనుమానాస్పద వస్తువును గుర్తించడంతో ఎమర్జెన్సీ బ్రేకులు వేశారు. అయినా వేగంగా ఉన్న రైలు సిలిండర్‌ను ఢీకొని ఆగిపోయింది. గ్యాస్ సిలిండర్ ఎగిరి 50 మీటర్ల దూరంగా పడింది. వెంటనే రైల్వే పోలీసులకు సమాచారం అందించడంతో వారు రంగంలోకి దిగి విచారణ చేపట్టారు. రైల్వే పోలీసుల విచారణలో భారీ కుట్ర వెలుగు చూసింది. గ్యాస్ సిలిండర్ పట్టాలపై ఉంచడంతోపాటు, అక్కడే పెట్రోలు సీసాలు, అగ్గిపెట్టెను కూడా గుర్తించారు. ఉగ్రవాదుల కుట్రగా అనుమానిస్తున్నారు. కేంద్ర ఏజన్సీలు రంగంలోకి దిగి విచారణ చేపట్టాయి. నిందితులను వదిలేదే లేదని రైల్వే అధికారులు హెచ్చరించారు. డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో పెను ప్రమాదం తప్పింది. దీంతో రైల్వే అధికారులు ఊపిరిపీల్చుకున్నారు.

# మరింత బాధ్యతగా...

- విజయవాడ వరద నష్టపరిహారం ప్రక్రియకు రెవెన్యూ శాఖ రంగంలోకి
- నష్టాల అంచనాలు వేసేటప్పుడు వరద బాధితుల పట్ల ప్రతి ఉద్యోగి ఓర్పు, సహనం, సంయమనంతో వ్యవహరించాలి
- ఎలాంటి ప్రతికూల వ్యాఖ్యలకు తావు ఇవ్వరాదు
- ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్ ):** ఆగస్ట్ 30, 2024 నుండి ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలు మరియు బుడమేరు వాగు పొంగిపొర్లడంతో విజయవాడ నగరంలోని 32 వార్డులు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. వరదలతో భారీ నష్టం జరిగిందని నిర్ధారించిన రాష్ట్ర ప్రభుత్వం, ఈ ప్రాంత ప్రజలకు నష్టపరిహారం అందించడానికి చర్యలు చేపట్టింది.

ఇందుకోసం 11 జిల్లాల నుండి (అనంతపురం, సత్య సాయి, కర్నూలు, నంద్యాల, చిత్తూరు, తిరుపతి, కడప, అన్నమయ్య, నెల్లూరు, ప్రకాశం, ఏలూరు) 1864 మంది రెవెన్యూ అధికారులు (డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, సీనియర్ అసిస్టెంట్లు)తరలివచ్చారు. రెవెన్యూ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్.పి. సిసోడియా ఉత్తర్వుల మేరకు, ఈ ఎన్యుమరేషన్ (నష్టాల అంచనా) కార్యక్రమాన్ని సెప్టెంబర్ 9 నుండి 11 వరకు మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. రాష్ట్రంలో ఏదైనా విపత్తు సంభవించినప్పుడు, రెవెన్యూ శాఖ ఫ్రంట్ లైన్ వారియర్స్‌లా ముందుండి పనిచేస్తుందని అందరూ గుర్తించారు. గతంలో విశాఖపట్నంలో హుద్ హుద్ తుఫాను, మరియు కరోనా మహమ్మారి వంటి విపత్కర పరిస్థితుల్లో రెవెన్యూ శాఖ సమర్థవంతంగా స్పందించి, అనేక కష్టాలను అధిగమించింది.

ఇటీవల వరద బాధితులకు నష్టపరిహారం అందించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి స్ఫూర్తితో పనిచేస్తున్న అధికారులు, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్, స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్.పి. సిసోడియా, భూ పరిపాలన ప్రధాన కమిషనర్ జి. జయలక్ష్మి సూచనలతో ఎన్యుమరేషన్ విధులు నిర్వహిస్తున్నారు.

వివిధ జిల్లాల నుండి వచ్చిన రెవెన్యూ ఉద్యోగులు బాధితులకు ఓర్పు, సహనం, బాధ్యతతో వ్యవహరించాలని, ఎలాంటి ప్రతికూల వ్యాఖ్యల కు తావివ్వకూడదని, వరద బాధితులు తీవ్ర ఆందోళనలో ఉన్నందున వారితో సంయమనంతో వ్యవహరించాలని రెవెన్యూ ఉద్యోగ సంఘం నాయకులు బొప్పరాజు వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు.

## ఏపీకి లలితా జ్యువెలరీ రూ.కోటి విరాళం



**(జర్నలిస్ట్ ఫైల్) :** లలితా జ్యువెలరీ అధినేత కిరణ్ కుమార్ ఏపీ వరద బాధితుల సహాయార్థం రూ.కోటి విరాళం ఇచ్చారు. చంద్రబాబును స్వయంగా కలిసి చెక్కు అందజేశారు. ఈ మేరకు కిరణ్ కుమార్‌ను సీఎం చంద్రబాబు అభినందించారు.

## రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఓఎస్డీగా రిటైర్డ్ ఐఏఎస్ బి.సుబ్బారావు



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ గారి ప్రత్యేక కార్యదర్శిగా (ఓఎస్డీ) రిటైర్డ్ ఐఏఎస్ అధికారి బి. సుబ్బారావు సోమవారం తన బాధ్యతలను స్వీకరించారు.

సుబ్బారావు ఇటీవల బాపట్ల జిల్లా జాయింట్ కలెక్టర్, అదనపు జిల్లా మేజిస్ట్రేట్ హోదాలో ఉద్యోగ విరమణ చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా వీరవాసరం మండలం నౌడూరు గ్రామానికి చెందిన సుబ్బారావు ఎంకాం, ఎంఫిల్ పూర్తిచేసి, తన ఉద్యోగ జీవితాన్ని డిప్యూటీ తహసీల్దారుగా ప్రారంభించారు.

సుబ్బారావు తన సుదీర్ఘ ఉద్యోగ జీవితంలో తహసీల్దార్, ఆర్డీవో, జిల్లా రెవెన్యూ అధికారి, జాయింట్ కలెక్టర్ గా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. ఆయన చిన్న పొదుపు మొత్తాలు డిప్యూటీ డైరెక్టర్, ఫారెస్ట్ సెటిల్మెంట్ ఆఫీసర్, ఏపీ ఐఐసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, విశాఖపట్నం పోర్ట్ ట్రస్ట్ ఎస్టేట్ ఆఫీసర్, మరియు గుంటూరు, కృష్ణా జిల్లాలకు జడ్పీ సీఇవోగా కూడా సేవలు అందించారు. ఉద్యోగ నిర్వహణలో చేసిన సేవలకు గాను అనేక సార్లు గవర్నర్ మరియు ముఖ్యమంత్రులు సుబ్బారావును ప్రశంసించారు.

## విజయ హెల్త్ కేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్కూలు పిల్లలకు ప్లేట్లు,గ్లాసుల పంపిణీ

**మంగళగిరి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** మంగళగిరి పట్టణంలోని జి ఆర్ స్కూల్ ప్రైమరీ స్కూల్ నందు మధ్యాహ్న సమయంలో పిల్లలు భోజనం ప్లేట్లు లేక ఇబ్బంది పడుతున్నారని స్కూల్ హెచ్.ఎం ద్వారా విజయ హెల్త్ కేర్ ట్రస్ట్ కి సమాచారం అంద జేయడం జరిగింది, పిల్లలు పడే ఇబ్బందిని తెలుసుకున్న వెంటనే పాత మంగళగిరి చెనక్కాయలు మిల్లు బిట్రా శ్రీనివాస్ కి విషయం తెలియపర చారు. శ్రీనివాస్ వెంటనే స్కూలు పిల్లలకు భోజనానికి ప్లేట్లు గ్లాసులు, చాక్లెట్లు ఏర్పాటు చేశారు. వారి కుటుంబ సభ్యులతో వచ్చి విజయ హెల్త్ కేర్, ఆధ్వర్యంలో వారికి అందించారు. ప్రతి ఒక్కరూ మంచి మనసుతో మన పరిసర ప్రాంతాలలో ఉన్న చిన్న చిన్న ఇబ్బందులను తెలుసుకొని ఎవరికి తోచినంత వారు తోటి వారికి సహాయపడుతూ ఉండాలని మనవి చేస్తూ,ఈ కార్యక్రమానికి స్పాన్సర్ చేసిన బిట్ర శ్రీనివాస్ కి విజయ హెల్త్ కేర్ ట్రస్టితరఫున ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలియజేసారు. స్కూల్ పిల్లలను కేవలం విద్యార్థుల లాగే కాకుండా సొంత పిల్లల్లాగా ఆదరిస్తున్న స్కూల్ హెచ్ఎం కి స్కూల్ ఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు ధన్యవాదములు తెలియజేశారు.

## వరద బాధితులకు ఊరట.. ఉచిత సేవలకు ముందుకొచ్చిన ఎల్‌జీ



**విజయవాడ (జర్నలిస్ట్) :** భారీ వర్షాల కారణంగా వరద పోటెత్తి.. పలు ప్రాంతాల్లో ఇళ్లలోని టీవీలు, ఎలక్ట్రానిక్ వస్తువులు పాడైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబు పిలుపు మేరకు.. వరద బాధితులకు ఉచిత సేవలు అందించేందుకు ప్రముఖ ఎలక్ట్రానిక్స్ సంస్థ ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ముందుకొచ్చింది. వరద నీటిలో తడిచిన ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ వస్తువులకు ఉచిత సర్వీస్ అందిస్తామని ప్రకటించింది. స్పేర్ పార్టులపై 50% డిస్కౌంట్ కూడా ఇస్తున్నట్టు తెలిపింది. ఎల్‌జీ వస్తువులు పాడైతే.. తమను సంప్రదించాల్సిందిగా కోరింది. ఈ చర్యలతో వరద బాధితులకు కాస్త ఊరట లభించనుంది.

## నాగావళి, వంశధారలోకి వరద

**శ్రీకాకుళం జిల్లా (జర్నలిస్ట్ ఫైల్) :** బంగాళాఖాతంలో వాయుగుండం కారణంగా శ్రీకాకుళం జిల్లా వ్యాప్తంగా భారీగా వర్షాలు పడుతున్నాయి. ఆమదాలవలస, గార, శ్రీకాకుళం మండలాల్లో 9 సెంటీమీటర్ల మేర వం-షపాతం నమోదైంది. మిగిలిన మండలాల్లో 2నుంచి 6 సెంటీమీటర్ల వాన కురిసినట్లు వాతావరణ శాఖ తెలిపింది. జిల్లా జిల్లా మొత్తం మీద 144 సెంటీమీటర్లు వర్షపాతం నమోదైందని అధికారులు వెల్లడించారు. నాగావళి, వంశధార నదులలోకి నెమ్మదిగా నీరు చేరుతోంది. వాగులు, కాలువలు పొంగుతున్నాయి. లావేరు మండలం బుడతవలస గ్రామం వద్ద వాగులో వ్యాను కొట్టుకుపోతుండగా స్థానికులు కాపాడారు. మడ్డువలస రిజర్వాయర్ కు సువర్ణముఖి వేగవతి నదుల నుంచి భారీగా వరద చేరడంతో ఆరు గేట్లు ఎత్తారు. ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వానలకు విశాఖ గోపాలపట్నంలో కొండచరియలు విరిగిపడుతున్నాయి. రామకృష్ణనగర్ కాళీమాత గుడి మార్గంలో కొండచరియలు విరిగిపడ్డాయి. పలు నివాసాలకు ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో ఎమ్మెల్యే గణపతి బాబు ఆదేశాల మేరకు అధికారులు స్థానికులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా? అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

క్విక్ బైట్స్

సాగర్ గేట్ల నుంచి నీటి విడుదల.. చూసేందుకు వచ్చిన పర్యాటకులు



# సాగర్ ప్రాజెక్టు 24 గేట్లు ఎత్తివేత

**హాలియా:** ఎగువన శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్ జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతోంది. దీంతో ప్రాజెక్టు 24 గేట్లను ఎత్తి 2,18,300 క్యూ సెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. సాగర్ రిజర్వాయర్ ఎగువ నుంచి 2,60,488 క్యూసెక్కుల వరద వస్తుండగా, అంతే మొత్తంలో కిందికి విడుదల చేస్తున్నారు. ఆదివారం సాయంత్రం 6 గంటల వరకు సాగర్ డ్యాం పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు(312 టీఎంసీ)లకుగాను 588. 70 అడుగులుగా నమోదైంది. కుడి కాల్వ ద్వారా 8,604 , ఎడమ కాల్వ ద్వారా 2,114, విద్యుత్ ఉత్పత్తికి 29,070 , ఎస్ఎల్‌బీసీకి 1,800, వరదకాల్వకు 600 క్యూసెక్కుల చొప్పున నీటిని వదులుతున్నారు.

**పర్యాటకుల సందడి..**

సాగర్ గేట్ల ఎత్తివేతతో చూసేందుకు పర్యాటకులు భారీగా తరలివచ్చారు. ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున వచ్చి కృష్ణమ్మ అందాలను వీక్షిస్తూ మైమరచిపోయారు. బుద్ధవనం, నాగార్జునకొండ మ్యూజియం, సమ్మక్క సారక్క, ప్రధాన డ్యాం, శివాలయం ఘాట్, పవర్ హౌస్, ఎత్తిపోతల, అనుపు, కొత్త వంతెన, పాత వంతెన, ప్రధాన గేట్లు, కొత్త బ్రిడ్జి తదితర ప్రదేశాల్లో పర్యాటకులు సందడి చేశారు.

# కార్మిక సమస్యల పరిష్కారానికి ఐఎన్‌టీయూసీ కృషి

- మినిమమ్ వేజ్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ బి.జనక్ ప్రసాద్



నాగుల శంకర్‌కు యూనియన్ కండువా కప్పుతున్న జనక్ ప్రసాద్

**గోదావరిఖని** : సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐఎన్టీయూసీ ఎల్లప్పుడూ ముందుంటుందని యూనియన్ సెక్రటరీ జనరల్, మినిమమ్ వేజ్ అడ్వైజరీ బోర్డ్ చైర్మన్ బి.జనక్ ప్రసాద్ అన్నారు. ఆదివారం రాత్రి స్థానిక యూనియన్ ఆఫీసులో జరిగిన కార్యక్రమంలో టీబీజీకేఎస్ మైన్స్ కమిటీ మాజీ మెంబర్ నాగుల శంకర్ ఐఎన్టీయూసీలో చేరాడు. ఆయనకు కండువా కప్పి యూనియన్‌లోకి జనక్‌ప్రసాద్ ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ ప్రాతినిధ్య సంఘంగా అధికారిక పత్రం ఇచ్చిన తర్వాత ఏరియాల వారీగా జీఎంలతో సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో లీడర్లు పి.ధర్మపురి, వడ్డేపల్లి దాస్, కె.సదానందం, రాజేందర్, గడ్డం కృష్ణ, ఎన్.సాగర్, ఎ.శ్రీనివాస్, రమేశ్, దశరథం గౌడ్ పాల్గొన్నారు.

## 'మదర్ డెయిరీ' ఎన్నికల్లో..

# క్యాంపు పాలిటిక్స్ షురూ

- ఈనెల 13న ఎన్నికలు.. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్యనే పోటీ
- ఓటర్లను కాపాడుకునేందుకు ఇరువర్గాలు ముమ్మర ప్రయత్నాలు



**నల్గొండ** : మదర్ డెయిరీ ఎన్నికల్లో క్యాంపు రాజకీయాలు జోరందుకున్నాయి. శని, ఆదివారాలు సెలవు రోజులు కాగా.. సోమవారం నుంచి క్యాంపు పాలిటిక్స్ షురూ చేసేందుకు ఇరు వర్గాలు ఏర్పాట్లు చేసుకున్నాయి. ఆలేరు కేంద్రంగా జరుగుతున్న ఈ ఎన్నికల్లో ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, డీసీసీబీ మాజీ చైర్మన్ మహేందర్ రెడ్డి మధ్య నువ్వా నేనా..అనే రీతిలో హోరాహోరీ నడుస్తున్నాయి. ఈనెల 13న ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఇరువర్గాలు తమ ఓటర్లను క్యాంపులకు తరలించేందుకు సిద్ధమవుతున్నాయి. 297 మంది సొసైటీ చైర్మన్లు ఓటర్లు. దీంట్లో కాంగ్రెస్ ఓటర్లు రెండొందలకు పైగా ఉండగా.. బీఆర్ఎస్ ఓటర్లు 80 మందికి పైగా ఉన్నారు. ఎ న్నికల నాటికి ఓటర్లు చేజారిపోకుండా ఉండేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. డెయిరీ ఎన్నికల బాధ్యతలు నిర్వరిస్తున్న ఎమ్మెల్యే అయిలయ్య తనవర్గాన్ని కాపాడుకునేందుకు వ్యూహాన్ని రూపొందించారు. డీసీసీబీలో మెజార్టీ డైరెక్టర్లు బీఆర్ఎస్ వైపే ఉన్నప్పటికీ తన చైర్మన్‌పీఠాన్ని కాపాడుకోవడంలో మహేందర్‌రెడ్డి విఫలమయ్యారు. అవిశ్వాస తీర్మానం పెట్టేవరకు అన్నిరకాల ప్రయత్నాలు చేశారు. ఇప్పుడు కూడా ఆలేరులో రాజకీయంగా తన ఆధిపత్యాన్ని కాపాడుకునేందుకు శతవిధాల ప్రయత్నిస్తున్నారు. ఓటుకు రూ.30 వేల వరకైనా ఖర్చు పెట్టేందుకు వెనకాడేది లేదని ఇరువర్గాలు సవాల్‌చేస్తున్నాయి. అయిలయ్య మద్దతుదారుడు మధుసూదన్ రెడ్డి చైర్మన్ అభ్యర్థిగా బరిలో ఉండగా, మహేందర్‌రెడ్డి ప్యానల్ నుంచి కొండల్‌రెడ్డి పోటీలో ఉన్నారు. డెయిరీ ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్ అనేది సర్వసాధారణం. అయితే ఆలేరులోనే 130 మంది పైగా ఓటర్లు ఉండటంతో ఇరువర్గాల్లో టెన్షన్‌నెలకొంది.




## బాసర ట్రిపుల్ ఐటీలో

# ఆగని ఆందోళనలు

- ఇన్‌చార్జ్ వీసీని తొలగించాలంటూ విద్యార్థుల డిమాండ్
- ఐదు రోజులుగా కొనసాగుతున్న నిరసన కార్యక్రమాలు

**నిర్మల్** : బాసర ట్రిపుల్ ఐటీలో తమ సమస్యలు పరిష్కరించాలని ఐదు రోజుల నుంచి స్టూడెంట్లు క్యాంపస్ లో ప్లకార్డులతో నిరసనలు తెలుపుతున్నారు. ఆదివారం ఇన్‌చార్జ్ వైస్ చాన్సలర్ వెంకటరమణ హైదరాబాద్ నుంచి క్యాంపస్ కు వచ్చిన విషయం తెలుసుకున్న విద్యార్థులంతా ఆయన గెస్ట్ హౌస్ వద్దకు వెళ్లి బైఠాయించారు. వీసీ రాజీనామా చేయాలని నినాదాలు చేశారు. తమకు రెగ్యులర్ వీసీని నియమించాలని కోరుతున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇన్‌చార్జ్ వీసీ హయాంలో సమస్యలు పరిష్కారం కావడం లేదని, తమ సమస్యలపై సర్కారుకు తప్పుడు నివేదికలు అందుతున్నాయని ఆరోపించారు. ట్రిపుల్ ఐటీ విద్యార్థుల బాగోగులు చూసే సీనియర్ ప్రొఫెసర్లలో ఒకరిని వీసీగా నియమించాలని డిమాండ్ చేశారు. హాస్టల్ మెస్ కాంట్రాక్ట్ వ్యవహారంపై ప్రభుత్వం సీరియస్ గా దృష్టి సారించి, ఇక్కడి కొందరి గుత్తాధిపత్యం నుంచి మెస్ లను తొలగించి.. కొత్త ఏజెన్సీలకు కేటాయించాలని కోరారు. దీంతోపాటు టీచింగ్, నాన్ టీచింగ్ నియామకాలను కాంట్రాక్ట్ పద్ధతిలో కాకుండా రెగ్యులర్ గా నియమించాలన్నారు. క్యాంపస్ లోని ఆస్పత్రిలో విద్యార్థినుల కోసం ప్రత్యేకంగా గైనకాలజిస్టును నియమించాలన్నారు. ఆస్పత్రిని ఆధునీకరించి అదనపు సౌకర్యాలు కల్పించాలన్నారు. మొత్తం 17 రకాల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

**త్వరలోనే సీఎంను కలుస్తామంటున్న విద్యార్థులు**

ట్రిపుల్ ఐటీలోని సమస్యలతో పాటు ఇన్‌చార్జి వీసీని తొలగించాలని, రెగ్యులర్ వీసీ, డైరెక్టర్ ను నియమించాలని కోరుతూ విద్యార్థులంతా సీఎం రేవంత్ రెడ్డిని త్వరలో కలిసేందుకు హైదరాబాద్ వెళ్లనున్నట్లు సమాచారం. గతంలో విద్యార్థుల ఆందోళనకు మద్దతు తెలిపి బాసర వరకు వచ్చిన సీఎం రేవంత్ రెడ్డికి ఇక్కడి పరిస్థితులన్నీ తెలుసని, ఆయన తమ డిమాండ్లపై సానుకూలంగా స్పందిస్తారని విద్యార్థులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. తమ డిమాండ్లను సంబంధిత ఉన్నతాధికారులు పట్టించుకోకుండా ముఖ్యమంత్రికి తప్పుడు సమాచారం అందిస్తున్నారంటూ ఆరోపిస్తున్నారు. తాడోపేడో తేల్చుకునేందుకు తామే సీఎంను స్వయంగా కలిసి సమస్యలను విన్నవించనున్నట్టు పలువురు విద్యార్థులు పేర్కొన్నారు.

## సింగరేణి సంఘానికి 'గుర్తింపు'..

# రెండేండ్లా? నాలుగేండ్లా?

### 8 నెలల తర్వాత ఐయ్యాల సర్టిఫికెట్ల అందజేత

- కాలపరిమితి నాలుగేండ్లు ఉండాలంటున్న ఏఐటీయూసీ
- రెండేండ్లు చాలనే నిర్ణయంతో ఐఎన్ టీయూసీ
- న్యాయపోరాటం చేస్తామంటున్న గుర్తింపు సంఘం




**గోదావరిఖని/కోల్‌బెల్ట్** : సింగరేణి సంస్థ గుర్తింపు సంఘం ఎన్నికల్లో గెలిచిన కార్మిక సంఘాలకు రికగ్నైజ్డ్, రిప్రజెంటేషన్ స్టేటస్ సర్టిఫికెట్లు ఇచ్చేందుకు మేనేజ్‌మెంట్ సిద్ధమైంది. ఎన్నికలు జరిగిన 8 నెలల తర్వాత సోమవారం ధ్రువీకరణ పత్రాలు అందించేందుకు హైదరాబాద్ లోని సింగరేణి భవన్‌లో ఏర్పాట్లు జరుగుతున్నాయి. అయితే.. నాలుగేండ్ల కాలపరిమితితో ఇవ్వాలని ఏఐటీయూసీ డిమాండ్‌చేస్తోంది. రెండేండ్లతో ఇస్తే న్యాయ పోరాటం చేస్తామంటోంది. ఇక ప్రాతినిధ్య సంఘంగా గెలిచిన ఐఎన్ టీయూసీ మాత్రం రెండేండ్లు చాలనే నిర్ణయంతో ఉంది. గతేడాది డిసెంబర్ 27న సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగాయి. అదే రోజు ఫలితాలు ప్రకటించారు. సింగరేణి మొత్తం 11 డివిజన్లలో శ్రీరాంపూర్, బెల్లంపల్లి, మందమర్రి, ఆర్జీ -1, ఆర్జీ -2 (ఐదు) డివిజన్లలో గెలిచి 16,177 ఓట్లతో (43.20 శాతం) ఏఐటీయూసీ ఘన విజయం సాధించింది. కానీ.. కొత్తగూడెం కార్పొరేట్, కొత్తగూడెం, మణుగూరు, ఇల్లందు, ఆర్జీ -3, భూపాలపల్లి (ఆరు) డివిజన్లలో ఐఎన్‌టీయూసీ గెలిచినప్పటికీ 14,178 ఓట్లతో (37.86 శాతం) రెండో స్థానంలో నిలిచి ప్రాతినిధ్య సంఘానికే పరిమితమైంది.

**రెండేండ్ల కాలపరిమితినేనా..?**

సింగరేణిలో మాటిమాటికి సంఘాలు సమ్మెలకు పిలుపునిస్తుండడంతో బొగ్గు ఉత్పత్తిపై తీవ్రమైన ప్రభావం చూపుతుండేది. దీంతో 1998 సెప్టెంబర్ 9న సంస్థ గుర్తింపు సంఘాలకు ఎన్నికలు నిర్వహించింది. రెండేండ్ల కాలపరిమితి ఫిక్స్ చేయగా.. ఏఐటీయూసీ గెలిచింది. కాగా.. 2001 నుంచి 2003 దాకా నాలుగేండ్ల కాలపరిమితి పెంచింది. 2007, 2012 ఎన్నికల్లోనూ దీన్నే కొనసాగించింది. 2017లో తిరిగి రెండేండ్లకు తగ్గించింది. దీంతో అప్పటి ఎన్నికల్లో గెలిచిన టీబీజీకేఎస్‌యూనియన్‌నాలుగేండ్ల కాలపరిమితి ఉండాలని కోర్టుకు వెళ్లింది. తుది తీర్పు రాలేదు. కానీ.. 2020లో కరోనా రావడంతో ఆనాటి టీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదు. బొగ్గు ఉత్పత్తిపై ఎఫెక్ట్ పడుతుందనే నెపంతో ఎన్నికలు నిర్వహించకుండా ఆరేండ్ల వరకు గుర్తింపు సంఘం కాలపరిమితి పొడిగించింది. 2023 డిసెంబర్‌లో రెండేండ్ల కాలపరిమితితో ఎన్నికలు నిర్వహించింది. ఏఐటీయూసీ గుర్తింపు సంఘంగా గెలిచి.. కాలపరిమితిపై పొడిగింపుపై కేంద్ర కార్మిక శాఖను సంప్రదించింది. ఏదైనా సానుకూల నిర్ణయం వస్తుందని ఇంతకాలం వేచిచూసింది. అయినా ఫలితంలేదు. దీంతో రెండేండ్ల కాలపరిమితితోనే అధికారిక పత్రాలను ఇచ్చేందుకు సింగరేణి నిర్ణయించినట్టు తెలుస్తోంది. సర్టిఫికెట్ అందించిన తొలిరోజు నుంచి రెండేండ్ల పాటు ఎన్నికైన సంఘాలు గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలుగా వ్యవహరిస్తాయి.

**గుర్తింపు పొందినా.. సర్టిఫికెట్లు ఇవ్వకపోగా..**

ఇప్పటివరకు గుర్తింపు సంఘంగా ఏఐటీయూసీకి, ప్రాతినిధ్య సంఘంగా ఐఎన్ టీయూసీ అధికారికంగా ధ్రువీకరణ పత్రాలను ఇవ్వలేదు. కార్మిక శాఖ సూచన మేరకు సర్టిఫికెట్లను అందజేసి వాటి ప్రతినిధులకు శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేస్తారు. బొగ్గు గనులపై అనుసరించాల్సిన విధి విధానాలను వివరిస్తారు. ఇది ఎనిమిది నెలలుగా జరగలేదు. దీంతో సింగరేణి సీఎండీ, డైరెక్టర్ల స్థాయిలో స్ట్రక్చర్డ్, జేసీసీ మీటింగ్ లు కూడా లేవు. దీంతో ఆయా సంఘాలు కార్మిక సమస్యలపై చర్చించే చాన్స్ కూడా లేకుండాపోయింది. సింగరేణి ఎన్నికల్లో గెలిచినప్పటికీ పలు సమస్యలను మేనేజ్‌మెంట్‌వద్ద ప్రస్తావించలేని పరిస్థితి నెలకొంది. సంస్థ ఏకపక్షంగా జారీ చేసిన సర్క్యులర్లు ఉద్యోగులు, కార్మికులకు శాపంగా మారినా ఏమీ చేయలేకుండా ఉండిపోయాయి.

**న్యాయపోరాటం చేస్తం**

సింగరేణి కార్మిక గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించి 8 నెలల తర్వాత గుర్తింపు పత్రం ఇస్తామని సంస్థ ఇప్పుడు పిలిచింది. రెండేండ్ల కాల పరిమితితో ఇస్తే ఒప్పుకోం. గతంలో నాలుగేండ్లు కాల పరిమితి ఇచ్చినట్టుగానే ప్రస్తుతమివ్వాలి. లేదంటే న్యాయపోరాటం చేస్తాం.

– వాసిరెడ్డి సీతారామయ్య, ఏఐటీయూసీ స్టేట్ ప్రెసిడెంట్



బ్రిడ్జి పై నుంచి పడిపోయిన కారు

# టైరు పేలి అదుపుతప్పిన కారు

- నాందేడ్ కు చెందిన ఆరుగురికి తీవ్రగాయాలు
- బాధితులంతా ఒకే కుటుంబానికి చెందినవారు
- ఆదిలాబాద్ జిల్లా రోల్ మామడ వద్ద ఘటన

**నేరడిగొండ** : కారు టైర్ పేలిపోయి అదుపుతప్పి బ్రిడ్జిపై నుంచి కిందపడటంతో ఆరుగురు తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదిలాబాద్‌జిల్లాలో జరిగింది. బాధితులు, స్థానికులు తెలిపిన మేరకు.. మహారాష్ట్రలోని నాందేడ్ నుంచి ఓ కుటుంబం కుంటాల జలపాతం చూసేందుకు ఆదివారం కారులో వస్తోంది. ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలం రోల్ మామడ వద్దకు రాగానే నేషనల్ హైవే పై అకస్మాత్తుగా కారు టైరు పేలిపోయి బ్రిడ్జి పైనుంచి కిందికి పడిపోయింది. దీంతో కారులోని ఆరుగురికి తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు వెళ్లి బాధితులను నిర్మల్ హాస్పిటల్ కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు .

# పిడుగుపాటుతో మహిళ మృతి

- మరో ముగ్గురు మహిళలకు తీవ్ర అస్వస్థత
- జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఘటన



సులోచన(ఫైల్)

**భూపాలపల్లి రూరల్,** పిడుగుపాటుతో మహిళ మృతిచెందగా, మరో ముగ్గురు తీవ్ర అస్వస్థతకు గురైన ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన ప్రకారం.. భూపాలపల్లి మండలం దుబ్బపల్లికి చెందిన పొనగంటి సులోచన(44), పొనగంటి పుష్పనీల, పొనగంటి సునీత, కారుకూరి సమ్మక్క శనివారం శ్యాంనగర్ గ్రామానికి వెళ్లి చేనులో మిరప నారు నాటుతున్నారు. మధ్యాహ్నం ఒక్కసారిగా వర్షం పడడంతో పాటు పిడుగుపాటుతో సులోచన అక్కడికక్కడే మృతి చెందింది. ఆమెకు కొద్దిదూరంలో పని చేస్తున్న ముగ్గురు మహిళలు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. స్థానికులు చూసి వెంటనే వారిని ఆస్పత్రికి తరలించారు. సులోచనకు భర్త భాస్కర్ రావు, కూతురు, కుమారుడు ఉన్నారు. మృతురాలి భర్త ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ డి.నరేశ్ కుమార్ తెలిపారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న టీజీ ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి

# విద్యుత్ రిపేర్లు స్పీడ్ గా పూర్తి చేయండి

- అదనపు సిబ్బందిని నియమించుకోవాలి
- టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

**హనుమకొండ** : భారీ వర్షాల వల్ల దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్ ఫార్మర్లకు స్పీడ్ గా రిపేర్లు చేయాలని టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి ఆదేశించారు. ఆదివారం హనుమకొండ నక్కలగుట్టలోని విద్యుత్ భవన్ లో ఖమ్మం, మహబూబాబాద్ సర్కిళ్ల ఎస్ఈలు, డీఈలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. మహబూబాబాద్ సర్కిల్ పరిధిలో 1,800 పోల్స్, 179 ట్రాన్స్ ఫార్మర్లు, 41 గద్దెలు, ఖమ్మం సర్కిల్ లో 3,780 పోల్స్, 290 ట్రాన్స్‌ఫార్మర్లు, 270 గద్దెలు దెబ్బతినడంతో మార్చాల్సి ఉందన్నారు. వెంటనే పునరుద్ధరించేందుకు అదనపు సిబ్బందిని నియమించుకుని.. స్పీడ్ గా పనులు పూర్తి చేయాలని సూచించారు. మిగతా సర్కిళ్లలోని ఏడీఈ, ఏఈలను వినియోగించుకోవాలని, అన్ని సహాయ సహకారాలు అందిస్తామని స్పష్టం చేశారు. ఎక్కువ మంది కాంట్రాక్టర్లతో పనులు చేయాలని, అవసరమైతే లైన్ల రీ రూటింగ్ చేపట్టాలని, వాగుల నుంచి 500 మీటర్ల దూరంలో 9.1 మీటర్ల స్తంభాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఆపరేషన్స్ఇన్‌చార్జ్ డైరెక్టర్ టి.మధుసూదన్ , సీజీఎంలు కిషన్, అశోక్ , బికంసింగ్, జీఎంలు నాగప్రసాద్, అన్నపూర్ణ, ఎస్ఈ అంకుష్ పాల్గొన్నారు.

**లంచం అడిగితే కంప్లయింట్ ఇవ్వండి**

టీజీఎన్‌పీడీసీఎల్ పరిధిలో అవినీతి నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారించినట్లు సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. వినియోగదారులకు మెరుగైన సేవలందించేందుకు కట్టుబడి ఉందని, సిబ్బంది కస్టమర్లను ఇబ్బంది కలిగిస్తే ఉపేక్షించబోమని హెచ్చరించింది. అధికారులు లంచాలు డిమాండ్ చేస్తే సంస్థ విజిలెన్స్ వింగ్ ఫోన్ 92810 33233 నంబర్ కు లేదంటే ఏసీబీ టోల్ ఫ్రీ 1064 నంబర్ కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని వినియోగదారులకు సూచించింది. తమ సమస్యలను 'ఎన్పీడీసీఎల్ గ్రీవెన్స్ పోర్టల్'లో కూడా ఫిర్యాదు చేయొచ్చని సంస్థ కోరింది.



ఇరుకుగా ఉన్న రాజన్న ఆలయానికి వెళ్లే రోడ్డు



వాహనాలతో ట్రాఫిక్ రద్దీ

# ఎములాడ రాజన్న టెంపుల్ రోడ్డుకు మోక్షం

- 80 ఫీట్లుగా విస్తరించేందుకు రాష్ట్ర సర్కార్ నిర్ణయం
- భూ సేకరణకు నోటిఫికేషన్ రిలీజ్.. రూ. 47 కోట్ల నిధులు
- త్వరలోనే పనులు షురూ చేయనున్న అధికారులు

**వేములవాడ** : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వేములవాడ రాజన్న టెంపుల్ రోడ్డుకు మహర్దశ పట్టనుంది. ప్రస్తుతం ఇరుకుగా ఉన్న టెంపుల్ రోడ్డును 80 ఫీట్లకు విస్తరించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో ఎన్నో ఏండ్లుగా ఉన్న ట్రాఫిక్ కష్టాలకు త్వరలోనే తీరనున్నాయి. అమరవీరుల స్థూపం నుంచి రాజన్న ప్రధాన ఆలయం వరకు రోడ్డును విస్తరించేందుకు ఇప్పటికే భూ సేకరణకు కలెక్టరేట్ నోటిఫికేషన్ రిలీజ్ చేశారు. రూ.47కోట్లతో పనులు చేపట్టనున్నారు.

**వేలాది మంది భక్తుల రాకతో రద్దీ**

రాష్ట్ర నలుమూలల నుంచి రాజన్న ఆలయానికి నిత్యం వేలాది మంది భక్తులు తరలివస్తుంటారు. బస్టాండ్ కు వచ్చిన భక్తులు టెంపుల్‌కు చేరుకోవాలంటే ఇరుకు రోడ్లతో నరకం చూస్తుంటారు. రోడ్లలో వందలాది వాహనాలతో తీవ్ర ట్రాఫిక్ ప్రాబ్లమ్స్ వస్తుంటాయి. ఎన్నో ఇండ్ల కింద వేసిన రోడ్లు.. ఇరువైపులా ఇండ్లు, షాపులు ఉండడం, పెరిగిన భక్తుల రద్దీతో రోడ్డు మరింత రద్దీగా మారిపోయింది. ఆది, సోమవారాల్లో ఆలయం ముందు నుంచి నడిచేందుకు కూడా ఇబ్బందిగా ఉంటుంది. కాగా.. తొలుత అమరవీరుల స్థూపం నుంచి ఆలయం వరకు రోడ్డు విస్తరణకు జిల్లా టౌన్ ప్లానింగ్ అథారిటీ నుంచి 80 ఫీట్లకు పర్మిషన్ వచ్చింది. ఈ రోడ్డు విస్తరణలో భాగంగా సుమారు 243 ఇండ్లు, షాపులో కోల్పోతున్నాయి. రెండో విడతలో ఆలయం నుంచి పోలీస్ స్టేషన్ వరకు విస్తరణ చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు. గతంలో పలుమార్లు టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో కొలతలు వేసి మార్కింగ్ చేశారు.

**భూ సేకరణ పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదిస్తాం**

టెంపుల్‌రోడ్డు విస్తరణకు భూసేకరణ చేసేందుకు నోటిఫికేషన్‌ఇచ్చాం. రూ.47కోట్లతో పనులు ప్రారంభిస్తాం. ఇండ్ల, షాపులు కోల్పోతుండగా.. ఎంత నష్టం జరుగుతుందనే దానిపై , రెండు నెలల పాటు భూసేకరణ చేసి పూర్తి స్థాయిలో నివేదికను ప్రభుత్వానికి నివేదిస్తాం. నష్టపోయిన వారికి పరిహారం చెల్లించిన తర్వాత పనులు చేపడతాం.

– రాజేశ్వర్, వేములవాడ ఆర్డీవో

# బాలుడు మిస్సింగ్



కిరణ్‌సాయి

**జీడిమెట్ల** : నిజాంపేట్ రాజీవ్ గృహకల్పకి చెందిన అప్పన్న, కృష్ణవేణిల కుమారుడు కిరణ్ సాయి (13) అదృశ్యమయ్యాడు. బాచుపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కిరణ్ సాయి స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిన కిరణ్ సాయి సాయంత్రం వరకు ఇంటికి రాలేదు. చుట్టు పక్కల గాలించినా ప్రయోజనం లేకపోయింది. తల్లిదండ్రులు బాచుపల్లి పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఇద్దరు బాలికలపై లైంగిక వేధింపులు

- నిందితులపై పోక్సో, అట్రాసిటీ కేసులు

**గద్వాల** : స్కూల్ వద్ద దింపుతామని చెప్పి బైక్ పై తీసుకెళ్లి ఇద్దరు బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటన జోగులాంబ గద్వాల జిల్లాలో జరిగింది. గద్వాల రూరల్ ఎస్ఐ శ్రీకాంత్ తెలిపిన మేరకు.. గద్వాల మండలం శెట్టి ఆత్మకూరు గ్రామానికి చెందిన ఇద్దరు బాలికలు గద్వాలలోని ఓ స్కూల్ లో చదువుతున్నారు. ఈనెల 6న ఉదయం ఇద్దరు బాలికలు ఇండ్ల నుంచి స్కూల్ కు బయలుదేరి వెళ్లగా..వారు రాలేదని స్కూల్ యాజమాన్యం పేరెంట్స్ కి సమాచారం ఇచ్చింది. అదే రోజు రాత్రి బాలికలను పేరెంట్స్ నిలదీయగా.. ఏడుస్తూ జరిగిన విషయం చెప్పారు. శెట్టి ఆత్మకూరు స్టేజి వద్ద ఉండే రంజిత్, తిరుమల్ తమను స్కూల్ వద్ద దింపుతామని చెప్పి బైక్ పై ఎక్కించుకొని వేరే ప్రాంతానికి తీసుకెళ్లి లైంగికంగా వేధించినట్టు చెప్పారు. దీంతో బాధిత పేరెంట్స్ ఫిర్యాదుతో ఇద్దరు నిందితుల పై పోక్సో, అట్రాసిటీ కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# చెరువులో మునిగి ఇద్దరు పిల్లలు మృతి

- నారాయణ పేట జిల్లా తిరుమలపూర్ లో ఘటన



**నారాయణ-పేట** : బంధువుల ఇంటికి వచ్చిన ఇద్దరు పిల్లలు చెరువులో మునిగి మృతి చెందిన ఘటన నారాయణపేట జిల్లాలో చోటు చేసుకుంది. గ్రామస్తుల తెలిపిన మేరకు.. నారాయణపేట మండలం తిరుమలపూర్ గ్రామానికి చెందిన చెంచు కిష్టప్ప ఇంట్లో ఒకరు చనిపోగా శనివారం దశదినకర్మ జరిగింది. అతని ఇంటికి కర్ణాటకలోని పుట్పాక్ నుంచి బంధువులు వచ్చారు. ఆదివారం కిష్టప్ప కుటుంబసభ్యులతో కలిసి పుట్పాక్ కు చెందిన రాజమ్మ, పిల్లలు గ్రామ చెరువులో బట్టలు ఉతికేందుకు వెళ్లారు. చెరువులో ఈత కొట్టేందుకు దిగిన నలుగురు పిల్లలు మునుగుతుండగా చూసిన రాజమ్మ, మరొకరు ఇద్దరు పిల్లలను కాపాడారు. అప్పటికే ప్రీతి(13), ప్రవీణ్(11) నీటిలో మునిగి చనిపోయారు. గ్రామంలో విషాదం నెలకొంది.



# నివాసిత భవనాల జోలికి వెళ్లం

• నిర్మాణ దశలో ఉన్నవాటినే కూల్చివేస్తున్నాం • ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్లలో ఉన్న ప్లాట్లు, భవనాలు కొనుగోలు చేయొద్దు • హైడ్రా కమిషనర్ రంగనాథ్

జర్నలిస్ట్ ఫైల్/సిటీ బ్యూరో

చెరువు ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్లలో నిర్మించి నివాసముంటున్న భవనాల జోలికి వెళ్లమని, కేవలం నిర్మాణ దశలో ఉన్న భవనాలను మాత్రమే కూల్చివేస్తామని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పష్టంచేవారు. ఆదివారం చోటుచేసుకున్న కూల్చివేతలపై వస్తున్న విమర్శలకు ఆయన స్పందించారు. హైడ్రా చేపడుతున్న కూల్చివేతలకు సంబంధించి కొన్ని వివరణలను కమిషనర్ రంగనాథ్ వెల్లడించారు. ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్లలో నిర్మించబడి, వ్యక్తులు ఆక్రమించిన ఇల్లు లేదా కుటుంబం నివాసమున్న కట్టడాలను ఏదీ కూల్చివేయబడదని తెలిపారు. ఎఫ్‌టిఎల్ లేదా బఫర్ లోకి వచ్చే కొత్త నిర్మాణాలను కూల్చివేయబడతాయని తెలిపారు. ఎఫ్‌టిఎల్, బఫర్ జోనలలో ప్లాట్లు, ఖాళీ స్థలాలుగానీ, భవనాలు గానీ, భూములుగానీ కొనుగోలు చేయరాదని కమిషనర్ సూచించారు. వ్యక్తిగత ఇండ్లు అలాగే స్థలాలు కొనుగోలు చేసే ముందు అవి ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్ పరిధిలో ఉన్నాయా? లేదా? అని ముందుగా ప్రజలు నిర్ధారించుకోవాలని హైడ్రా కమిషనర్ ప్రజలకు సూచించారు. ఔటర్ రింగ్ రోడ్ పరిధిలోని చెరువులకు సంబంధించిన ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్‌ల వివరాలను తెలుసుకునేందుకు హెచ్‌ఎండిఏ వెబ్‌సైట్‌లోని లేక్ ప్రొటెక్షన్ కమిటీలో తెలుసుకోవచ్చని, లేదా హైడ్రా కార్యాలయానికి వచ్చి వివరాలను తెలుసుకోవడం, సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని, ఏదేని కొనుగోలు చేసుకునే ముందు పూర్తి వివరాలను తెలుసుకున్న అనంతరమే కొనుగోలు చేయాలా? వద్దా? అనేది నిర్ధారించుకుని భవనం, ప్లాటు, ఫ్లాట్స్ కొనుగోలు చేయాలని కమిషనర్ రంగనాథ్ సూచించారు.

## విద్యాసంస్థల సంగతేంటి?

చెరువుల్లో వెలిసిన నిర్మాణదశలో ఉన్న ఆక్రమణలను మాత్రమే కూల్చివేస్తున్నామన్న హైడ్రా కమిషనర్ ఏవి రంగనాథ్ ప్రకటన సర్వత్రా ఆసక్తికరమైన చర్చనీయాంశంగా మారింది. నగరంలోని పలు చెరువుల్లో కొందరు ప్రజాప్రతినిధులకు చెందిన విద్యాసంస్థల భవనాలు ఉన్నాయనేది తెలిసిందే. అయితే, వాటిలో గత కొన్నేళ్లుగా విద్యాసంస్థలు నడుస్తున్నాయి. ఈ ఆక్రమణలను కూల్చివేయాలని హైడ్రాకు ఇప్పటికే అనేక ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో నిర్మాణ దశలో ఉన్న వాటినే కూల్చేస్తామని ప్రకటించడంతో వాటికి వెసులుబాటు కల్పించినట్లుగా విమర్శలు వస్తున్నాయి.

# టాప్ అచీవర్స్ జాబితాలో తెలంగాణ

• శ్రీధర్ బాబు వెల్లడి



జర్నలిస్ట్ ఫైల్/హైదరాబాద్ : వ్యాపార సంస్కరణల కార్యాచరణ ప్రణాళికలో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన రాష్ట్రాల్లో తెలంగాణ కూడా ఉన్నప్పటికీ ప్రతిపక్ష నేతలు రాష్ట్రాన్ని అప్రతిష్ట పాలు చేసే ప్రకటనలు ఇవ్వడాన్ని ఐటీ మంత్రి శ్రీధర్ బాబు ఖండించారు. ఈ నెల 5న కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ అవార్డును అందచేసిందని ఆదివారం ఆయన ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. వ్యాపార సంస్కరణల కార్యాచరణ ప్రణాళికలో మొత్తం 352 పరిమితులకు గాను నూటికి నూరు శాతం అమలు చేసి టాప్ అచీవర్స్ జాబితాలో తెలంగాణా స్థానం సంపాదించుకుందని శ్రీధర్ బాబు వెల్లడించారు. రాష్ట్ర పరిశ్రమల కమిషనర్ డా. జి. మల్సూర్ కేంద్ర మంత్రి పియూష్ గోయెల్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న దృశ్యం మీడియాలో కూడా వచ్చిందని ఆయన తెలిపారు.

### వరద బాధితులకు సామగ్రి అందజేత

ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లోని వరద బాధితులను ఆదుకునేందుకు హైదరాబాద్ సాఫ్ట్ వేర్ కంపెనీల సంఘం (హైసియా), నిర్మాణ డాట్ ఆర్గ్ సంస్థలు రూ.కోటి విలువైన సహాయ సామాగ్రిని అందజేస్తుడం పట్ల మంత్రి శ్రీధర్ బాబు హర్షం వ్యక్తం చేశారు. వెయ్యి సంచుల సహాయ సామగ్రితో కూడిన తొలి వాహనాన్ని ఆయన ఆదివారం నాడు సచివాలయంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీ నాయక్‌లతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. బియ్యం, వంట నూనె, చక్కెర, ఉప్మారవ్వ, ఉప్పు, కారం, పసుపు, సబ్బులు, టవల్స్, టూత్ పేస్టు, శానిటరీ ప్యాడ్ లతో కూడిన ఒక్కో కిట్ లో రూ.3వేల విలువైన సామగ్రి ఉంటుంది. మరో మూడు వాహనాల సామగ్రిని రెండు రోజుల్లో పంపించనున్నట్లు శ్రీధర్ బాబు వెల్లడించారు. కార్యక్రమంలో హైసియా అధ్యక్షుడు ప్రశాంత్ నాదెండ్ల, మాజీ అధ్యక్షుడు భరణీ కుమార్, నిర్మాణ, ఐఎస్టీ, తదితర స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులున్నారు.

# మల్లంపేట చెరువులో నిర్మాణాలు ఆమె ఘనతే!

• 7విల్లాలకు బిల్డర్‌గా విజయలక్ష్మి • కూల్చేసిన హైడ్రా



జర్నలిస్ట్ ఫైల్/హైదరాబాద్: బిల్డర్ విజయలక్ష్మి గుట్టురట్టయింది. రాజకీయ నాయకులతో కలిసి ఆమె కబ్జాలు చేస్తున్నట్లు హైడ్రా గుర్తించింది. విజయలపై అనేక క్రిమినల్ కేసులున్నాయి. ఏడు విల్లాలకు విజయలక్ష్మి బిల్డర్‌గా ఉన్నట్లు హైడ్రా గుర్తించి ఆదివారం నేలమట్టం చేసింది. అమీన్‌పూర్‌లోని వాణినగర్ చెరువులో అక్రమ నిర్మాణాలు చేసిన మాజీ ఎంఎల్‌ఏ కాటసాని రాంభూపాల్‌రెడ్డిపై కేసు నమోదైనట్లు తెలిసింది. అక్రమ కట్టడాల కూల్చివేతల సమయంలో అడ్డంపడిన విజయలపై హైడ్రా అధికారులు కేసు నమోదు చేశారు. విజయలక్ష్మి మల్లంపేట చెరువులో విల్లాలను నిర్మించినట్లు వెల్లడించారు. అయితే తాను ఎటువంటి అక్రమ కట్టడాలు చేపట్టలేదని, అసలు తనకు హైదరాబాద్‌లో ఎటువంటి బిల్డింగులు లేవని చెప్పుకొచ్చారు. ఇదే వ్యవహారంపై మాజీ ఎంఎల్‌ఏ స్పందించారు. భూసేకరణలన్నీ చట్టబద్ధమైనవేనని చెప్పారు. తన అభ్యంతరాలను అధికారులకు సమర్పించామని స్పష్టం చేశారు. తన భూములకు సంబంధించిన లేఅవుట్‌ను 1991లోనే హెచ్‌ఎండిఎ ఆమోదించిందని చెప్పారు. 2015లో కలెక్టర్ నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ (ఎన్‌ఓసీ) జారీ చేశారని కాటసాని వివరించారు.





# బిఎస్ఎఫ్ మహిళా జవాన్ ఆత్మహత్య

• గుజరాత్ రాష్ట్రంలో ఘటన
• ఎన్‌టిపిసిలో నివాళులు అర్పించిన అధికారులు

జర్నలిస్ట్ ఫైల్/జ్యోతినగర్: పెద్దపల్లి జిల్లా రామగుండం ఎన్‌టిపిసికి చెందిన బిఎస్ఎఫ్ జవాన్ బల్ల గంగా భవాని (26) గుజరాత్ రాష్ట్రంలో ఉంటున్న తన నివాసంలోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ విషయాన్ని ఆమె కుటుంబ సభ్యులు తెలిపారు. ఎన్‌టిపిసి సుభాష్ నగర్ కాలనీకి చెందిన బల్ల సుబ్రహ్మణ్యం కుమార్తె గంగాభవాని నాలుగేళ్ల క్రితం బిఎస్ఎఫ్ బెటాలియన్‌లో జవాన్‌గా చేరింది. తొలుత పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో విధులు నిర్వహించిందని తండ్రి సుబ్రహ్మణ్యం తెలిపారు. యేడాది క్రితం అక్కడి నుంచి బదిలీపై గుజరాత్ రాష్ట్రంలోని బిఎస్ఎఫ్ బెటాలియన్‌కు చేరి విధులు నిర్వహిస్తోందని అన్నారు. ఇక్కడి బెటాలియన్ క్యాంపులో డ్యూటీలో కొనసాగుతున్న తమ కూతురు రెండు రోజుల క్రితం డ్యూటీ నుంచి వచ్చి శుక్రవారం రాత్రి తన ఇంట్లోనే ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుందన్నారు. బిఎస్ఎఫ్‌లో చేరిన నాటి నుంచి క్రమశిక్షణతో డ్యూటీ చేస్తున్న తన కూతురు ఆత్మహత్య చేసుకుందని శనివారం ఉదయం బిఎస్ఎఫ్ అధికారులకు తమకు సమాచారం అందించారని అన్నారు. మృతదేహాన్ని విమానంలో హైదరాబాద్ వరకు తీసుకువచ్చి అక్కడ నుండి బిఎస్ఎఫ్ వాహనంలో ఇంటికి తీసుకువచ్చారని తెలిపారు. గంగాభవాని మృతదేహానికి బిఎస్ఎఫ్ జవాన్లతో పాటు, తహశీల్దార్ కుమారస్వామి, ఎన్‌టిపిసి ఎస్ఐ సతీష్‌తో పాటు వివిధ విభాగాల అధికారులు ఘనంగా నివాళులర్పించి, శ్రద్ధాంజలి ఘటించారు. గంగాభవానికి ఇటీవలే చెన్నైకి చెందిన ఒక యువకుడితో పెళ్లి నిశ్చితార్థం జరిగిందని కుటుంబ సభ్యులు వివరించారు.

# హైదరాబాద్ సిపిగా సివి ఆనంద్



• రెండోసారి నియామకం.. నేడు బాధ్యతల స్వీకరణ

జర్నలిస్ట్ ఫైల్/సిటీ బ్యూరో: హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా సివి ఆనంద్ మరోమారు నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఆదేశాలు జారీ చేసింది. హైదరాబాద్ కమిషనర్‌గా ఉన్న శ్రీనివాస రెడ్డిని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిజిగా బదిలీ చేసింది. ఆయన స్థానంలో సివి ఆనంద్ హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా రెండోసారి బాధత్యలు స్వీకరిచనున్నారు. డిసెంబర్, 2021 లో హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా ఉన్న అంజనీకుమార్‌ను బదిలీ చేసి ఆయన స్థానంలో ఆనంద్‌ను హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా నియమించారు. అప్పటి నుంచి ఆనంద్ అసెంబ్లీ ఎన్నికలు సమయంలో అక్టోబర్ 11,2023 వరకు పనిచేశారు. ఈ క్రమంలోనే ఎన్నికల కమిషన్ ఆనంద్‌ను బది లీ చేసి ఆయన స్థానంలో సందీప్ శాండిల్యను హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా నియమించారు. ఎన్నికల తర్వాత వచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్ పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాసరెడ్డిని డిసెంబర్,2023లో నియమించింది. అప్పటి నుంచి హైదరాబాద్ సిపిగా కొనసాగుతున్నారు. ఈ క్రమంలోనే ఎసిబి డిజిగా పని చేస్తున్న ఆనంద్‌ను హైదరాబాద్ పోలీ స్ కమిషనర్‌గా నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ చరిత్రలో రెండోసారి నియామకమై న ఏకైక అధికారిగా సివి ఆనంద్ ఘనత దక్కించుకున్నారు. సివి ఆనంద్ సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

### ఎసిబి డిజిగా విజయ్ కుమార్ బాధ్యతలు

ఎసిబి డిజిగా విజయ్ కుమార్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. అంతకు ముందు ఎసిబి డిజిగా ఉన్న సివి అనంద్ సమక్షంలో విజయ్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఈ క్రమంలోనే సివి ఆనంద్ ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. లా అండ్ ఆర్డర్ అడిషనల్ డిజిగా ఉన్న మహేష్ భగవత్‌కు పోలీస్ పర్సనల్ అండ్ వెల్ఫేర్ అడిషనల్ డిజిగా అదనపు బాధ్యతలు ఇచ్చారు. పోలీస్ స్పోర్ట్స్ ఐజీగా ఎం. రమేష్‌కు అదనపు బాధ్యతలు అప్పగించిన సంగతి విదితమే.

# వానావానా వద్దప్పా!

• రాగల మూడు రోజులు భారీ వర్షాలు • ఐదు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్



జర్నలిస్ట్ ఫైల్/హైదరాబాద్: రాష్ట్రాన్ని వర్షాలు వదలటం లేదు. ఆదివారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. గ్రేటర్ హైదరాబాద్‌ను మళ్లీ తడిపేశాయి. ఉదయం నుంచి మేఘావృతంగా ఉన్న ఆకాశం ఒక్కసారిగా కుండపోత వర్షం కుమ్మరించింది. నగరంలోని పలు ప్రాంతాల్లో రోడ్లు జలమయంగా మారాయి. బంజారాహిల్స్, అమీర్‌పేట్, సనత్‌నగర్, మియాపూర్, చందానగర్, మాదాపూర్, గచ్చిబౌలి, రాయదుర్గం జగద్గిరిగుట్ట, జీడిమెట్ల, ముషీరాబాద్, దిల్‌సుఖ్ నగర్ తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. రాష్ట్రంలో అత్యధికంగా ఖమ్మం జిల్లాలోని కొల్లూరులో 115.2 మి.మి వర్షం కురిసింది. మహబూబాదాద్‌లో 114.7, బయ్యారంలో 105జ7, అల్లూడ్‌లో 103, వైరాలో 90.9, గార్లలో 87, నేలకొండూరులో 87, డోర్నకల్‌లో 76 మిల్లీమీటర్ల చొప్పున వర్షం కురిసింది. మిగిలిన ప్రాంతాల్లో కూడా ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కుసిరింది.

### రాగల మూడు రోజులు వర్షాలు

అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలో రాగల మూడు రోజుల పాటు పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. కుమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఆదివారం నుంచి సోమవారం ఉదయం వరకూ భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. ఆదిలాబాద్, కరీంనగర్, పెద్దపల్లి, ఖమ్మం, వరంగల్, హన్మకొండ, జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షం కురిసే అవకాశం ఉన్నట్లు వెల్లడించింది. ఈ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. దీంతో మున్సిపల్ అధికారులు సిద్ధమయ్యారు. ఏవైనా వరద సమస్యలు తలెత్తితే వెంటనే సహాయం చేయడానికి తగిన చర్యలు తీసుకుంటున్నారు. ప్రజలు అవసరమైతే తప్ప బయటకు రావద్దని అధికారులు సూచించారు.

### తెలంగాణలో నేడు భారీ వర్షాలు

మరోవైపు సోమవారం కుమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని సూచించింది. ఆదిలాబాద్, కరీంనగర్, పెద్దపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ, ఈ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలను జారీ చేసింది. లోతట్టు ప్రాంతాల్లో ఇప్పటికే అధికారులు పరిస్థితుల ఆధారంగా హెచ్చరికలు జారీ చేస్తున్నారు. అల్పపీడనం వాయువ్య పరిసర మధ్య బంగాళాఖాతంలో ప్రస్ఫుటమైన అల్పపీడన ప్రాంతంగా ఏర్పడినట్లు ఐఎండీ సంచాలకులు తెలిపారు. ఇది ఉత్తర దిశగా కదులుతూ బలపడి ఉత్తర ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీరంలోని వాయువ్య బంగాళాఖాతం వద్ద నేడు వాయుగుండంగా మారే అవకాశం ఉందని తెలిపింది. తరువాత ఇది పశ్చిమ, వాయువ్య దిశగా కదులుతూ వచ్చే 3 రోజుల్లో గంగేటిక్ పశ్చిమ బెంగాల్, ఉత్తర ఒడిశా, ఝార్ఖండ్, ఉత్తర ఛత్తీస్‌గఢ్ మీదుగా కొనసాగే అవకాశం ఉన్నట్లు ప్రకటించింది.మరోవైపు రుతుపవన ద్రోణి ప్రభావంతో ఏపీలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాల్లో జోరువాన పడుతోంది. శ్రీకాకుళం జిల్లాలో ఆదివారం రాత్రి నుంచి ఎడతెరిపిలేకుండా వాన కురుస్తోంది. దీంతో రహదారులు జలమయమయ్యాయి. నాగావళి, వంశధార నదులు పొంగే ప్రమాదం ఉండటంతో నదీ పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.





మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలం చిన్న ఆదిరాల గ్రామానికి చెందిన 9మంది వ్యక్తులు ఆదివారం సోమశిల పుణ్యక్షేత్రంతో పాటు కృష్ణా నది ప్రాంతంలో పర్యటించారు. తిరుగు ప్రయాణంలో నాగర్ కర్నూలు జిల్లా తాడూరు మండలం సిర్సవాడ దుందుభి వాగు దాటుతుండగా వరద ఉధృతి ఎక్కువ కావడంతో కారు అక్కడే ఆగిపోయింది. వెంటనే వారు 100 నెంబర్‌కు కాల్ చేయడంతో అప్రమత్తమైన ఎస్ఐ మహేశ్ వెంటనే గ్రామంలోని యువకులకు సమాచారం అందించారు. గ్రామ యువకులు వెంటనే రెండు ట్రాక్టర్లతో వాగు వద్దకు వెళ్లి వాగులో కొట్టుకుపోతున్న 9మందిని కాపాడారు. గ్రామయువకులను ఎస్, సిఐలు అభినందించారు.

– జర్నలిస్ట్ ఫైల్ /నాగర్ కర్నూల్ ప్రతినిధి



## 9 మందిని కరిచిన పిచ్చి కుక్క

• మంగపేట మండలంలో దారుణం

జర్నలిస్ట్ ఫైల్/మంగపేట: పిచ్చి కుక్క 9 మందిని గాయపరిచిన సంఘటన ములుగు జిల్లా మంగపేట మండలం గంపోని గూడెం, మంగపేట, బోరునర్సాపురంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గంపోని గూడెంలో ఇద్దరిపై పిచ్చికుక్క దాడి చేసి గాయపరిచింది. స్థానికులు వెంట పడగానే అక్కడి నుంచి మంగపేటలో నలుగురిని, బోరునర్సాపురంలో మరో ఇద్దరిని గాయపరిచింది. క్షతగాత్రులు స్థానిక ప్రాథమిక ఆస్పత్రిలో చికిత్స పొందారు.

# నిండుకుండల్లా జంట జలాశయాలు

• ఉస్మాన్ సాగర్, హిమాయత్‌సాగర్ గేట్లను అడుగు మేర ఎత్తి నీటిని వదిలిన అధికారులు

జర్నలిస్ట్ ఫైల్/నార్సింగి: హైదరాబాద్ నగర జంట జలాశయాలైన ఉస్మాన్‌సాగర్, హిమాయత్ సాగర్ నిండు కుండల్లాగా మారి జలకళ సంతరించుకున్నాయి. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో జంట జలాశయాల్లోనికి వరద పోటెత్తున్న కారణంగా శనివారం నాటికి హిమాయత్ సాగర్ కు 1400 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా ఉస్మాన్‌సాగర్ కు 1800 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో తో ఎఫ్‌టిఎల్ స్థాయికి చేరటంతో స్థానిక రాజేంద్రనగర్ నియోజకవర్గ శాసనసభ్యులు టి.ప్రకాష్‌గౌడ్ ఆధ్వర్యంలో జలమండలి ఎండి అశోక్ రెడ్డి, సంబంధిత అధికారులు, స్థానిక నాయకులు కలిసి ఉస్మాన్‌సాగర్ రెండు గేట్లను, హిమాయత్ సాగర్ ఒక గేటును అడుగుమేర ఎత్తి నీటిని దిగువకు వదిలారు. హిమాయత్ సాగర్ రిజర్వాయర్ పూర్తి పూర్తి స్థాయి నీటి సామర్థ్యం 2.970 టిఎంసీలతో 1763.50 కాగా, ప్రస్తుతం 2.455 టిఎంసిల నీటి తో 1761.10 అడుగులు నమోదు అవ్వగా. ఉస్మాన్ సాగర్ రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 3.90 టిఎంసీలతో 1790.00 అడుగులు కాగా ప్రస్తుతం 3.430 టిఎంసిల నీటితో 1787.95 అడుగుల నీటి నిల్వ ఉందని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఏ ప్రకాష్‌గౌడ్ మాట్లాడుతూ జంటజలాశయాలైన ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ పూర్తిగా నిండటం చాలా ఆనందంగా ఉందన్నారు. జలాశయాల పరీవాహక లోతట్టు ప్రాంతాల వాసులు జాగ్రత్తగా ఉండాలన్నారు. సంబంధిత మున్సిపల్, వైద్య, జలమండలి,పోలీసు శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎటువంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలన్నారు. అంటువ్యాధులు సోకకుండా వైద్యబృందాలు క్యాంపులను ఏర్పాటు చేసి సంబంధిత ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో మందులను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధికారులు, పలుశాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





హిమాయత్ సాగర్ జలాశయం నుంచి రెండు గేట్ల ద్వారా నీరు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, మేయర్ లతాప్రేమ్ గౌడ్ తదితరులు

# అధికార పార్టీ నాయకులు డేగ కన్ను

### - కోట్ల విలువ చేసే రైతుల భవన్ కబ్జాకు స్కెచ్





**హిందూపురం, సెప్టెంబరు 09, జర్నలిస్ట్ ఫైల్ :** పట్టణంలోని మెయిన్ బజార్ లో ఉన్న రెండు కోట్లకు పైగా విలువచేసే రైతుల భవనాన్ని కబ్జాకు అధికార పార్టీ నాయకులు ప్రయత్నిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పండగ పూట సమయాన్ని చూసుకొని అర్ధరాత్రి పాడి రైతుల కార్యాలయ భవనాన్ని కూల్చివేశారు. తమ స్వాధీనంలోకి తెచ్చుకోవడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. దశాబ్దాల కాలంగా ఈ భవనంలో పాల విక్రయాలు జరిగేవి. పాల సహకార సంఘం రైతుల వద్ద పాలు తీసుకొచ్చి పట్టణ ప్రజలకు అనాదిగా ఇక్కడ విక్రయించే లావాదేవీలు జరిగాయి. ఈ సహకార సంఘంలో సడ్లపల్లి,పోచంపల్లి, సూగురు ప్రాంతాల రైతులు సభ్యులుగా ఉన్నారు. వారంతా సంఘంలో చేరడానికి డిపాజిట్ సొమ్మును చెల్లించారు. కమిషన్ తీసేవారు. ఇలా వచ్చిన సొమ్ముతో 40 ఏళ్ల క్రితం భవనాన్ని నిర్మించారు. పాలకవర్గం సైతం ఎన్నికయ్యేది. అయితే గత కొన్ని సంవత్సరాలుగా ఈ భవనంలో పాలక్రయ విక్రయాలు నిలిచిపోయాయి. అయితే రికార్డులన్నీ, వస్తువులు, క్యాన్లు అన్ని ఈ కార్యాలయంలోనే ఉన్నాయి. గత కొన్ని నెలలుగా భవనం ఖాళీగా ఉండటం కోట్లాది రూపాయలు విలువచేసే ప్రాంతంలో ఉండటంతో దీనిపై అధికార పార్టీ నాయకులకు కన్ను పడింది. తెదేపా అధికారంలోకి రావడంతో ఆ పార్టీకి చెందిన కొందరు నాయకులు ప్రణాళికాబద్ధంగా తమ ప్రయత్నాలు సాగించారు. పాల సహకార సంఘంలో వందలాది మంది సభ్యులు ఉండటం వారంతా గ్రామాల్లో ఉండటం పాలక వర్గం సైతం ప్రస్తుతం లేకపోవడం తదితర వాటిని గుర్తించి పండుగ పూట ఎవరు పట్టించుకోరని భవనాన్ని రాత్రిపూట కూల్చివేశారు. దీని వెనక తెదేపాకు చెందిన ఓ కీలక నాయకుడు ఉన్నట్లు పట్టణంలో ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. భవనాన్ని కూల్చివేయడానికి ఎవరి అనుమతి తీసుకున్నారు, ఎవరికి కేటాయిస్తున్నారు, ఏమి చేస్తారు ఇలాంటివి ఏమీ లేకుండా ఓ పాడి రైతుల సహకార సంఘ భవనాన్ని శుక్రవారం రాత్రి కూల్చివేయడం పట్టణంలో సంచలనంగా మారింది. ఈ భవనం పేట వెంకటరమణ స్వామి ఆలయం పక్కన ఉండటంతో శనివారం పండుగ పూట దర్శనానికి వచ్చిన భక్తులు పక్కన భవనం కూలిపోయినట్టుంది గుర్తించి ఆశ్చర్యపోయారు. ఎవరు కూల్చివేశారు అనే చర్చలు వినిపిస్తున్నాయి. ఈ కూల్చివేత పట్టణంలో సంచలనం రేకెట్టించడం చర్చినియాంశంగా మారింది. ఈ భవనం కూల్చివేత వెనక అధికార పార్టీ నాయకులు ఉన్నట్లు ప్రజలు పెద్ద ఎత్తున చర్చించుకుంటున్నారు. భూమి విలువ కోట్లాది రూపాయలు కావడంతో దాన్ని తమ వశం చేసుకోవడానికి నాయకులు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది.

# గురువులను గౌరవించడం అందరి బాధ్యత




**గూడూరు, సెప్టెంబరు 09, జర్నలిస్ట్ ఫైల్ :** భావితరాల భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యత గురువులపై ఉంటుందని అలాంటి గురువులను గౌరవించుకోవడం మన అందరి బాధ్యత అని గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ అన్నారు. గూడూరు పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాలలో ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ ఉపాధ్యాయులను సన్మానించి వారి వద్ద నుండి ఆశీర్వాదాన్ని పొందారు . ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో విలువైందని అలాంటి ఉపాధ్యాయ వృత్తికి వన్నెతెచ్చిన మహోన్నతుడు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ అని ఆయన పుట్టినరోజును దేశవ్యాప్తంగా ఉపాధ్యాయ దినోత్సవం గా జరుపుకోవడం ఆయనకు ఇచ్చే గౌరవంగా భావిస్తున్నామని తెలిపారు . ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ప్రగతి సేవా సంస్థ అధ్యక్షులు కడివేటి చంద్ర శేఖర్ , ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు .

# గంజాయి పట్టివేత



**గూడూరు, సెప్టెంబరు 09, జర్నలిస్ట్ ఫైల్ :** గూడూరు బైపాస్ జంక్షన్ లో వైజాగ్ నుండి చెన్నై కి వెళ్తున్న బస్ లో గంజాయిని తరలిస్తున్న ముగ్గురిని గూడూరు రూరల్ పోలీస్ లు అరెస్ట్ చేసిన సంఘటన చోటచేసుకుంది. ఈ సందర్భంగా గూడూరు రూరల్ ఎస్. ఐ మనోజ్ కుమార్ మాట్లాడుతూ గుంటూరు అనంతపురం జిల్లాలకు చెందిన నీలయ్య సంజయ్ కుమార్ ఉమాశంకర్ లు వైజాగ్ నుండి చెన్నై కి బస్సులో గంజాయిని తరలిస్తూ పట్టుబడినారు అన్నారు.గంజాయి విలువ సుమారు 3 లక్షల రూపాయలు ఉంటుంది అన్నారు. ఎవరైనా అక్రమంగా గంజాయి తరలిస్తే చట్ట పరమైన చర్యలు చేపడాతామన్నరు.అనంతరం కేసు నమోదు చేశామన్నారు.

## అంబేద్కర్ నగర్‌లో అంగరంగ వైభవంగా వినాయక ఉత్సవాలు



**హిందూపురం, సెప్టెంబరు 09, జర్నలిస్ట్ ఫైల్ :** వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని అంబేద్కర్ నగర్ లో వినాయక విగ్రహం ఏర్పాటు చేసి అంగరంగ వైభవంగా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా రెండవ రోజు ఆదివారం వినాయక విగ్రహానికి వివిధ రకాల పూల అలంకరణ గావించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. వేదమంత్రాలతో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు భక్తాదులు పాల్గొని స్వామివారికి పూజలు గావించి తమ భక్తుని చాటుకున్నారు. వినాయక సేవా సమితి ఆధ్వర్యంలో భక్తాదులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వినాయక సేవా సమితి సభ్యులు జయసింహ, రామ్మూర్తి, ఉదయ్, శరత్, వి.అశోక్, శ్రావణ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## ఒంటిమిట్ట శ్రీ కోదండరామ స్వామివారి ఆలయంలో శాస్త్రోక్తంగా "బాలాలయం"



**తిరుమల, సెప్టెంబరు 09, జర్నలిస్ట్ ఫైల్ :** ఒంటిమిట్ట శ్రీ కోదండరామ స్వామి వారి ఆలయంలో ఆదివారం ఆగమోక్తంగా "బాలాలయం" నిర్వహించారు. ఇందులో భాగంగా ఆదివారం ఉదయం అగ్నిప్రణయణం, దారు (చక్క) విగ్రహాలు, కుంభారాధన, అకల్మషహోమం, మహా పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం బాలాలయ మహాశాంతిప్రోక్షణ నిర్వహించారు. భారత పురావస్తు శాఖ ఆధ్వర్యంలో గర్భాలయంలో అభివృధుల నిమిత్తం "బాలాలయం" నిర్వహించారు. ఇందుకోసం ఆలయ ప్రాంగణంలో నమూనా ఆలయం ఏర్పాటుచేసి గర్భాలయంలోని మూలవర్ల దారు (చక్క) విగ్రహాలు ఏర్పాటు చేశారు. సీత రామ లక్ష్మణులకు మహా సంప్రోక్షణ జరుగువరకు నిత్యకైంకర్యాలన్నీ ఇక్కడే నిర్వహిస్తారు. ఇందులో భాగంగా యాగశాలలో ఉదయం 9.30 నుంచి 10. 30 గంటల మధ్య తులా లగ్నంలో బాలాలయ సంప్రోక్షణ శాస్త్రక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఇఓలు నటేశ్ బాబు, ప్రశాంతి, సూపరిండెంట్ హనుమంతయ్య, టెంపుల్ ఇన్స్పెక్టర్ నవీన్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

## వాల్మీకి నాయకుడు అంబికా లక్ష్మీ నారాయణకు శాంతి సేవా జాతీయ పురస్కారం



**హిందూపురం, సెప్టెంబరు 09, జర్నలిస్ట్ ఫైల్ :** అఖిల భారత షహీద్ టిప్పు సుల్తాన్ యునైటెడ్ జాతీయ అధ్యక్షులు ఉమర్ ఫారూక్ ఖాన్ ఆధ్వర్యంలో ముస్లిం పెద్దల అధ్యక్షతన వాల్మీకి నాయకుడు అఖిల పక్ష ఉద్యమ నేత, సామాజిక సేవకుడు అంబికా లక్ష్మీ నారాయణకు షహీద్ టిప్పు సుల్తాన్ శాంతి సేవా జాతీయ పురస్కారం ముస్లిం ప్రజా సంఘాలు, ముస్లిం ఉలమాలు ముస్లిం పెద్దల సమక్షంలో అందజేశారు. ఈ సందర్భంగా ఉమర్ ఫారూక్ ఖాన్ మాట్లాడుతూ ఫ్రీడమ్ ఫైటర్ టిప్పు సుల్తాన్ షహీద్ శాంతి సేవా జాతీయ పురస్కారం సామాజిక సేవకులు ఉద్యమ నేతలు రక్త దాతలు మానవతావాదులు మత సామరస్యాన్ని పెంపొందించే మత పెద్దలకు స్వాతంత్ర్య సమర యోధుడు అమర వీరుడు షహీద్ టిప్పు సుల్తాన్ పేరిట పురస్కారాలు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమం లో తబ్లీగ్ జమాత్ సభ్యులు సాధిఖ్ సాబ్, అహలే హదీస్ జమాత్ అధ్యక్షులు మౌలానా ఉస్మాన్ ఘనీ, అహలే సున్నతుల్ జమాత్ అధ్యక్షులు దౌలాసాబ్, ముస్లిం ఉలమాలు, సామాజిక సేవకులు అజమతుల్లా ఖాన్, ఉబెదుల్లా హుసేన్, ఇదరీస్,నౌషాద్, బిలాల్, జహూర్ తదితరులు పాల్గొన్నారు.

## వీది వీధిన కొలువుదీరిన వినాయకులు

### - డోన్‌లో ఘనంగా వినాయక చవితి వేడుకలు





**డోన్, సెప్టెంబరు 09, జర్నలిస్ట్ ఫైల్ :** వినాయక చవితి పండుగను శనివారం నంద్యాల జిల్లా డోన్ పట్టణంలో భక్తిశ్రద్ధలతో వైభవంగా జరుపుకున్నారు. వినాయక చవితి సందర్భంగా పట్టణంలోని వీధి వీధినా గణనాథులు కొలువు దీరారు. పట్టణంలోని టిడిపి కార్యాలయ ఆవరణలో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహానికి మాజీ కేంద్ర మంత్రి, డోన్ శాసనసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అదేవిధంగా పట్టణంలోని కొత్తపేట, కొండపేట, తారక రామ్ నగర్, ఇందిరానగర్, శ్రీరామ నగర్, వైయస్ నగర్ కాలనీలతోపాటు పల్లె పల్లెనా వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా జరుపుకుంటున్నారు. నూతనంగా ఏర్పడిన సాయినందనం కాలనీలో ఏర్పాటుచేసిన వినాయకుడి విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. జై గణేశా ,జై జై గణేశా, జై బోలో గణేష్ మహారాజ్ కీ జై అంటూ మండపాల వద్ద చిన్నారుల కేరింతలు, వినాయకుని పాటలతో పట్టణ పురవీధులని భక్తి భావంతో హోరెత్తిపోతున్నాయి. వినాయక చవితి ఉత్సవాలు పట్టణంలో ప్రతి ఏడాది మూడు రోజులే జరుపు కునేవారు. అయితే ఈ ఏడాది ఐదు రోజులపాటు జరుపుకునేందుకు ఉన్నతాధికారులు అనుమతులు ఇవ్వడంతో చవితి ఉత్సవాలను మరింత ఉత్సాహంగా జరుపుకునేందుకు ఆయా కాలనీలో విగ్రహాల కమిటీ నిర్వాహకులు ఏర్పాటు చేసుకుంటున్నారు. వీరి వీధినా కొలువైన వినాయక విగ్రహాల మండపాల వద్ద ఉండాలయ్య దండాలయ్య ఉండ్రాలయ్య మమ్మల్ని కాపాడాలంటూ .. భక్తి భావంతో భక్తులు మొక్కులు తీర్చుకుంటున్నారు. వినాయక చవితి ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవడానికి అన్ని రకాల చర్యలను చేపట్టినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. డోన్ డిఎస్పి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తును పర్యవేక్షిస్తున్నారు. ఏది ఏమైనా పట్టణంలోనే గాక పల్లె ప్రాంతాల్లో సైతం వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా జరుపుకోవడం విశేషం.

**కోట్ల సేవాసమితి ఆధ్వర్యంలో సాంస్కృతి కార్యక్రమాలు**

పట్టణంలోని టిడిపి కార్యాలయ ఆవరణలో ఏర్పాటుచేసిన వినాయక మండపంలో కోట్ల గణేష్ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలపై పోటీలు నిర్వహించారు. భరతనాట్యం, డాన్స్, భక్తి గీతాలతో పాటు వ్యాసరచన పోటీలను కూడా నిర్వహించారు . గెలుపొందిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు.

## తాళ్లూరు ఎబీసీ హైస్కూల్ విద్యార్థులకు ట్రిపుల్ ఐటీ సీట్స్

### అభినందనలు తెలిపిన పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు



**దర్శి సెప్టెంబరు 09, జర్నలిస్ట్ ఫైల్ :** తాళ్లూరు ఎబీసీ హైస్కూల్ కి చెందిన ఇరువురు విద్యార్థులకు ట్రిపుల్ ఐటీలో ప్రవేశాల సాధించినట్లు ఎబీసీ హైస్కూల్ ప్రిన్సిపాల్ కె వెంకటేశ్వర రావు తెలిపారు. 2024 ఎస్ఎస్.సి పదవతరగతి పరీక్షా ఫలితాలలో తాళ్లూరు మండల మొదటి స్థానం సాధించిన విద్యార్థి కె. అనిష్ రెడ్డి (588) , బి సూర్యప్రకాశ్ (583) లు సీట్లు సాధించారు. ఆర్ జెయూకెటీ ఇడుపుల పాయలో కౌన్సిలింగ్ కు హాజరు కాగా, శ్రీకాకుళం ఆర్ జెయూ కేటీలో సీట్లు కేటాయించారు. సూర్యప్రకాశ్ తండ్రి జయపాల్ రావు రెవిన్యూ శాఖలో లైసెన్సు సర్వేయర్ గా పనిచేస్తున్నారు. విద్యార్థులు చిన నాటి నుండి ఎబీసీ హైస్కూల్లో విద్యను అభ్యసించి ఉత్తమ మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ కె వెంకటేశ్వర రావు తెలిపారు. విద్యార్థులు ట్రిబుల్ ఐటీ సీట్లు సాధించటంపై కరస్పాండెంట్ టి. శ్రీనివాస రెడ్డి, ప్రధానోపాధ్యాయులు కె. వెంకటేశ్వర రావు, డైరెక్టర్ కె. కాలేషా బాబులు హర్షం వ్యక్తం చేసారు, విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

## ఘనంగా వినాయక చవితి ఉత్సవాలు

### జన సేన పార్టీ సీనియర్ నేత దాసరి రవిశంకర్



**వేంపల్లి సెప్టెంబరు 09, జర్నలిస్ట్ ఫైల్ :** వినాయక చవితి పండుగ సందర్భంగా వేంపల్లిలోని నాలుగు రోడ్ల కూడలిలో జనసేన పార్టీ సీనియర్ నేత డాక్టర్ దాసరి రవిశంకర్ ఆదివారం వినాయకుడిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఎటువంటి విపత్తులు జరగకుండా ప్రజలు సోదర భావంతో మెలగాలని సుఖసంతోషాలతో ఉండాలని ప్రత్యేక పూజలు చేశారు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయాలతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథకంలో నడపాలని డాక్టర్ దాసరి రవిశంకర్ ఆకాంక్షించారు

## గూడూరు సబ్ కలెక్టర్‌గా రాఘవేంద్ర మీనా



**గూడూరు, సెప్టెంబరు 09, జర్నలిస్ట్ ఫైల్ :** గూడూరు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో డివిజన్ నూతన సబ్ కలెక్టర్ గా రాఘవేంద్ర మీనా బాధ్యతలు స్వీకరించారు. ఆర్డీవో కిరణ్ కుమార్ సబ్ కలెక్టర్ కు బాధ్యతలు అప్పగించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లాలో ట్రైనింగ్ కలెక్టర్ గా పని చేశానన్నారు.. మొదటి పోస్టింగ్ గా గూడూరు కు రావడం జరిగిందని తెలిపారు. డివిజన్లోని ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అందరూ సహకరించాలని కోరారు. అనంతరం తాసిల్దార్లతో సమావేశం అయ్యారు .

## వరద బాధితులకు దాతలు చేయూత



**గూడూరు, సెప్టెంబరు 09, జర్నలిస్ట్ ఫైల్ :** గూడూరు పట్టణం బనిగి సాహెబ్ పేట ప్రాంతానికి చెందిన గురవయ్య నాయుడు ఆధ్వర్యంలో ఆ ప్రాంతంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు సీఎం సహాయ నిధికి ఒక లక్ష పదివేల రూపాయలు సీఎం సహాయ నిధికి విరాళం అందజేయడం అభినందనీయ మని గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ అన్నారు . గూడూరు పట్టణం బనిగి సాహెబ్ పేట ప్రాంతంలో గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ కు ఆ ప్రాంత టిడిపి నాయకులు 1,10,000 రూపాయల చెక్కును అందజేశారు . బలిజ కమ్యూనిటీలో 90 శాతం మంది ప్రజలు 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచేందుకు సహకరించారని వారందరికీ ధన్యవాదాలు తెలుపుకుంటున్నామని గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ తెలిపారు . గూడూరు పట్టణంలోని సుందర్ మహల్ కాంప్లెక్స్ లో బలిజ అభ్యుదయ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సీఎం సహాయ నిధికి 2 లక్షల రూపాయల విరాళాన్ని ఎమ్మెల్యే సునీల్ కుమార్ కు అందజేశారు . అదేవిదంగా టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట రమణ రెడ్డి 55 వేల రూపాయల చెక్కును ఎమ్మెల్యే సునీల్ కుమార్ కి అందచేశారు. ఈ కార్యక్రమంలో చదలవాడ హరిబాబు , శీలం కిరణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక పూజలు



**గూడూరు, సెప్టెంబరు 09, జర్నలిస్ట్ ఫైల్ :** గూడూరు రెండో పట్టణ పరిధిలోని గాంధీనగర్ ప్రాంతంలోనీ సునీల్ కుమార్ నగర్ లో వాటంబెడు బ్రదర్స్ సహకారంతో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ అభయాంజనేయ స్వామి దేవస్థానం పై ప్రతిష్టించే ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట సందర్భంగా గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు . అనంతరం ఎమ్మెల్యే సునీల్ కుమార్ అతిథులకు, దాతలకు దేవస్థానం నిర్మాణ కమిటీ సభ్యులకు కండువాలు కప్పి అభినందించారు . ఈ కార్యక్రమంలో వాటం బెడు శివ కుమార్ , వాటం బెడు హరి , తదితరులు పాల్గొన్నారు.

# కర్ణాటక కాంగ్రెస్‌లో ముదురుతున్న అంతర్గత పోరు

## సీఎం కుర్చీకోసం రేసులోకి పలువురు



**బెంగళూరు, జర్నలిస్ట్ ఫైల్ :** స్థలం కేటాయింపు కేసులో గవర్నర్ అనుమతిని సవాల్‌చేస్తూ కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టులో విచారణ జరుగుతోంది. కాగా ఇదే అదునుగా భావించి కొందరు కాంగ్రెస్ నేతలు సీఎం కుర్జీపై ఆశపడుతున్నారు. సిద్దరామయ్య తర్వాత సీఎం అయ్యే సీనియారిటీ అవకాశంఎ వరికి ఎక్కువగా ఉందనే విషయంలో ఇద్దరు సీనియర్ మంత్రులు ఎంబి పాటిల్, శివానంద్‌పాటిల్‌మధ్య మాటల యుద్ధం జరిగినట్లుగా సమాచారం. ఇటీవలే మీడియాతో మాట్లాడుతూ ఎంబిపాటిల్ ముఖ్యమంత్రి కావడంలో సీనియారిటీ ప్రధానం కాదు. పార్టీలో నాకంటే సీనియర్లు ఉన్నారు. అయినా ఇపుడు ముఖ్యమంత్రిని మార్చే ప్రశ్నేలేదు. సిద్ధరామయ్యే సీఎంగా కొనసాగుతారు. ఇపుడు ఆవిషయాల గురించి మాట్లాడటం అప్రస్తుతం. తనకు సీఎం కావాలనే కోరికలేదని శివానంద్‌పాటిల్ గతంలో అన్నారు. సీఎం అభ్యర్థిగా ఎంబి పాటిల్ ఉంటే మద్దతు ఇస్తారా అని మీడియా శివానంద్‌ను ప్రశ్నించడంతో పార్టీలో ఆయనకంటే సీనియర్లు చాలామంది ఉన్నారని, ఎంబి మరికొంతకాలం వేచి ఉండాల్సి వస్తుందని అన్నారు. కాంగ్రెస్ సీనియర్ ఎమ్మెల్యే పరిపాలనా సంస్కరణల కమిషన్ ఛైర్‌పర్సన్ ఆరవిదేశ్‌పాండే సీఎం కావాలనే తన కోరికను ఇటీవలే ప్రకటించారు. ఆయన వ్యాఖ్యలపై సీఎం స్పందిస్తూ ఎవరు సీఎం అవుతారో ఎమ్మెల్యేలు, హైకమాండ్ నిర్ణయిస్తుందని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీలో జరుగుతున్న అంతర్గత కలహాలను బిజెపి ఎత్తిచూపుతోంది. సీఎం స్థానం దక్కించుకోవడానికి కాంగ్రెస్‌లో అంతర్గతపోరు మొదలైందని, రాబోయే రోజుల్లో అది మరింత ముదురుతుందని వెల్లడించింది. కానీ పైకి మాత్రం సిద్ధరామయ్య వెంటే తాము ఉన్నామంటూ పార్టీ నాయకులు అసత్య ప్రచారాలు చేస్తున్నారని బిజెపి ఎంపి జగదీశ్‌శెట్టర్‌మండిపడ్డారు. ఉపముఖ్యమంత్రి డికెశివకుమార్ కూడా సీఎం పదవికోసం అంతర్గత ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. మైసూరు నగరాభివృద్ధి సంస్థ ముడా స్థలాలపంపిణీలో అక్రమాలు జరిగాయంటూ వచ్చిన ఆరోపణలపై విచారణకు హాజరుకావాలంటూ కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు రాష్ట్ర గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోత్ తాఖీదులు జారీచేసిన సంగతి తెలిసిందే. సీఎం సిద్ధరామయ్య భార్య పార్వ తమ్మకు వారసత్వంగా వచ్చిన భూములను ముడా స్వాధీనం చేసుకుని మరొకచోట స్థలాలు మంజూరు చేసింది. స్వాధీనం చేసుకున్న భూములకంటే మంజూరు చేసిన స్థలాల విలువ ఎక్కువగా ఉందనేది విమర్శలు. ఈ వ్యవహారంలో సమగ్ర విచారణ చేపట్టాలని కోరుతూ ఒక ఆర్టీఐ కార్యకర్త జూన్ 26న గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోత్‌కు ఫిర్యాదుచేసారు. ఆ తర్వాత ఆరాష్ట్ర సీఎంస్ ఈఫిర్యాదుకు వివరణ ఇస్తూ గవర్నర్‌కు నివేదికిచ్చారు. వాటి ఆధారంగా ఆయన సీఎంకు తాఖీదులు ఇచ్చారు. వీటిని సవాల్ చేస్తూ సిద్దరామ్య హైకోర్టును ఆశ్రయించారు.

# బ్రిక్స్ సదస్సు కోసం రష్యాకు అజిత్ దోవల్



**న్యూఢిల్లీ, జర్నలిస్ట్ ఫైల్ :** ఉక్రెయిన్‌లో శాంతి నెలకొల్పే ప్రయత్నాల్లో భారత్ ఓ అడుగు ముందుకువేసింది. ఇందులోభాగంగానే మనర జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ రష్యాకు వెళ్లేందుకు సిద్ధం అవుతున్నారు. ఈ పర్యటనలో ఆయన బ్రిక్స్ జాతీయభద్రతా దారుల సదస్సులో పాల్గొంటారు. అదే సమయంలో రష్యా చైనా కీలక అధికారులతో ఆయన భేటీ అవుతారు. గతనెల రష్యా అధ్యక్షుడు పుతిన్‌తోప్రధానిమోడీ టెలిఫోన్ సంభాషణ సమయంలో డోవల్ పర్యటన అంశం ప్రస్తావనకు వచ్చింది. బ్రిక్స్ ఎన్ఎస్ఎల సదస్సు సమయంలో ఉక్రెయిన్ శాంతికోసం ఆలోచనలను ఆయన పంచుకుంటారని వెల్లడించినట్లు సమాచారం. ఈ ఏడాది ఆగస్టులో మోడీ ఉక్రెయిన్‌ను సందర్శించారు. ఆదేశ అధ్యక్షుడు జెలెన్స్కీతో చర్చల్లో మాట్లాడుతూ చర్చలు, దౌత్యమే యుద్ధానికి పరిష్కార మార్గాలని సూచించారు. తన వ్యక్తిగత హోదాలో ఒక మిత్రుడిలా ఉక్రెయిన్ శాంతికోసం రష్యాతో మధ్యవర్తిత్వం చేస్తానని ఆఫర్ ఇచ్చారు. ఈ యుద్ధంలో భారత్ ఎంతమాత్రం తటస్థంగా లేదని, కేవలం శాంతిపక్షమే వహిస్తుందని అన్నారు. మరోవైపు ఈ యుద్ధం లోచైనా భారత్ బ్రెజిల్ మాత్రమే శాంతిచర్చలకు సాయం చేయగలవని రష్యా అధ్యక్షుడు పుతిన్ వెల్లడించిన మాట ఈ సందర్భంగా గమనార్హం. తాజాగా ఇటలీ ప్రధాని జార్జియా మెలోని కూడా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీతో చర్చలు జరిపారు. అనంతరం మాట్లాడుతూ శాంతిలో చైనా భారత్ కీలకపాత్ర పోషించగలవని అన్నారు.

# టిఎంసిలో అవినీతి, అస్మదీయులకు అడ్డూ అదుపూ లేదు

## ఎంపి పదవికి రాజీనామా చేసిన జవహర్ సిర్కార్



**కోల్‌కత్తా, జర్నలిస్ట్ ఫైల్ :** కోల్‌కత్తాలోని ఆర్జీకర్ ఆసుపత్రిలో రెసిడెంట్ డాక్టర్‌పై హత్యాచారం ఘటనతో తీవ్ర వ్యతిరేకత ఎదుర్కొంటున్న తృణ మూల్‌కాంగ్రెస్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ రాజ్యసభ ఎంపి జవహర్ సిర్కార్ పదవికి రాజీనామా చేసారు. ఈ సందర్భంగా రాసి న లేఖలో అధినేత్రి మమతా బెనర్జీ తీరును తీవ్రంగా విమర్శించారు. ఆర్జీకర్ ఘటనకు నిరసనగా తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీ నామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా మమతాకు రాసిన లేఖలో పార్టీలో అస్మదీయులు, అవినీతిపరులకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. అవినీతిపై ప్రభుత్వానికి ఆందోళన లేకపోవడం ఒక వర్గం నాయకులు మిగిలినవారిని అణగదొక్కడం వంటి చర్యలతో నాకున్న భ్రమలు తొలగిపోయాయి. అవినీతి అధికారులు అందలం ఎక్కడం వంటి విషయాలను నేను ఎంతమాత్రం అంగీకరించలేనని అన్నారు. నేను పార్టీలో ఉన్న ఇన్నేళ్లలో ఈ స్థాయి లో ఆందోళన, ప్రభుత్వ విశ్వాసరాహిత్యాన్ని ఎప్పుడూ చూడలేదన్నారు. ఆర్జీకర్ ఆసుపత్రిలోని భయకంర ఘటన తర్వాత ఓపిగ్గా నెలరోజులపాటు ఎదురు చూసానని, మీరు పాతశైలిలో నేరుగా రంగంలోకి దిగి జూనియర్ డాక్టర్ల సమస్యపై స్పందిస్తారని ఆశించానన్నారు. కానీ అది జరగలేదు. ప్రభుత్వం ఇపుడు చాలా ఆలశ్యంగా అరకొర చర్యలు తీసుకుంది. పార్లమెంట్‌లో బెంగాల్ సమస్యలు ప్రస్తావించేందుకు నాకు అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు. ఇక ఎంపికగా కొనసాగలేనని అవినీతి, మతతత్వం, కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల్లో నియంతృత్వంపై పోరాడటంలో ఏమాత్రం రాజీలేదని అన్నారు. ఆర్జీకర్ వైద్యకళాశాల ఆసుపత్రి మాజీ ప్రిన్సిపల్ సందీప్‌ఘోష్ అవినీతి విషయంలో ప్రభుత్వంపై విపరీతమైన విమర్శలు వచ్చాయని, ఇప్పటికే ఆతడిని ఈడీ, సిబిఐ విచారిస్తున్నాయని, ఆతడి ఆస్తులపై దాడులునిర్వహించాయి. ఇందుకు సంబంధించి ఆతడికి సుప్రీంకోర్టులోకూడా ఊరట లభించలేదని, రెసిడెంట్ డాక్టర్ హత్యా చారం ఘటన జరిగినప్రదేశంలో మరమ్మతులకు ఆదేశాలు జారీచేసింది కూడా ఆతడేనని తేలింది. ఆతడికి మరో కళాశాలలో పోస్టింగ్ ఇవ్వడంతో మమత సర్కారుపై తీవ్ర విమర్శలు వచ్చాయి.



# దళపతి విజయ్‌పార్టీకి ఇసి గుర్తింపు

**చెన్నై, జర్నలిస్ట్ ఫైల్ :** ప్రముఖ తమిళ చలనచిత్ర కథానాయకుడు దళపతి విజయ్ స్థాపించిన పార్టీ తమిళగ వెంట్రి కళగంకు ఎన్నికల కమిషన్‌నుంచి అధికారిక గుర్తింపు లభించింది. పోల్ ప్యానెల్‌కు చేసిన అభ్యర్థనకు ఏడునెలల తర్వాత ఆమోదం లభించింది. గతనెల చెన్నై శివారు పనైయూర్‌లోని ఆపార్టీప్రధాన కార్యాలయంలో విజయ్ జెండాను ఆవిష్కరించారు. జెండాలో పైన, కిందభాగంలో ఎరుపు, మధ్యలో పసుపురంగులున్నాయి. మధ్యలో ఎరుపు రంగు వృత్తాకారం లోపల శిరీష పుష్పం, చుట్టూ 28 నక్షత్రాలు ఉన్నాయి. వాటిలో ఐదు నీలం, మిగిలినవి పచ్చరంగులో ఉన్నాయి. శిరీష పుష్పానికి రెండువైపులా ఘీంకరించే ఏనుగు రూపాలున్నాయి. విజయ్ మాట్లాడుతూ ఇప్పటివకూ మనకోసం మనం శ్రమించాం. ఇకపై తమిళనాడు, తమిళుల ఉన్నతికోసం సమిష్టిగా కృషిచేద్దాంఅని అన్నారు. 2026లో జరిగే రాష్ట్ర శాసన సభ ఎన్నికల్లో బరిలోకి దిగుతామని విజయ్ వెల్లడించారు.

# భారత్ అమెరికా సంబంధాల బలోపేతానికి కృషిచేస్తా

## డల్లాస్‌లో రాహుల్‌కు సాదర స్వాగతం



**న్యూయార్క్, జర్నలిస్ట్ ఫైల్ :** భారత్‌అమెరికా సంబంధాలు మరింత బలపడేందుకు కృషిచేస్తానని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. అమెరికా పర్యటన ఆదివారంఉంచి ప్రారంబించారు. తన సామాజిక వెబ్‌సైట్ ఎక్స్‌లో స్పందిస్తూ ప్రవాస భారతీయులు ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ సభ్యులనుంచి డల్లాస్‌లో లభించిన ఆత్మీయ స్వాగతానికి సంతోషిస్తున్నాను. అర్థవంతమైన చర్చల్లో పాల్గొనడానికి ఎంతో ఆత్రుతగా ఉన్నానని ఇరుదేశాల సంబంధాలను బలోపేతం చేసేందుకు ఈపర్యటనలో కృషిచేస్తానని అన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల తర్వాత ఆయన అమెరికా పర్యటన చేయడం ఇదే తొలిసారి. సెప్టెంబరు 8న డల్లాస్‌లోను, 9-10 తేదీల్లో వాషింగ్టన్ డీసీలోను ఈ పర్యటన ఉంది. ఈ సారి పర్యటనలో విద్యావేత్తలు, జర్నలిస్టులు, థింక్‌ట్యాంక్ ప్రతినిధులు, సాంకేతిక నిపుణులు వ్యాపారవేత్తలతో భేటీ కానున్నారు. ఇక యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్‌లో ఆయన విద్యార్థులు, విద్యావేత్తలనుద్దేశించి ప్రసంగించే అవకాశం ఉంది. ఈ పర్యటనపై గతంలో ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ నేత శ్యామ్‌పిట్రోడా మాట్లాడుతూ రాహుల్ పర్యటన అధికారికంగా కాదని, వ్యక్తిగత హోదాలో చేపట్టిందన్నారు. ఆయన క్యాపిటల్ హిల్స్‌లో పలువురు వ్యక్తులను కలుసుకునే అవకాశం ఉందన్నారు. రాహుల్ ప్రతిపక్ష నేతగా ఎన్నికైన నాటినుంచి ఆయన్ను ఆహ్వానిస్తూ పలు దేశాల దౌత్యవేత్తలు ప్రవాస భారతీయుల నుంచి విజ్ఞప్తులు వెల్లువెత్తా యని పెట్రోడా అన్నారు. తాజా పర్యటనలో రాహుల్‌గాంధీ నేషనల్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించే విలేకరుల సమావేశంలో పాల్గొంటారని తెలిపారు.

# ఓ ఆర్మీ జనరల్ చేసిన 'టీ' తప్పనకు దేశమంతా మూల్యం


## పాక్ విదేశాంగ మంత్రి ఇసాక్ దార్ వెల్లడి



**ఇస్లామాబాద్, జర్నలిస్ట్ ఫైల్ :** అఫ్ఘానిస్థాన్‌లో తాలిబన్ల రాజ్యం ఏర్పడగానే అక్కడికి వెళ్లి టీ తాగిన పాక్ ఆర్మీకి చెందిన ఓ జనరల్ చేసిన తప్పునకు ఇప్పుడు దేశం మొత్తం మూల్యం చెల్లింస్తోందట. ఈ విషయాన్ని పాకిస్థాన్ విదేశాంగమంత్రి ఇసాక్ దార్ శనివారం లండన్ హైకమిషన్ కార్యాలయంలో వెల్లడించారు. అమెరికా మద్దతుతో ఉన్న ఘని ప్రభుత్వాన్ని కూల్చేందుకు తాలిబన్లకు మద్దతుగా కొందరు మిలిటెంట్లను విడుదల చేశారన్నారు. వారే ఇప్పుడు బలోచిస్థాన్‌లో ఉగ్రవాదానికి మాస్టర్ మైండ్లుగా మారారని ఆందోళన వ్యక్తం చేశారు. 'ఆ కప్పు టీకి దేశం మొత్తం మూల్యం చెల్లిస్తోంది' అని డాన్ పత్రిక రాసిన వ్యాసాన్ని ఉటంకించారు. గత కొన్ని రోజుల్లో జరిగిన దాడుల్లో పాక్‌లోని వివిధ ప్రావిన్స్‌ల్లో మొత్తం 14 మంది సైనికులు సహా 50 మంది ప్రాణాలు కోల్పోయిన నేపథ్యంలో దార్ ఈ వ్యాఖ్యలు చేశారు. హమీద్ కాబూల్ పర్యటనకు నాటి ప్రధాని అనుమతి ఇచ్చారా అన్న ప్రశ్నపై స్పందిస్తూ 'ఇమ్రాన్ ఖాన్ అనుమతి లేకుండా ఆయన అక్కడకు వెళ్లారని నమ్మడం చాలా కష్టం. ప్రధాని అనుమతి లేకుండా ఇలాంటివి జరగవు. సెక్యూరిటీ విభాగాలతో కలిసి మే ఈ అంశంపై పనిచేయాలి' అని పేర్కొన్నారు.

2021లో పాక్ ఐఎస్ఐ చీఫ్ ఫయాజ్ హమీద్ కాబూల్ సందర్శించారు. ఆ సందర్భంగా తాలిబన్ల ఆతిథ్యం స్వీకరిస్తూ ఓ టీ కప్పుతో దిగిన ఫొటో సంచలనంగా మారింది. తాజాగా అతడిని విమర్శిస్తూ దార్ వ్యాఖ్యలు చేశారు. ఓ కేసులో ఇటీవలే పాక్ సైన్యం ఫయాజ్ హమీద్‌ను అరెస్టు చేసింది. ప్రస్తుతం ఆయనపై కోర్టు మార్షల్ జరుగుతోంది. బలోచిస్థాన్ వేర్పాటువాదం పాకిస్థాన్‌లో తారస్థాయికి చేరింది. గత మూడేళ్లలో తెహ్రీక్ ఈ తాలిబన్, బలోచ్ మిలిటెంట్ సంస్థలు తీవ్రస్థాయిలో దాడులు నిర్వహిస్తున్నాయి. వీటి దెబ్బకు దాదాపు 60 బిలియన్ డాలర్ల వ్యయంతో నిర్మించిన చైనా-పాక్ ఎకనామిక్ కారిడార్ ప్రాజెక్టు భవిష్యత్తు కూడా ప్రమాదంలో పడింది.

# భారత్‌లో బయటపడిన మంకీపాక్స్ తొలికేసు



**న్యూఢిల్లీ, జర్నలిస్ట్ ఫైల్:** ప్రాణాంతక మంకీ పాక్స్ వ్యాప్తి వలుదేశాలను కలవరపెడుతున్నవేళ భారత్‌లోనూ ఈకేసు నమోదయింది. వ్యాధి తీవ్ర అధికంగా ఉన్న దేశంనుంచి వచ్చిన ఓ యువకుడిలో ఎంపాక్స్ లక్షణాలు గుర్తించినట్లుకేంద్ర ఆరోగ్యశాఖ ప్రకటించింది. వెంటనే ఆతడిని ఐసొలేషన్‌లో ఉంచామని ప్రస్తుతం ఆతడి ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్లు తెలిపింది. రోగినుంచి నమూనా సేకరించి ఎంపాక్స్ నిర్ధారణకోసం వంపించామని కేంద్ర ఆరోగ్యశాఖ వెల్లడించింది. నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నామని అదేసమయంలో వ్యాధి సంక్రమణ మూలాలను గుర్తించేందుకు కాంటాక్ట్‌ట్రేసింగ్ కొనసాగు తున్నదని ఆరోగ్యశాఖ వెల్లడించింది. ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఇటువంటికేసులు వెలుగు చూసిన సందర్భంలో వాటిని సమర్థంగా ఎదుర్కొనేందుకు పూర్తి సంసిద్ధతతో ఉన్నట్లు తెలిపింది. మరో ప్రాణాంతక కెంపాక్స్ వ్యాప్తి ఆఫ్రికాదేశాల్లో ఆందోళన కరరీతిలో ఉన్నట్లు నివేదికలు చెపుతున్నాయి. ఇప్పటికే 18 వేల అనుమానిత కేసులు 926 మరణాలు సంభవించాయి. కొత్తరకం కేసులు ఇప్పటివరకూ 258 నమోద య్యాయని ప్రపంచ ఆరోగ్యసంస్థ ప్రకటించింది. ఆఫ్రికాలోని బురుండి, రువాండా, కెన్యా, ఉగాండాతోపాటు స్వీడన్ థాయిలాండ్ దేశాల్లోను ఈకేసులు వెలుగు చూసాయి. భారత్‌లోనూ ఈ ఏడాది మార్చి తర్వాత ఈకేసులు నమోదు కాలేదు.

# భారత్‌లో చేరేందుకు ముందడుగేయాలి

## పాక్ ఆక్రమిత కాశ్మీర్ వాసులకు కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ పిలుపు



**శ్రీనగర్, జర్నలిస్ట్ ఫైల్ :** జమ్మూకాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారం జోరందుకుంది. రామ్‌బన్ నియోజకవర్గంలో ఆదివారం నిర్వహించిన బిజెపి ప్రచారంలో కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాక్ ఆక్రమిత కాశ్మీర్ (పిఓకె) విషయంలో కీలక వ్యాఖ్యలు చేశారు. పిఓకె వాసులు భారత్‌లో కలిసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పాకిస్థాన్ మాదిరి తాము వారికి విదేశీయుల్లా కాకుండా సొంతమనుషుల్లా పరిగణిస్తున్నామని తెలిపారు. 'జమ్మూకాశ్మీర్‌లో బిజెపికి మద్దతు ఇస్తే.. స్థానికంగా మరిన్ని అభివృద్ధి పనులు చేపడతాం. మాకు పాకిస్థాన్‌తో కలిసి ఉండటం ఇష్టం లేదు. భారత్‌కు వెళ్తామని పిఓకెలోని ప్రజలు చెప్పేంత అభివృద్ధి చేస్తాం. పిఓకెను పాక్ ఓ విదేశీ భూభాగంగా పరిగణిస్తోంది. దాయాది దేశంలోని అదనపు సొలిసిటర్ జనరల్ కూడా ఇదే విషయాన్ని ఇటీవల ఓ అఫిడవిట్‌లో పేర్కొన్నారు. అక్కడి ప్రజలను పాకిస్థాన్ విదే శీయులుగా చూస్తోంది. కానీ, భారత్ అలా కాదు. సొంత మనుషుల్లా భావిస్తోంది. మాతో వచ్చి చేరండి' అని రాజ్‌నాథ్‌సింగ్ ప్రసంగించారు. ఈ క్రమంలోనే కాంగ్రెస్- నేషనల్ కాన్ఫరెన్స్ పొత్తుపై కేంద్ర మంత్రి విరుచుకుపడ్డారు. బిజెపి ఉన్నంత జమ్మూ కాశ్మీర్‌లో ఆర్టికల్ 370 పునరుద్ధరణ అసాధ్యమని స్పష్టం చేశారు. ఆర్టికల్ 370ను రద్దు చేసిన తర్వాత జమ్మూ కాశ్మీర్‌లో భద్రత పరిస్థితిలో మంచి మార్పు వచ్చిందని తెలిపారు. ఇదిలా ఉండగా.. జమ్మూ కాశ్మీర్‌లోని 90 అసెంబ్లీ స్థానాలకు మూడు దశల్లో (సెప్టెంబరు 18, 25, అక్టోబరు 1) పోలింగ్ నిర్వహించనున్నారు. 8న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

# హుడా కుటుంబాన్ని ఎప్పటికీ ప్రజలు క్షమించరు

## హర్యానా ప్రచారంలో బ్రిజ్‌భూషణ్ శరణ్‌సింగ్ ధ్వజం



**న్యూఢిల్లీ, జర్నలిస్ట్‌ఫైల్:** బిజెపి నాయకుడు, మాజీ ఎంపి బ్రిజ్‌భూషణ్ హరియాణా మాజీ సీఎంపై విమర్శలతో ద్వజమెత్తారు. మాజీ సీఎం భూపీందర్‌సింగ్ హుడా, ఆయన కుటుంబసభ్యులను పాండవులతో పోల్చారు. మహాభారత సమయంలో ద్రౌపదిని పెట్టిన జూదమాడి పాండవులు ఓడిపోయారు. దానివల్ల ఆమె పరాభవం పొందింది. అందుకు ప్రాండవులను దేశం ఇప్పటికీ క్షమించలేదు. అలాగే మన అక్కచెల్లెళ్లు ఆడపడుచుల పరువుకు భంగం కలిగించిన హుడా కుటుంబాన్ని కూడా ప్రజలు క్షమించరు. ఈ విషయంలో వారిని ఎప్పుడూ దోషులుగానే చూస్తారని అన్నారు. రెజ్లర్లు వినేశ్‌ఫొగట్, భజరంగ్ పూనియా కాంగ్రెస్‌లో చేరిన విష యంపై ఆయన మాట్లాడుతూ రెజ్లర్లు తనపై చేసిన ఆరోపణలు, నిరసనలు అన్నీ కాంగ్రెస్ కుట్రలో భాగమేనని ఇపుడు రుజువవుతోందని అన్నారు. ఈ విషయంలో భూపీందర్‌సింగ్ కూడా కీలకపాత్ర పోషించారని విమర్శించారు. బ్రిజ్ భూషణ్‌పై రెజ్లర్లు ఆరోపణ చేయడం ఫలితంగా ఆయనపై కేసులు నమోదుకావడం, కోర్టులో కూడా బ్రిజ్ భూషణ్‌కు చుక్కెదురు కావడం వంటివి జరిగాయి. ఇదిలా ఉంటే ఆదివారంనుంచి కాంగ్రెస్ తరవున వినేశ్ ఎన్నికల్లో ప్రచారం ప్రారంభించారు. జులానా స్థానం నుంచి ఆమె పోటీలో ఉన్నారు. తాను రెజ్లింగ్‌లో ఏది గెలిచినా అది ప్రజల వల్లనేనని అలాగే ఎన్నికల్లోనూ విజయం సాధిస్తానని ఆశిస్తున్నట్లు తెలిపారు. మమ్మల్ని అక్కడ కూర్చునేలా బిజెపిచేసింది. నా ప్రతి అడుగులో నా సొంతప్రజలే నాతో ఉన్నారని, ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటున్నానని, ఇకపై నేను చేసే ప్రతియుద్ధంలో విజయం సాధిస్తానని వినేశ్ వెల్లడించింది.

# నేను అధికారంలోకి వస్తే..వారంతా జైలుకే

## అమెరికా మాజీ ప్రెసిడెంట్ ట్రంప్ హెచ్చరిక



**వాషింగ్టన్, జర్నలిస్ట్ ఫైల్ :** అమెరికాలో అధ్యక్ష ఎన్నికలు సమీపిస్తున్న వేళ మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోషల్ మీడియాలో పెట్టిన పోస్టు వైరల్‌గా మారింది. ఎన్నికల సమయంలో అవినీతికి పాల్పడే వారిని ఉద్దేశిస్తూ ఈ పోస్టు చేశారు. తాను అధికార పీఠమెక్కాక అవినీతిపరులందరిని జైలుకు పంపిస్తానని హెచ్చరించారు. తమ ప్రభుత్వం వారికి కఠిన శిక్ష అమలు చేస్తుందని పేర్కొన్నారు. 'దయచేసి జాగ్రత్త వహించండి. అధ్యక్ష ఎన్నికల్లో నేను గెలిస్తే.. చట్ట వ్యతిరేక కార్యకాలాపాలు, ఓటింగ్‌లో అనైతిక చర్యలకు పాల్పడిన వారిని వదిలే ప్రసక్తే లేదు. న్యాయవాదులు, రాజకీయ నా యకులు, దాతలు, అక్రమ ఓటర్లు, అధికారులు అందరికీ అదే వర్తిస్తుంది. పూర్తి స్థాయిలో విచారణ జరుగుతుంది. ఓటింగ్‌లో అవినీతికి పాల్పడినట్లు తేలితే.. మునుపెన్నడూ చూడని విధంగా చర్యలు ఉంటాయి. దీర్ఘకాల జైలు శిక్షలు ఉంటాయి. తద్వారా న్యాయ దుర్వినియోగం మళ్లీ జరగదు' అని ట్రంప్ హెచ్చరించారు. గత అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ ఓటమిని చవి చూశారు. నాడు ఎన్నికల వేళ అవినీతి జరిగిందంటూ ఆయన ఆరోపించారు. కానీ, దాన్ని రుజువు చేసేందుకు సరైన ఆధారాలు లేకపోవడంతో అవి ఆరోపణలుగా మిగిలిపోయాయి. దీంతో ఓటింగ్ వేళ మరో సారి అవినీతి జరగకుండా ఉండాలనే ఆయన ఈ పోస్టు పెట్టినట్లు తెలుస్తోంది. అవినీతి జరిగితే అధికారం చేపట్టగానే వారిపై చర్యలు తీసుకుంటానని పరోక్షంగా హెచ్చరిస్తున్నారు. కాగా త్వరలో అమెరికాలో అధ్యక్ష ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే. రేసు నుంచి అధ్యక్షుడు జో బైడెన్ తప్పుకోగా ఉపా ధ్యక్షురాలు కమలా హారిస్ ప్రచారంలో దూసు కెళుతున్నారు. మరోవైపు ట్రంప్ అధికారం చేజిక్కించుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. అధ్యక్ష అభ్యర్థులుగా ఖరారైన వీరిద్దరూ తొలి డిబేట్‌లో పాల్గొననున్నారు. ఈ డిబేట్‌పై యావత్ దేశం ఆసక్తిగా ఎదురుచూస్తోంది.




# రైలు కప్లింగ్ బ్రేక్‌తో రెండుగా విడిపోయిన మగధ్ ఎక్స్‌ప్రెస్

**పాట్నా, జర్నలిస్ట్ ఫైల్ :** రైలు బోగీల మధ్య ఉంటే కప్లింగ్ బ్రేక్ అయ్యింది. దీంతో ఆ రైలు రెండుగా విడిపోయింది. ఈ నేపథ్యంలో ప్రయాణికులు భయాందోళన చెందారు. బీహార్‌లోని బక్సర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. న్యూఢిల్లీ నుంచి ఇస్లాంపూర్‌కు వెళుతున్న మగద్ ఎక్స్‌ప్రెస్ కప్లింగ్ తెగిపోయింది. దీంతో ట్వినిగంజ్, రఘునాథ్‌పూర్ రైల్వే స్టేషన్ల మధ్య ఆ రైలు రెండుగా విడిపోయింది. ఆదివారం ఉదయం 11.08 గంటల సమయంలో ఈ సంఘటన జరిగినట్లు రైల్వే అధికారులు తెలిపారు. అయితే ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదని చెప్పారు. 'రైలు ట్వినిగంజ్ స్టేషన్ దాటినప్పుడు ఈ సంఘటన జరిగింది. రైలు ఇంజన్ నుంచి 13, 14వ కంపార్ట్‌మెంట్లు అయిన ఎస్-7, ఎస్-6 కోచ్‌ల మధ్య కప్లింగ్ బ్రేక్ అయింది. ఆ రైలు రెండుగా విడిపోయింది' అని ఈస్ట్ సెంట్రల్ రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ (సిపిఆర్ఒ) సరస్వతి చంద్ర వెల్లడించారు. కాగా, రెస్క్యూ టీమ్, సాంకేతిక బృందాలు సంఘటనా స్థలానికి చేరుకున్నాయని రైల్వే అధికారులు తెలిపారు. సమస్యను సరిచేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. రైలు కప్లింగ్ బ్రేక్‌పై దర్యాప్తు జరుపుతున్నట్లు వెల్లడించారు. ఈ సంఘటన వల్ల డౌన్‌లైన్‌లో రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడినట్లు వివరించారు.

# హసీనాను రప్పించేందుకు అన్ని చర్యలు తీసుకుంటాం

## బంగ్లాదేశ్ చీఫ్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ తాజుల్ ఇస్లాం



**ఢాకా, జర్నలిస్ట్ ఫైల్ :** బంగ్లాదేశ్‌లో ఇటీవల రిజర్వేషన్ల వ్యతిరేక నిరసనల్లో పెద్ద ఎత్తున హింస చెలరేగిన విషయం తెలిసిందే. వందలమంది మృతిచెందారు. ఈ క్రమంలోనే మాజీ ప్రధాని షేక్ హసీనా తదితరులపై హత్యకేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం హసీనా భారత్‌లో ఆశ్రయం పొందుతున్నారు. సామూహిక హత్యల ఆరోపణలపై విచారించేందుకుగాను ఆమెను స్వదేశానికి రప్పించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని బంగ్లాదేశ్ ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రిబ్యునల్ కొత్త చీఫ్‌ప్రాసిక్యూటర్ ఎండి తాజుల్ ఇస్లాం తెలిపారు. సామూహిక హత్యలు ఇతర నేరాలకు సంబంధించి షేక్ హసీనా సహా పరారీలో ఉన్న నిందితులందరిపైనా అరెస్టు వారంట్లు జారీచేసేందుకు ఐసిటికి దరఖాస్తుచేస్తామని ఢాకాలో తాజుల్ ఇస్లాం తెలిపారు. నిందితుల అప్పగింత ఒప్పందం కింద హసీనాను భారత్‌నుంచి బంగ్లాదేశ్‌కు తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. నిందితులకువ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఆధారాలు సేకరించాల్సి ఉందని ఇది సవాలుతో కూడుకున్న పని అని చెప్పారు. తాత్కాలిక ప్రభుత్వ ఆరోగ్యసలహాదారు నూర్జహాన్ బేగం తెలిపిన వివరాలప్రకారం హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్‌ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగిన నిరసనల్లో వెయ్యిమందికి పైగా మరణించారని అన్నారు. జులై 15 నుంచి ఆగస్టు ఐదువరకూ జరిగిన మారణ హోమం ఇతరనేరాల ఆరోపణలపై హసీనా మరో తొమ్మిది మందిపైఐసిటి గతనెలలో దర్యాప్తు ప్రారంభించింది. ఐసిటిని పునర్ వ్యవస్థీకరిస్తున్నారు.

## వరద బాధితులకు చిట్టి చేతులతో పెద్ద సాయం..

**○వీడియో షేర్ చేసిన సీఎం చంద్రబాబు**



**పొలిటికల్ డెస్క్ ( జర్నలిస్ట్ ఫైల్ ):** బెజవాడను బుడమేరు ముంచేసింది.. గత వారం రోజులుగా విజయవాడ పట్టణం వరద బీభత్సంతో అస్తవ్యస్థంగా మారింది. వరద ముంపుతో బాధితులు సర్వస్వం కోల్పోయి రోడ్డునపడ్డారు. వరద బాధిత కుటుంబాలకు సాయం అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు.. ఈ క్రమంలో అనేక మంది ముందుకు వచ్చారు. వీరిలో ఎంతో మంది సినీ ప్రముఖులతో పాటు, సంపన్నులు, వ్యాపార, పారిశ్రామిక వేత్తలు కూడా ఉన్నారు. కోట్ల రూపాయల సాయం చేస్తున్నారు. ఈ క్రమంలోనే కొందరు చిన్నారుల అందించిన వరద సహాయం సీఎం చంద్రబాబును కదిలించింది. చిట్టిచేతులు పెద్ద సాయం చేశాయంటూ అందుకు సంబంధించిన వీడియోను షేర్ చేస్తూ.. ఆ చిన్నారుల్ని ఎంతగానో ప్రశంసించారు సీఎం చంద్రబాబు.
ప్రస్తుతం చంద్రబాబు షేర్ చేసిన ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీనిని కోట్ చేసిన చంద్రబాబు.. ఇది తనను ఎంతో మురిసిపోయేలా చేసిందని వ్యాఖ్యానించారు. పశ్చిమ గోదావరి జిల్లా, పెంటపాడుమండలం పడమర విప్పర్రు గ్రామానికి చెందిన ఓ స్కూల్ విద్యార్థులు విజయవాడ వరద బాధితులకు సాయం అందించారు. ఇంట్లో తల్లిదండ్రులు వారికి ఇచ్చిన పాకెట్ మనీని దాచుకున్న పిల్లలు వరద సాయం కోసం అందించారంటూ సీఎం చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు.

## సోషల్‌మీడియాలో నీచంగా ట్రోల్స్ చేస్తున్నారు.. కన్నీటిపర్యంతమైన డాక్టర్ కాదంబరీ జత్వానీ



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** సోషల్‌మీడియాలో తనను దారుణంగా ట్రోల్స్ చేస్తున్నారని బాలీవుడ్ నటి కాదంబరి జత్వానీ ఆవేదన వ్యక్తం చేశారు. తన కేసును రాజకీయాలతో ముడి పెట్టవద్దని అందర్నీ విజ్ఞప్తి చేశారు. తనపై పెట్టిన తప్పుడు కేసుకు సంబంధించిన కీలక డాక్యుమెంట్లను జత్వానీ సోమవారం బయటపెట్టారు. చాటింగ్ వివరాలు, తన ఆధార్ కార్డు ఫోర్జరీ జరిగిన విధానం, పోలీసు అధికారుల ప్రమేయం సహా వివరాలను వెల్లడించారు.
ఈ సందర్భంగా కాదంబరి జత్వానీ మీడియాతో మాట్లాడుతూ.. ఈ కేసుపై జ్యుడీషియల్ ఎంక్వైరీ వేయాలని విజ్ఞప్తి చేశారు. కుక్కల విద్యాసాగర్ ఫిర్యాదు సాకుతో కొంతమంది అధికారులు కూడా తనతో నీచంగా ప్రవర్తించారని తెలిపారు. వారిపై కూడా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. అప్పుడు ఆ అధికారులు విద్యాసాగర్‌కు ఎందుకు కొమ్ముకాశారని ప్రశ్నించారు.
ఏపీ ప్రభుత్వం పోలీసులు, తనకు న్యాయం చేస్తారనే నమ్మకం ఉందని జత్వానీ అన్నారు. అయితే ఈ కేసులో తనపై సోషల్‌మీడియాలో నీచ ప్రచారం చేస్తున్నారని అన్నారు. తన కేసును రాజకీయాలతో ముడి పెట్టవద్దని విజ్ఞప్తి చేశారు. ఒక ఆడపిల్లకు అన్యాయం చేసిన వారికి శిక్షపడేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కేసును సీరియస్‌గా తీసుకుని తనకు న్యాయం చేయాలన్నారు. తనకు అండగా నిలిచిన మహిళా సంఘాలందరికీ జత్వానీ కృతజ్ఞతలు తెలిపారు.

## ఎమ్మెల్యే కామినేనికి తృటిలో తప్పిన ప్రమాదం



**కైకలూరు ( జర్నలిస్ట్ ఫైల్ ) :** మాజీ మంత్రి, కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాసరావుకు ప్రమాదం తప్పింది. కైకలూరు మండలంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తుండగా ఆయన ప్రయాణిస్తున్న వాహనం.. నీటిలో చిక్కుకొని ఒక పక్కకు ఒరిగింది. అప్రమత్తమైన భద్రతా సిబ్బంది కామినేనిని కిందకు దింపి సురక్షితంగా బయటకు తీసుకురావడంతో ప్రమాదం తప్పింది.
ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కృష్ణా జిల్లా కైకలూరు మండలంలోని ఆలపాడు–కొల్లేటికోట రహదారి పూర్తిగా నీటమునిగింది. దీంతో అక్కడి ప్రజల యోగక్షేమాలు అడిగి తెలుసుకునేందుకు వరద ప్రభావిత ప్రాంతమైన పందిరిపల్లిగూడెం గ్రామానికి బొలెరో వాహనంలో వెళ్లారు. ఆ గ్రామంలో పర్యటిస్తున్న సమయంలో కామినేని వాహనం వరద నీటిలో మునిగి ఒక పక్కకు ఒరిగింది. దీంతో అప్రమత్తమైన అధికారులు, కూటమి నాయకులు.. కామినేనిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు.

## వరద బాధితులపై చేయి చేసుకున్న వీఆర్వో సస్పెండ్

**విజయవాడ ( జర్నలిస్ట్ ఫైల్ ) :** వరద బాధితులపై చేయి చేసుకున్న వీఆర్వోపై ప్రభుత్వం చర్యలు తీసుకుంది. విజయవాడ నగరంలోని అజిత్ సింగ్ నగర్ లో ఆహారం, నీరు అందించడం లేదని అడిగిన వరద బాధితులపై చేయి చేసుకున్న వీఆర్వో విజయలక్ష్మిని కలెక్టర్ సస్పెండ్ చేశారు. వరదతో సర్వస్వం కోల్పోయిన బాధితులకు అన్ని రకాలుగా అండగా ఉండాలని.. కోపంలోనో, అసహనంతోనో వారు ఒకమాట అన్నా.. అధికారులు ఓపిక పట్టాలి అని సీఎం చంద్రబాబు నాయుడు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అయినప్పటికీ సీఎం ఆదేశాలు బేఖాతరు చేస్తూ కొంతమంది అధికారులు వరద బాధితుల పట్ల చిన్నచూపు చూస్తున్నారు. వారితో కఠినంగా వ్యవహరిస్తున్నారు. అలాంటి అధికారులపై కొరడా ఝుళిపిస్తోంది ప్రభుత్వం. సోమవారం సింగ్ నగర్లో వరద బాధితులపై అకారణంగా చేయి చేసుకున్న వీఆర్వోను విధుల నుండి తొలగిస్తున్నట్టు కృష్ణా జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. మరోసారి అధికారులు ఇలాంటి చర్యలకు పాల్పడితే ఊరుకునేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.

**అసలేం జరిగిందంటే..**

విజయవాడ నగరంలోని అజిత్ సింగ్ నగర్లోని షాదీఖాన రోడ్డులో తమకు ఆహారం, నీళ్ళు ఇవ్వడం లేదంటూ బాధితులు ఆందోళనకు దిగారు. ఈ విషయం గురించి విచారించేందుకు వచ్చిన వీఆర్వో విజయలక్ష్మిని.. ఆహారం, నీళ్ళు ఎందుకు ఇవ్వడం లేదు.. అనేక ఇబ్బందులు పడుతున్నాం.. చిన్న పిల్లలు తీవ్ర అవస్థలు పడుతున్నారంటూ బాధితులు నిలదీశారు. కొద్దిసేపు బాధితులకు, వీఆర్వోకు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగి.. సహనం కోల్పోయిన వీఆర్వో విజయలక్ష్మి ఓ బాధితుని చెంప పగలగొట్టారు. దీంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొనడంతో.. పోలీసులు వీఆర్వోను అక్కడి నుండి పంపించి వేశారు. వీఆర్వోపై తక్షణమే చర్యలు తీసుకోవాలని వరద బాధితులు ధర్నాకు దిగారు.

# సీఎం చంద్రబాబు పిలుపునకు అనూహ్య స్పందన

**○వరద బాధితులకు విరాళాలు వెల్లువ**



**విజయవాడ ( జర్నలిస్ట్ ఫైల్ ) :** వరద బాధితులను ఆదుకునేందుకు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. సీఎం సహాయ నిధికి విరాళాలు వెల్లువెత్తుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా వివిధ రంగాల్లో స్థిరపడిన తెలుగు వారు బాధితులను ఆదుకునేందుకు తమ వంతు చేయూతనిస్తున్నారు. వరద బాధితులకు అందే సహాయ చర్యలను నిత్యం పర్యవేక్షిస్తూ 9 రోజులుగా విజయవాడ కలెక్టరేట్లోనే ఉంటున్న సీఎం చంద్రబాబును కలిసి పలువురు విరాళాల చెక్కులను అందజేశారు. చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో వచ్చిన వరదలతో తీవ్రంగా నష్టపోయిన బాధితులను తిరిగి సాధారణ స్థితికి చేర్చేందుకు తమ వంతు సహకారం అందిస్తున్న దాతలకు సీఎం కృతజ్ఞతలు తెలిపారు.
విశాఖపట్నానికి చెందిన జీఎమ్ఆర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చల్లా ప్రసన్న, సీఈఓ మనోమేరాయ్ రూ. 2.5 కోట్లు, ఏఐజ హాస్పిటల్స్ ఛైర్మన్ డాక్టర్ డి.నాగేశ్వరరెడ్డి రూ. 1 కోటి(ఆన్ లైన్ ట్రాన్సాక్షన్), వెల్ జాన్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ అధినేత వెలమాటి జనార్థన్ రావు రూ. 1 కోటి చెక్కులను సీఎంకు అందించారు. మెప్మా తరపున తేజ్ భరత్ రూ. 1 కోటి, ప్రసాద్ సీడ్స్ అధినేత ప్రసాద్ రూ. 50 లక్షలు, సింగపూర్ ప్రవాస తెలుగువారు రూ. 17 లక్షల 50 వేలు, సిద్ధార్థ మెడికల్ కాలేజీ పూర్వవిద్యార్థి డాక్టర్ అమ్మన్న రూ. 15 లక్షలు, పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు రూ. 10 లక్షలు, ఎన్ఆర్ఐలు సురేష్ మానుకొండ, ఉప్పు వినోద్ బాబు, వరదా అమర్ రూ. 10 లక్షలు అందించారు.
ఏపీ ప్రభుత్వ డాక్టర్స్ అసోసియేషన్ నుంచి డాక్టర్ బాబ్జి శ్యామ్ కుమార్ రూ. 6 లక్షలు, బెస్ట్ ఆగ్రో లైఫ్ లిమిటెడ్ యాజమాన్యం సూర్యదేవరబాబు–వెంకట రమా ప్రసాద్ రూ. 5 లక్షలు, వల్లూరి రవీంద్రనాథ్, తేజ్, రూ. 5 లక్షలు, మండపేట రైస్ మిల్లర్స్ తరపున రూ. 5 లక్షలు, ఛాంబర్ అఫ్ కామర్స్ తరపున రూ. 1.5 లక్షలు, రోటరీ క్లబ్ తరపున రూ. 75 వేలకు సంబంధించిన చెక్కులను ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అందించారు. మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ రూ. 5 లక్షలు, ది అలమూరు తాలూకా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ తరపున రూ. 5లక్షల రూపాయల చెక్కులను సీఎంకు అందజేశారు.
తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం రూ. 4 లక్షలు, టీ.సతీష్ రూ. 3 లక్షలు, పాలడుగు పార్వతిదేవి రూ. 3 లక్షలు, ప్రసాద్ నాయుడు రూ. 2,00,116, గాంధీ రూ. 2,00,016, కొత్తపల్లి గాంధీ రూ. 1 లక్ష, కేవీఎస్వీ ప్రసాద్ రూ. 1 లక్ష, యలమంచిలి విమలాబాయ్ రూ. 1 లక్ష, తోటకూర రాజారత్నం బాబు రూ. 1 లక్ష, టి.కిషోర్ కుమార్ రూ. 1,11,116లు అందించారు. గారపాటి శ్రీలక్ష్మీ రూ. 1 లక్ష, పులి వెంకటేశ్వర్లు రూ. 1 లక్ష, కె. ప్రభాకర్ రావు రూ. 75 వేలు, కరణం పద్మజ బంగారపు ఉంగరం, దివ్యాంగుడు వీ.బాబూరావు రూ. 50 వేలు, కరుసల శైలజా రూ. 50 వేలు, ఏ.బాలాజీ ప్రసాద్ రూ. 50 వేలు, జీఎన్.బీ.వీ.ప్రసాద్ రావు రూ. 50 వేలు, చలసాని సుబ్బారావు రూ. 40 వేలు, భార్గవి రూ. 32 వేలు, జి.సాంబశివరావు రూ. 10 వేలు, ఆర్.రాధాకృష్ణ రూ. 10 వేల అందించారు.

# ప్రకాశం బ్యారేజ్ గేట్ల మరమ్మతులు- ట్రయల్ రన్ సక్సెస్



**విజయవాడ ( జర్నలిస్ట్ ఫైల్ ):** ప్రకాశం బ్యారేజ్ గేట్లను పడవలు ఢీకొని దెబ్బతిన్న కౌంటర్ వెయిట్లను ఇంజినీర్లు విజయవంతంగా అమర్చారు. నిపుణుడు కన్నయ్యనాయుడు ఆధ్వర్యంలో ఇంజినీర్లు రేయింబవళ్లు కష్టపడి కేవలం నాలుగు రోజుల్లోనే మరమ్మతులు పూర్తి చేశారు. కింద నుంచి ఉద్ధృతంగా నీరు ప్రవహిస్తున్నా తాడు, క్రేన్ల సాయంతో సాహసోపేతంగా మరమ్మతులు పూర్తి చేశారు. ట్రయల్ రన్ చేసి గేట్లు ఆపరేట్ చేశారు. ప్రకాశం బ్యారేజ్‌కి ఎలాంటి ముప్పు లేదని రైతులకు ఎలాంటి నష్టం ఉండదని కన్నయ్య నాయుడు ప్రకటించారు. రికార్డు సమయంలోనే బ్యారేజ్ వద్ద మరమ్మతులు చేసినందుకు కన్నయ్యనాయుడుతోపాటు ఇంజినీర్లు, అధికారులను సన్మానించారు. బీజేపీనేత పాతూరి నాగభూషణం సహా కూటమి నేతలు కన్నయ్య నాయుడును శాలువాతో సత్కరించి అభినందించారు. ప్రస్తుతం కౌంటర్ వెయిట్లను కాంక్రీట్‌తో నింపే పనిని వేగవంతం చేశారు. ఈరోజుతో గేట్ల మరమ్మతు పనులు పూర్తి కానున్నాయి.
నిరంతరాయంగా శ్రమిస్తూ 17 టన్నుల బరువున్న కౌంటర్ వెయిట్‌ను 3 భాగాలుగా కత్తిరిస్తున్నారు. అదే సమయంలో ఇప్పటికే 67, 69 గేట్లకు ఏర్పాటుచేసిన కౌంటర్ వెయిట్లను కాంక్రీట్‌తో నింపే పనిని వేగవంతం చేశారు. 4.5 టన్నులున్న వాటి బరువును 17 టన్నులకు పెంచే ప్రక్రియ చేపట్టారు. ఇవాళ 3 కౌంటర్ వెయిట్లలోనూ కాంక్రీట్‌తో నిర్ణీత బరువు నింపడం సహా యథాతథంగా గేట్లు నిర్వహించేలా చేయనున్నారు.
బ్యారేజీ పటిష్ఠత పెంచేలా మరిన్ని చర్యలు : ఆదివారం సాయంత్రం బ్యారేజీపైకి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు గేట్ల మరమ్మతు పనులను పరిశీలించారు. వేగంగా పనులు చేస్తుండటం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. బ్యారేజీ పటిష్ఠత పెంచేలా మరిన్ని చర్యలు తీసుకోవాలని ప్రాజెక్టు గేట్ల నిపుణుడు, జలవనరులశాఖ సలహాదారు కన్నయ్య నాయుడుని సీఎం ఆదేశించారు.
"ప్రకాశం బ్యారేజ్‌కి ఎలాంటి ముప్పు లేదు. ఇక రైతులకు ఎలాంటి నష్టం ఉండదు. కౌంటర్ వెయిట్లను అమర్చిన తరువాత ట్రయల్ రన్ చేసి గేట్లు ఆపరేట్ చేశాం. ప్రస్తుతం గేట్లు దెబ్బతిన కుండా పడవలను తీయాలని చూస్తున్నాం. పనులు చురుగ్గా సాగుతున్నాయి. కొత్తగా తెచ్చిన 3 కౌంటర్ వెయిట్లలోనూ కాంక్రీట్‌తో నిర్ణీత బరువు నింపడం సహా యథాతథంగా గేట్లు నిర్వహించేలా పనులు చేస్తున్నాం."– కన్నయ్య నాయుడు, జలవనరులశాఖ సలహాదారు
ప్రకాశం బ్యారేజీకి వరద మళ్లీ పెరుగుతోంది. 4 లక్షల క్యూసెక్కులకుపైగా నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. వరద ప్రవాహం లక్ష క్యూసెక్కులకు తగ్గాక 67, 68, 69 గేట్లు మూసేసి అక్కడ చిక్కుకున్న భారీ పడవలను తొలగించే పనులు ప్రారంభిస్తారు. పడవలను తొలగిస్తే ఆపరేషన్ విజయవంతమైనట్లే.

# ఆక్రమణల తొలగింపునకు ఏపీలో పటిష్ట చట్టం..

**○హైడ్రా తరహా కావాలంటోన్న ఏపీ ప్రజలు**

**విజయవాడ ( జర్నలిస్ట్ ఫైల్ ) :** పది రోజులు కావస్తున్నా విజయవాడ ప్రజలు వరద ముంపులోనే అష్ట కష్టాలు పడుతున్నారు. మరి ఇన్ని కష్టాలకు ఒకే ఒక్క కారణం బుడమేరు ఉప్పొంగడమే. ఒకే ఒక్క రాత్రి అంతలా ఉగ్రరూపం దాల్చడానికి కారణాలు ఏమిటని తరచి చూస్తే మానవ తప్పిదాలే కనిపిస్తున్నాయి. జలవనరులను ఎడాపెడా ఆక్రమించి ప్రకృతి విరుద్ధంగా ప్రవహిస్తే ఫలితం ఎలా ఉంటుందో అన్నదానికి ఆ తప్పులు సాక్ష్యంగా నిలుస్తున్నాయి. బుడమేరు కాలువ వెంట విచ్చలవిడి ఆక్రమణలు ప్రజల పాలిట శాపంగా మారడంతోదీనిపై ఏపీ సర్కార్ సీరియస్‌గా దృష్టి పెట్టింది. విజయవాడకు మరో సారి వరద కష్టం రాకుండా నగరానికి దుఃఖదాయినిగా మారిన బుడమేరు ప్రక్షాళనకు రెడీ అయింది. ఆపరేషన్ బుడమేరు చేపట్టి భవిష్యత్తులో ఇలాంటి ఇబ్బంది కాకుండా చర్యలు తీసుకుంటామని చంద్రబాబు స్పష్టం చేశారు. రాజకీయ నేతల అండతో కొందరు ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తున్నారని ఇక నుంచి చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. బుడమేరు ఆక్రమణల తొలగింపునకు పటిష్ట చట్టం తెస్తామన్నారు చంద్రబాబు. ప్రజల భద్రత కంటే తనకు మరేమీ ఎక్కువ కాదని తేల్చి చెప్పారు. కొల్లేరులో ఆక్రమణలు వల్ల నీరు వెనక్కి తన్నే పరిస్థితి ఉందని, దీనిని పరిశీలించి ఆక్రమణలు కొట్టేస్తామని చంద్రబాబు స్పష్టం చేశారు. మరోవైపు అక్రమణల తొలగింపునకు హైడ్రా తరహా వ్యవస్థ తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. హైడ్రాను ఏపీ ప్రజలతోపాటు రాజకీయ నేతలకు కూడా స్వాగతిస్తున్నారు.
ఇటీవల ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాన్‌పై పాజిటీవ్‌గా స్పందించారు. ఈ మధ్య విజయవాడ వరదలకు కారణమైన బుడమేరు గురించి మాట్లాడుతూ హైడ్రా ప్రస్తావన తీసుకొచ్చిన పవన్ చెరువులను కాపాడే విషయంలో రేవంత్ మంచిపని చేశారన్నారు.
ఇక ఏలేరు ప్రాజెక్టుకు పెరుగుతున్న వరద ఉద్ధృతిని నిశితంగా పరిశీలిస్తూ అన్ని ముందస్తు చర్యలు తీసుకుంటున్నామన్నారు చంద్రబాబు. విశాఖ, అల్లూరి జిల్లాల్లో కొండ చరియలు విరిగిపడే ప్రమాదం గుర్తించి ముందస్తు హెచ్చరికలు పంపామని తెలిపారు.
మొత్తంగా భారీ వర్షాలతో అలర్ట్ జారీ చేస్తూ ఓ వైపు సహాయక చర్యలను కొనసాగిస్తూనే మరోవైపు విజయవాడలో వరదలకు కారణమైన బుడమేరు అక్రమణల తొలగింపుకు సిద్ధమైంది ఏపీ ప్రభుత్వం.

# ప్రింటింగ్ పరిశ్రమపై పిడుగు

**○450 కోట్లకు పైగా నష్టం వాటిల్లిందని ప్రాథమిక అంచనా**

**○నీట మునిగి పాడైన 50 కోట్ల మేర యంత్రాలు, మరో 250 కోట్ల విలువైన పుస్తకాలు, 150 కోట్ల విలువైన పేపర్ బండిళ్లు**



**విజయవాడ ( జర్నలిస్ట్ ఫైల్ ):** విజయవాడలో వరదలు ముద్రణా రంగంపై తీవ్ర ప్రభావం చూపాయి. కోట్లాది రూపాయల పుస్తకాలు, పేపర్ బండిళ్లు నీటమునిగాయి. సరకును తీసుకోవడానికి కూడా వీల్లేకుండా వరదలు ముంచెత్తాయని ప్రింటింగ్ ప్రెస్ యజమానులు లబోదిబోమంటున్నారు. పుస్తకాలు నీటిలో నానిపోయి ఎందుకూ పనిరాకుండా పోయాయి.
ఆంధ్రప్రదేశ్లో 80 శాతం ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలకు పాఠ్యపుస్తకాలు, వర్క్ బుక్లు, ఇతర మెటీరియల్, పట్టాదారు పాస్ పుస్తకాలు, హెల్త్, బీమా కార్డులు, రేషన్ కార్డులు ముద్రించే కీలకమైన 18 ప్రింటింగ్ ప్రెస్లోకి 3 నుంచి 4 అడుగుల మేర వరదనీరు చేరింది. విద్య సంబంధిత మెటీరియల్ తయారు చేసే విక్రం, వీజీఎస్, రాఘువేంద్ర వంటి పబ్లిషర్స్ కూడా తీవ్రంగా నష్టపోయాయి. మొత్తం 450 కోట్లకు పైగా నష్టం వాటిల్లిందని ప్రాథమిక అంచనా. 50 కోట్ల మేర యంత్రాలు, మరో 250 కోట్ల విలువైన పుస్తకాలు, ఇంకో 150 కోట్ల విలువైన పేపర్ బండిళ్లు నీటిలో మునిగి పాడయ్యాయి. ముద్రణ రంగం ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి పొందుతున్న సుమారు 7 వేల మంది రోడ్డున పడ్డారు. ప్రభుత్వం తగిన రీతిలో అదుకుంటే తప్ప సంస్థల పునరుద్ధరణ కష్టమని నిర్వాహకులు చెబుతున్నారు. ముద్రణ సంస్థల్లో ఇప్పటికీ వరద నీరు చేరి ఉంది. ప్రభుత్వ ఆర్డర్లపై ముద్రించిన అనేక పాఠ్యపుస్తకాలు నీటిలో తేలుతున్నాయి. ముద్రణ యంత్రాలు మునిగే ఉన్నాయి.
వరద నీటి ఉద్ధృతితో మూడు, నాలుగు రోజుల వరకు ప్రెస్ వద్దకు నిర్వాహకులు చేరుకోలేకపోయారు. ఆ తరువాత అతి కష్టం మీద వెళ్లినా అప్పటికే తీవ్రమైన నష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు. గంట వ్యవధిలో కళ్ల ముందే ప్రెస్ లోపలికి పది అడుగుల మేర వరద నీరు చేరిందని, ఏమీ చేయలేక నిస్సహాయ స్థితిలో ఉండిపోయామన్నారు. ఇంతటి భారీ విపత్తు ఎప్పుడూ చూడలేదని, కొన్ని నెలలపాటు ప్రెస్లను పునరుద్ధరించే అవకాశం కనిపించట్లేదని వాపోయారు. అప్పటివరకు జీవనోపాధి కోల్పోయినట్లేనని ప్రింటింగ్ సంస్థ నిర్వాహకులు ఆవేదన చెందుతున్నారు.
విజయవాడలోని ఆటోనగర్, గాంధీనగర్, వన్ టౌన్ ప్రాంతాల్లోని ప్రింటింగ్ ప్రెస్లపై వరద ప్రభావం కొంత మేర ఉన్నా, సింగ్ నగర్లో సంస్థలు తీవ్రంగా నష్టపోయాయి. రాష్ట్ర వ్యాప్తంగా 105 ప్రింటింగ్ ప్రెస్లు, పబ్లిషర్స్ ఉంటే వీటిలో 50 వరకు విజయవాడలోనే ఉన్నాయి. వీటిలో కొన్ని ఇటీవలే 75 ఏళ్లు పూర్తి చేసుకున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలకు ఇక్కడే పాఠ్య పుస్తకాలు ముద్రించి పంపిణీ చేసేవారు.
విభజన తరువాత ఏపీ వ్యాప్తంగా ఇక్కడి నుంచే పాఠ్య పుస్తకాలు, ప్రశ్నపత్రాలు ముద్రించి అందిస్తున్నారు. వరదల దెబ్బకు పుస్తకాలు, పేపర్ బండిళ్లు దారుణంగా దెబ్బతిన్నాయి. లోపలకి అడుగు పెట్టేందుకే వీలులేకుండా పరిస్థితి మారిపోయింది. ఇన్నేళ్ల వ్యాపార జీవితంలో ఎప్పుడూ ఇలాంటి విపత్తు ఎదుర్కోలేదని నిర్వాహకులు వాపోతున్నారు.
వరదతో తీవ్రంగా నష్టపోయిన ముద్రణ రంగాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని నిర్వాహకులు కోరుతున్నారు. కొత్త యంత్రాలు కొనేందుకు రాయితీలు అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. విద్యుత్తు ఛార్జీల రద్దు, రుణాల రీషెడ్యూలింగ్, బ్యాంకు రుణాలపై ఆరు నెలలపాటు మారటోరియం విధించాలని అభ్యర్థిస్తున్నారు. ప్రభుత్వం నుంచి రావలసిన పెండింగ్ బిల్లులు చెల్లించి ఆదుకోవాలని సీఎం చంద్రబాబుకు నిర్వాహకులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## సీఎం చంద్రబాబుపై ప్రశంసల జల్లు కురిపించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి



**పొలిటికల్ డెస్క్ ( జర్నలిస్ట్ ఫైల్ ):** మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి సోమవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడుపై ప్రశంసల జల్లు కురిపించారు. ఏపీని భారీ వర్షాలు, వరదలు ముంచెత్తుతున్న విషయం తెలిసిందే. కుండపోత వర్షంకుతోడు బుడమేరుకు గండ్లు పడటంతో విజయవాడలోని పలు ప్రాంతాలు వరద ముంపుకు గురయ్యాయి. ముంపు ప్రాంతాల్లో చంద్రబాబు పర్యటిస్తూ వారికి అన్ని విధాలుగా అండగా నిలుస్తున్నారు. ఈ విషయంపై మాజీ మంత్రి మల్లారెడ్డి మాట్లాడారు. వరదలు విజయవాడను అతలాకుతలం చేసినా 74ఏళ్ల వయస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజలకోసం తీవ్రంగా శ్రమిస్తున్నారు. తన అనుభవంతో వరదల్లో ప్రజలను కాపాడారని చంద్రబాబు నాయుడుపై ప్రశంసలు కురిపించారు.
మల్లారెడ్డి బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరతారని ఎప్పటి నుంచో ప్రచారం జరుగుతోంది. అయితే, ఎప్పటికప్పుడు ఆ ప్రచారాన్ని మల్లారెడ్డి ఖండిస్తూ వస్తున్నారు. తాజాగా మరోసారి ఆ విషయంపై మల్లారెడ్డి స్పందించారు. నేను పార్టీ మారలేదు. బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నానని స్పష్టం చేశారు. అయితే, సమయం వచ్చినప్పుడు చెప్తానంటూ కీలక వ్యాఖ్యలు చేశారు. మల్లారెడ్డి ఆదివారం అలిపిరి నుంచి నడక మార్గం ద్వారా తిరుమల కొండపైకి చేరుకున్నారు. ఆయనతో పాటు పలువురు బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు కూడా నడకమార్గంలో తిరుమల చేరుకున్నారు. ఇవాళ ఉదయం మల్లారెడ్డి శ్రీవారిని దర్శించుకున్నారు.

## ఏ ఒక్క రైతుకు అన్యాయం జరిగినా సహించేది లేదు



**○ఎన్యుమరేషన్ ప్రక్రియలో అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి**

**○అకాల వర్షాల వల్ల నష్టపోయిన వేమూరు పంట పొలాలను పరిశీలించిన నక్కా ఆనందబాబు**

**వేమూరు ( జర్నలిస్ట్ ఫైల్ ) :** వేమూరు నియోజకవర్గంలో ఇటీవల కురిసిన అకాల వర్షాల వల్ల తీవ్రంగా నష్టపోయిన పంట పొలాలను ఈరోజు వేమూరు శాసనసభ్యులు, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు పరిశీలించారు. ఆయన చుండూరు మండలం మండూరు, ఆలపాడు, వేమూరు మండలం కోడిపర్రు, పెనమర్రు, అబ్బనగూడవల్లి గ్రామాలతో పాటు కొల్లూరు మండలం రావికంపాడు గ్రామాలను సందర్శించారు.
ఈ సందర్భంగా, నక్కా ఆనందబాబు గారు మాట్లాడుతూ, రైతులు అధైర్య పడవద్దని, పంట నష్టం అంచనా వేసి ప్రభుత్వం నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకుంటుందని ఆయన హామీ ఇచ్చారు.
నక్కా ఆనందబాబు వైసీపీ ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ, గత ఐదు సంవత్సరాల్లో డ్రైన్‌లు, కాలువలు పట్టించుకోకపోవడం వల్ల ఈ పరిస్థితి తలెత్తిందని, వైసీపీ ప్రభుత్వంలో కనీస అవగాహన లేకుండా దోపిడీ పాల్పడినట్టు ఆరోపించారు. వర్షాలకు వరి మరియు హార్టికల్చర్ పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, రైతులు పూర్తిగా నష్టపోయారని తెలిపారు. చివరిదాకా ప్రతి ఎకరానికి న్యాయం జరిగేలా చూస్తామని, సీఎం చంద్రబాబు నాయుడు రైతులకు అండగా ఉంటారని నొక్కిచెప్పారు.
ఏ ఒక్క రైతుకు అన్యాయం జరిగినా కూడా సహించేది లేదని, ఎన్యుమరేషన్ ప్రక్రియలో అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని నక్కా ఆనందబాబు గారు అధికారులను హెచ్చరించారు.

## మిజోరం గవర్నర్ కంభంపాటి హరిబాబుకు అస్వస్థత



**హైదరాబాద్ ( జర్నలిస్ట్ ఫైల్ ) :** మిజోరం గవర్నర్ కంభంపాటి హరిబాబు అస్వస్థతకు గురయ్యారు. హైదరాబాద్ పర్యటనలో ఉన్న ఆయన ఉన్నట్టుండి అనారోగ్యం పాలయ్యారని సమాచారం. దీంతో ఆయన్ను వెంటనే శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి గచ్చిబౌలిలోని ఓ ఆస్పత్రికి తరలించారని తెలుస్తోంది.
మిజోరం గవర్నర్ హరిబాబును ఆస్పత్రికి తరలించేందుకు ఎయిర్‌పోర్టు అధికారులు ఎమర్జెన్సీగా గ్రీన్‌ఛానల్ ఏర్పాటు చేశారని సమాచారం. హుటాహుటిన ఆయన్ను ఆస్పత్రికి తరలించారు. హరిబాబు ఆరోగ్య పరిస్థితిపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467